www.jagritiweekly.com

సంపుటి : 76 సంచిక : 36 పుటలు : 52

# జాగృతి

కలి 5126-శ్రీ క్రోధి ఆషాఢ శుద్ధ నవమి

15-21 జూలై 2024

వెల : ₹20/-



# విపక్షమా? విషవృక్షమా?




నరేంద్ర మోదీ నాయకత్వంలో దేశంలోని హిందువులు ముందెన్నడూ లేనంత ఆత్మగౌరవాన్ని, విశ్వాసాన్ని ప్రదర్శిస్తుండడాన్ని ప్రతిపక్షాలు సహించలేకపోతున్నాయని ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ లోక్‌సభ ప్రసంగం ద్వారా దేశం మొత్తానికీ అవగతమైపోయింది

జాగృతి చందాను చెల్లించడానికి పక్కనున్న క్యు.ఆర్.కోడ్‌ను మీ మొబైల్‌తో స్కాన్ చేయండి. లేదా http://payit.cc/S18970 అని బ్రౌజర్‌లో టైప్ చేయండి.


76 ఏళ్లుగా వెలువడుతున్న జాతీయ తెలుగు వారపత్రిక

# జగన్నాథ రథయాత్ర



వ్యాసం 11వ పేజీలో

# జ్ఞాన జ్యోతులకు దివ్యజోతలు



గురు ప్రసక్తి రాగానే వ్యాసుని స్మరణ చేయడం సహజం. ఆయన గురువులకు గురువు. వేదాలను విభజించాడు. అష్టాదశ పురాణాలను, బ్రహ్మసూత్రాలను రాశాడు. 'పంచమ వేదమై పరగిన' మహాభారతాన్ని నిర్మించి, దాని ద్వారా 'గీతా'మృతాన్ని పంచాడు. అలా విశాల హిందూ ధార్మిక వట వృక్షాన్ని పెంచి పోషించిన పరమ గురువు. ఆయన పేరుతో వెలసిన గురుపూర్ణిమ మన దేశంలో అనాదిగా సాగుతూ వస్తున్న గురుశిష్యపరంపరను గుర్తుకు తెచ్చే రోజు.

వ్యాసభగవానుడు భారతీయ విజ్ఞానజ్యోతి. సమస్త విద్యా సాగరాన్ని అపోశన పట్టిన అగస్త్యుడు. జాతికంతటికి ఏకైక సాంస్కృతిక శక్తిని ప్రసాదించిన గురుదేవుడు. భారతజాతి ఉద్ధరణ కోసం, ధర్మ సమైక్యత కోసం అవతరించి శిష్యప్రశిష్యులతో ధర్మసంస్థాపన చేసిన చారిత్రక వ్యక్తిగా శంకర భగవత్పాదులు తదితరులు అభిప్రాయపడ్డారు.

సత్యవతి–పరాశరులు ప్రణయ ఫలం కృష్ణద్వైపాయనుడు (వ్యాసుడు). వేదాధ్యయనాన్ని తపస్సుగా భావించి వేదాలను విశ్లేషించి విభజించి వ్యాసుడయ్యాడు. తన కుమారులు శుకుడు, పైలుడు, వైశంపాయనుడితోనూ, నారదాది రుషులతోనూ తాను రాసిన భారతాన్ని ప్రచారం చేయించాడు. ప్రపంచానికి విష్ణువు కథలను తెలియచెప్పాలనే ఉద్దేశ్యంతో భాగతం రాశారు. సాక్షాత్తు శ్రీమహా విష్ణువే వేదవ్యాసుడై భాగవత రచనతో విష్ణుభక్తి ప్రబోధించాడని రుషులు, మునులు, జ్ఞానులు కీర్తించారు. 'వదలక వేదవ్యాసులు నుడిగిన విదిత పావనము విష్ణుకథ' అని పదకవితా పితామహుడు తాళ్లపాక అన్నమాచార్య శ్లాఘించారు. విద్యా వ్యాప్తి కోసం వ్యాసుడు సరస్వతీ మందిరాలను ఏర్పాటు చేశారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని బాసర (వ్యాసపురి)లోని సరస్వతీమాత ఆలయం ఆ మహనీయుని ప్రసాదమే.

గురువు అంటే అజ్ఞానాంధకారాన్ని తొలగించి జ్ఞానజ్యోతిని చూపే వ్యక్తి. వ్యక్తికి తొలిగురువులు తల్లిదండ్రులు. జన్మనిచ్చిన వారు తీర్చిదిద్దితే, జీవన సూత్రాలను నేర్పేది గురువు. తరగతి గదుల్లో పాఠాలు బోధించేవారో, ఒక వ్యక్తి రూపాన్నో గురువుగా భావించడం సమంజసం. కానీ గురుత్వం అనేది వ్యక్తికి పరిమిత మైనది కాదు. గురుస్థానం ఒక సిద్ధాంతం.. ఒక మహాపురుషుడు.. ఒక ప్రవక్త... ఒక పవిత్ర గ్రంథం.., ఒక స్ఫూర్తికి చిహ్నం. అలా గురువు ఏ రూపం ద్వారానైనా మార్గదర్శనం చేయవచ్చు. వృద్ధ శిష్యులకు మౌన వ్యాఖ్యానంతో విద్యనేర్పిన దక్షిణామూర్తిగా, ఏకలవ్యునికి అన్నీ నేర్పిన ద్రోణుని మట్టి బొమ్మగా, శంకరుడికి ఎదురు పడిన చండాలుడిగా, అర్జునుడికి 'గీత'ను బోధించిన శ్రీకృష్ణుడిగా... ఇలా ఏ రూపంలోనైన ప్రబోధం చేయవచ్చు.

గురుత్వమనేది మనం గుర్తించి స్ఫూర్తిని పొందే అంశం. అది ముఖ్యంగా శిష్య ప్రతిష్ఠ స్థానం. ఒక మాటలో... అది జీవన దిక్సూచి, జీవితాలకు మార్గదర్శి. ఏ రంగంలోని వ్యక్తికైనా సలహా ఇచ్చేవారు, దారి చూపేవారు అవసరమవుతారు. జనన మరణాల అరణ్యాల నుంచి సత్ బోధనలతో సురక్షిత ప్రదేశానికి చేర్చేవారిని గురుతుల్యులుగానే పరిగణిస్తారు. జ్ఞానామృతభాండాన్ని ఒక తరం నుంచి మరొక తరానికి అందించేదే గురుపరంపర. ఈ సంప్ర దాయం హిందూ ధర్మంలోని ద్వైత, అద్వైత, విశిష్టా ద్వైత సంప్రదాయాలలో, బౌద్ధ,జైన మతాల్లో కని పిస్తుంది. గురుపాదాలను ఆశ్రయించకపోతే నిష్ప్ర యోజన మంటారు అపర మహేశ్వరులు ఆదిశంకరా చార్యులు. ఆయన 'ఉపదేశ సాహస్రి'లో గురువు విశిష్టతను వివరిస్తూ, 'జ్ఞానసాగరంలో పయనించే శిష్యులకు గురువు నావ లాంటివాడు. శిష్యులకు శ్రుతులు, స్మృతులు నేర్పడమే కాదు.. నియమాలను పాటించడంలో నిష్ణాతులుగా తయారుచేయాలి. రాగద్వేషాలను అదుపు చేయగల ఇంద్రియ నిగ్రహాన్ని అలవరచాలి. అరిషడ్వర్గాలకు దూరంగా వారిని సన్మార్గంలో నడిపించాలి. ఆదిగురువు బాధ్యత' అని విశదీకరించారు.

హిందూ సంప్రదాయం ప్రకారం, భగవంతుడి తరువాత ప్రత్యక్ష దైవాలు తల్లిదండ్రులను, గురువును దైవాలుగా భావిస్తారు. 'గురువు మూలంగానే భగవంతుడిని దర్శించాను కనుక దైవం, గురువు ఏకకాలంలో ప్రత్యక్షమైతే గురువుకే ప్రథమ నమస్కారం చేస్తాను' అన్నాడు కబీరు. 'నాకు శరీరాన్ని ఇచ్చిన నా తండ్రికి నేను రుణపడి ఉన్నాను. అయితే సరియైన విధంగా జీవించే జ్ఞానాన్ని ప్రసాదించిన నా గురువుకు ఇంకా రుణపడి ఉన్నాను' అని అలెగ్జాండర్ తను గురువు అరిస్టాటిల్ గురించి అన్నాడట.

గురువును సేవించి ధన్యులైన శిష్యులు వినయ శీలురై అపార జ్ఞానరాశిని పొందుతారు. తాను చెప్పింది చెప్పినట్లు ఆచరించి చూపే శిష్యుల పట్ల గురువులు ప్రసన్నులవుతారు. అవతార పురుషులు రామకృష్ణులు, వారి గురువులు వశిష్ఠ, విశ్వామిత్ర, సాందీపుడు అందుకు ప్రథమ ఉదాహరణలు. పరశు రాముని వద్ద భీష్ముడు, ద్రోణుని వద్ద అర్జునుడు, గోవింద భగవత్పాదుల వద్ద ఆది శంకరులు, యామునాచార్యుల వద్ద రామానుజులు, రామకృష్ణ పరమహంస వద్ద స్వామి వివేకానంద.. ఇలా ఎందరో గురుకృపతో ధన్యులయ్యారు. ★



డా॥ ఆరవల్లి జగన్నాథస్వామి
సీనియర్ జర్నలిస్ట్

Printed & Published by **Nagol Sreenivas Reddy** on behalf of **Jagriti Prakashan Trust** and printed at Kala Jyothi Process Pvt. Ltd, CFC 1&2, Raviryala, Maheswaram, Rangareddy - 501 359. and published at Jagriti Bhavan, 3-4-228/4/1, Lingampalli, Kachiguda, Hyderabad - 500 027.
**Editor : Dr. Goparaju Narayana Rao.**

**సర్క్యులేషన్ వివరాలు, ఫిర్యాదులు, వ్యాపార ప్రకటనల వివరాల కోసం (ఉ॥11 నుండి సా॥ 6 గంటల మధ్య) సంప్రదించండి.**

జి.తుకారాం : సర్క్యులేషన్ మేనేజర్
040-27561453 / 9959997013

**సంపాదక మండలితో సంప్రదింపుల కోసం (ఉ॥11 నుండి సా॥ 6 గంటల మధ్య)**

కె. దుర్గారెడ్డి : అసోసియేట్ ఎడిటర్ -
సబ్ ఎడిటర్ : - 9959991304

డిజైనర్ : చిగుళ్ల కుమార్, ఎడ్ల కృష్ణ

## చందాదారులకి గమనిక

చందాలను ఎవ్వరికి వ్యక్తిగతంగా చెల్లించవద్దు. మీ దగ్గరకు వచ్చే బల్క్ మెంబర్లకు (కార్యకర్తలకు) మాత్రమే చెల్లించి రసీదు తీసుకోగలరు. లేదా కింద ఇచ్చిన అంకౌంట్ ద్వారా చెల్లించగలరు.

ఫోన్ పే, గూగుల్ పే నుండి చెల్లించడానికి జాగృతి అకౌంట్ "To Bank / UPID" ఆప్షన్ వాడండి.

**Link / QR Code** ద్వారా మీ చందా చెల్లించినప్పుడు **Remarks** దగ్గర కట్టించిన కార్యకర్త పేరు ఫోన్ నెం. తప్పకుండా రాయించండి.

విడి ప్రతి రూ.20

**5 సం॥ల చందా రూ.4000** **సంవత్సర చందా రూ.850**

**బ్యాంకు ఖాతా వివరాలు**

**A/c Name & No. Jagriti Prakashan Trust, 920010061405325, Axis Bank, Kothapet Branch. IFSC : UTIB0002157, PAN : AAATJ3829L**

– సర్క్యులేషన్ మేనేజర్, జాగృతి


రాజ్యాంగ ప్రతి చేతబూని రాహుల్‌గాంధీ దేశమంతా ప్రచారం పేరుతో ఊరేగుతున్నప్పుడు అది పిచ్చివాడి చేతిలో రాయిని మరిపించిందే తప్ప, ఒక మహత్తర గ్రంథమని ఎవరూ భావించలేకపోయారు. ప్రతిపక్ష నేత హోదా దక్కిన తరువాత ఆయన వైఖరి కొత్త బిచ్చగాడు పొద్దెరగడు అన్నట్టే ఉంది. కాంగ్రెస్, ఈ శతాధిక వర్షాల పార్టీకి కొన్ని స్థానాలు బిచ్చం వేస్తున్న డీఎంకే, అయోధ్యలో కరసేవకులను ఊచకోత కోసిన ఎస్‌పీ, ముఖ్యమంత్రి పదవికోసం తండ్రి హిందుత్వ బాటను నిస్సిగ్గుగా అరేబియాలో కలిపేసిన ఉద్ధవ్ వంటి వారందరి ఏకైక కోరిక–బీజేపీని దించడం. కమలం పార్టీ ప్రజాదరణ కోల్పోతే ఆ పని చేయడానికి ఆ పార్టీలకు హక్కు ఉంది. కానీ భారతీయ జనతా పార్టీని గద్దెదించడం పేరుతో, నరేంద్ర మోదీని సాగనంపాలన్న సాకుతో ఈ దగాకోరుల ముఠా భారతదేశాన్నీ, భారతీయతనీ, మరీ ముఖ్యంగా హిందూత్వాన్ని దూషించే దుశ్చర్యకు పాల్పడుతున్నది. 18వ లోక్‌సభ తొలి సమావేశాలలో రాహుల్ ఊకదంపుడులో గుప్పుమన్నది ఆ దుర్గంధమే. తరువాత మోదీ సొంత రాష్ట్రానికి వెళ్లి బీజేపీని ఇక్కడా ఓడిస్తాం అని ఉత్తరకుమార ప్రగల్భాలు పలికారు రాహుల్. అంతకు ముందు ఎక్కడ ఓడించాడట? అయోధ్యలోనట.

ఎన్ని అబద్ధాలు! అగ్నివీర్ పథకం మీద అబద్ధం. అయోధ్యలో బీజేపీ ఓడిందంటూ మరొక పెద్ద అబద్ధం. అసలు మోదీకి మెజారిటీ లేదన్నది ఇంకా నికృష్టమైన అబద్ధం. అంతకు ముందు రఫెల్ ఒప్పందం మీద అబద్ధాలు. జీవిత బీమా సంస్థ గురించి అబద్ధం. ఇక ఈవీఎంల మీద అబద్ధాల వెల్లువ. ఎన్నికల ఫలితాలు వెల్లడికావడానికి కొన్ని గంటల ముందు షేర్ల మతలబంటూ మరొక తలా తోకా లేని అబద్ధం. ఇండీ ఓ దుష్ట గ్రహ కూటమి అనుకుంటే, రాహుల్‌కు ప్రతిపక్ష నేత బాధ్యతను అప్పగించడం ఆధునిక రాజకీయాలలో ఆ కూటమి చేసిన అతి పెద్ద తప్పిదం. ఇవాళ కాకుంటే రేపైనా భాగస్వాములు ఇది గ్రహించక తప్పదు.

ప్రతిపక్ష నేతగా రాహుల్ ఇచ్చిన తొలి ఉపన్యాసం నిండా ఉన్నది హిందూ ద్వేషమే. ఆ తరువాత గుజరాత్ వెళ్లిన రాహుల్ తన అజ్ఞానాన్ని, అహంకారాన్ని కలగలిపి ఆ రాష్ట్ర ప్రజల మీద వెదజల్లే ప్రయత్నం చేశారు. ఎన్నికలలో అయోధ్యలో

**శాలివాహన 1946 శ్రీ క్రోధి ఆషాఢ శుద్ధ నవమి**

## లోపలి పేజీలలో...




6లో


ముఖపత్ర కథనం
**విపక్షమా? విషవృక్షమా?**

ధారావాహిక నవల
**జన్మ**
– సంబరాజు లీల (లట్టుపల్లి)




20లో

ఆరోగ్యం
**ఆరోగ్యకరమైన ఆహారం అంటే..**



26లో

# జాగృతి

## సంపాదకీయం

బీజేపీని ఓడించి, లాల్ కృష్ణ అద్వాణి ప్రారంభించిన అయోధ్య ఉద్యమాన్ని అక్కడే భగ్నం చేశామనీ, ఇక నరేంద్ర మోదీని గుజరాత్‌లో మట్టి కరిపిస్తామనీ భీషణ ప్రతిజ్ఞ చేశారు. హిందువులుగా చెప్పుకునే వారంతా హింసా ప్రవృత్తితో, అసహనంతో ఊగిపోతుంటారని పార్లమెంటులో చెప్పిన మాటలకు కొనసాగింపే గుజరాత్ ప్రేలాపన. అయోధ్య ఉద్యమం అద్వాణితో ఆరంభమైందని చెప్పడమే రాహుల్ అజ్ఞానానికి పరాకాష్ట. అది ఐదు వందల ఏళ్ల మహోద్యమం. అది నాగరికత పట్ల వచ్చిన స్పృహతో సాగిన పునరుజ్జీవనోద్యమం. రాహుల్ అనే రాజకీయ అజ్ఞానికి తెలియని వాస్తవం అయోధ్య వరకు బీజేపీ ఓడిపోలేదు.

## ఇతడా విపక్షనేత?

శాసనసభ ఎన్నికలలో గాని, ఫైజాబాద్ లోక్‌సభ పరిధిలోని భాగంగా గాని అయోధ్య ప్రజలు బీజేపీకే ఓటేశారు. పార్లమెంటులో హిందువులను అవమానించిన రాహుల్, అయోధ్య ఉద్యమం నాలుగు దశబ్దాల పోరాటం మాత్రమేనని జాతిని నమ్మించడానికి ప్రయత్నించి అంతకంటే పెద్ద ద్రోహానికే పాల్పడ్డారు. అయోధ్య ఉద్యమానికి, ఎన్నికల రాజకీయాలకు ఏనాడూ సంబంధం లేదు. ఇవి ఆయా ఎన్నికల ఫలితాలే వెల్లడిస్తున్నాయి.

రాహుల్ దివాంధుడు. రెండు మూడు నాలుకలు ఉన్నవాడు. మణిపూర్ గొడవల గురించి పదే పదే ఊదరగొట్టే ఈ నాయకుడు పశ్చిమ బెంగాల్‌లో జరుగుతున్న హింసాకాండ గురించి మాట్లాడలేదు. అక్కడి హింసా రాజకీయాల గురించి సొంత పార్టీ వారే ఘోష పెడుతున్నా రాహుల్‌కు వినపడలేదు. తమిళనాడులో కల్తీ సారా కాటుకు నిన్న మొన్న 65 మంది చనిపోయిన వార్త ఆయన దాకా రాలేదు. హత్రాస్‌లో ఓ దొంగబాబా వికృతచేష్టలకు 125 చనిపోతే అక్కడికి హుటాహుటిన వెళ్లారు. తమిళనాడులో కంటే ఉత్తరప్రదేశ్‌లోని హత్రాస్ దుర్ఘటన మృతులు ఎక్కువ కదా అని రాహుల్ అభిమానులు ప్రశ్నించవచ్చు. కారణం అదికాదు. కల్తీ సారా కరాళ నృత్యం చేసినది నాలుగు సీట్లు బిచ్చంవేసే పార్టీ ఏలుతున్న తమిళనాడులో. 125 మంది చనిపోయినది బీజేపీ పాలిత రాష్ట్రంలో.

కేవలం బెయిల్ మీద స్వేచ్ఛా ప్రపంచంలో సంచరిస్తున్న రాహుల్‌కి ఇంతింత మాటలు అవసరమా? ఇంత చెలరేగిపోవాలా? 400కు పైగా లోక్‌సభ స్థానాలలో పోటీచేసి 99 స్థానాలకు పరిమితమైన అంగుష్టమాత్రుడికి ఈ నేల విడిచిన సాము వాంఛనీయమా? నేషనల్ హెరాల్డ్ కేసు మొత్తం గాంధీ–నెహ్రూ కుటుంబం నెత్తి మీద కత్తిలా వేలాడుతూనే ఉంది. ఆర్‌ఎస్ఎస్ సభ్యులు వేసిన పరువునష్టం కేసులు ఈ రాజకీయ అజ్ఞానిని, అబద్ధాల పుట్టని ఏ క్షణంలో అయినా కటకటాల వెనక్కి గెంటవచ్చునన్నది సత్యమే. వీటి భయంతోనే రాహుల్ ఇంతగా చెలరేగి మాట్లాడుతున్నారన్న మాట కూడా కొట్టివేయలేనిదే. ఆధునిక రాజకీయ రంగంలో రాహుల్ ఏ మాత్రం నైతిక విలువలు లేని వ్యక్తి. ఆయన ఎన్నికల ముందు 'జన్యుధారి హిందువు'. భారత్‌ను ఆగర్భశత్రువుగా చూసే చైనాతో రహస్య సంబంధాలు నెరిపే ఈ వ్యక్తిని ఏ పేరుతో పిలవాలి? మోదీకి నమస్కరించినప్పుడు వంగిన మీరు, నా ముందు ఎందుకు వంగలేదని లోక్‌సభ స్పీకర్‌ను ఉద్దేశించి సభలో పేలిన ఈ వ్యక్తి అహంకారాన్ని ఎవరు అంచనా వేయగలరు? అయినా రాహుల్‌లో హఠాత్తుగా పెల్లుబుకిన ఈ 'పరిణతి'ని దర్శించి పొంగిపోతున్న మేధావులు కోకొల్లలు. ముమ్మాటికీ రాహుల్ స్థానం పార్లమెంటు కాదు. చట్టం నిర్దేశించిన చోటకే. తనకోసం మొత్తం అన్ని వ్యవస్థలను భ్రష్టు పట్టించడానికి ఏమాత్రం వెనుకాడని వ్యక్తిని సభ్య ప్రపంచం భరించడం అవసరమా? ★

15 జూలై 2024, సోమవారం


అసతో మా సద్గమయ తమసో మా జ్యోతిర్గమయ మృత్యోర్మా అమృతంగమయ – బృహదారణ్యకోపనిషత్




కథ

**సహచరులు**

–మణి వడ్లమాని





| | | | | | |
|---|---|---|---|---|---|
| ఫ్రాన్స్‌లో హంగ్ పార్లమెంట్ (అంతర్జాతీయం) | – | 12 | మానసిక వైకల్యానికి మరో రూపమే "మహారాజ్"! | – | 32 |
| ఎటూ తేలని 'విభజన'పై భేటీ (తెలంగాణ) | – | 15 | భారత్‌కు బాసటగా ఇంగ్లండ్ కొత్తప్రభుత్వం(అంతర్జాతీయం–1) | – | 34 |
| 'కాళ్ల కిందకు నీరు వస్తోంది' (జాతీయం) | – | 23 | హత్రాస్ తొక్కిసలాట (జాతీయం–1) | – | 44 |
| 'శివ శంకరి' నవానంద లహరి (మహిళ) | – | 28 | ఒలింపిక్స్ బరిలో తెలుగింటి తారాజువ్వలు! (క్రీడ) | – | 43 |
| ప్రజా ఆకాంక్షలకు అనుగుణంగానే ఎన్డీఏ పాలన (ఆంధ్రప్రదేశ్) | – | 30 | ఉందిలే మంచి కాలం ముందు ముందునా! (సినిమా) | – | 50 |



దేశాన్ని దశాబ్దాలపాటు పాలించిన కాంగ్రెస్ పార్టీ బ్రిటిష్ వారి నుంచి విభజించు పాలించు అన్న సూత్రాన్ని పూర్తిగా వంటబట్టించుకుంది. మెజార్టీ హిందువుల సాత్విక ధోరణిని ఆసరాగా చేసుకొని, మైనార్టీలను బుజ్జగించడం, హిందువులు ఐక్యమవుతున్నారంటే వారిని కులాలపేరుతో విభజించడం దాని వ్యవహార శైలిగా కొనసాగింది. ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో దేశంలోని హిందువులు ముందెన్నడూ లేనంత ఆత్మగౌరవాన్ని, విశ్వాసాన్ని ప్రదర్శిస్తుండడాన్ని ప్రతిపక్ష పార్టీలు సహించలేకపోతున్నాయని ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ లోక్‌సభ ప్రసంగం ద్వారా దేశం మొత్తానికీ అవగతమైపోయింది. ఒక బలమైన వ్యక్తిత్వంగా రూపుదిద్దుకున్న

# విపక్షమా? విషవృ

ప్రతిపక్ష నాయకుడిగా రాహుల్ గాంధీ చేసిన ప్రసంగం అతడి పదవికి, హోదాకు తగినట్టుగా లేకపోవడం సరే, బదులుగా, ఘోర అబద్ధాలు, తప్పుడు వర్ణనలు ఆ పదవిని అవమానించాయి. సభలో ఫోటోలను ప్రదర్శించడం, హిందువులపై అతడు చేసిన వ్యాఖ్యలు పార్లమెంటు లోపలే కాదు బయట కూడా అలజడిని సృష్టించాయి. అగ్నివీర్, కనీస మద్దతు ధర సహా అతడు ఇచ్చిన తప్పుడు వివరణలు, అతడి కార్యనిర్వహణా పద్ధతులు ఎలా ఉండనున్నవో చూపించాయి. రాహుల్‌కు పార్లమెంటు కొత్త కాదు. అతడు ఐదుసార్లు ఎంపీగా ఎన్నికయ్యాడు, రెండుసార్లు అధికార కూటమిలో భాగంగా ఉన్నాడు, రెండుసార్లు ప్రతిపక్షంలో ఉన్నాడు. అయితే, బాధ్యత కలిగిన ఒక పదవిని నిర్వహించడం మాత్రం ఇదే తొలిసారి. ఆ విషయంలో అతడు ప్రదర్శించిన ఉత్సాహం కనిపిస్తున్నా, నిర్వివాదంగా బాధ్యత లోపించింది. అత్యుత్సాహం, క్రమశిక్షణా రాహిత్యం, చెప్పిందే చెప్పడం, అన్నింటికన్నా ప్రమాదకరంగా అబద్ధాలు చెప్పడం పెరిగాయి. అతడి ప్రసంగాలలో అసత్యాలు తప్ప విషయం కనిపించడం లేదు.

దిగువసభలో ప్రతిపక్ష సంఖ్య పెరిగిన నేపథ్యంలో ప్రతిపక్ష నాయకుడిగా రాహుల్ హయాంలో అసత్యాలు, తప్పుడు సమాచారం, అబద్ధ ప్రచారం ఉంటాయనే విషయం ఏ మాత్రం పరిశీలనాత్మక దృష్టితో చూసేవారికైనా అర్ధమైపోతుంది. లోక్‌సభ ఎన్నికలలో తన పార్టీ అత్యద్భుతంగా రాణించిందనే తప్పుడు అంచనాల్లో రాహుల్ ఉన్నాడనేది నిర్వివాదం. అయితే, వరుసగా మూడవసారి కూడా తమ పార్టీ వంద స్థానాలను కైవసం చేసుకోలేకపోయిందనే విషయాన్ని అతడు మరుగుపరుస్తున్నాడు. గతంతో పోలిస్తే కాంగ్రెస్ మెరుగుపడినప్పటికీ, అది ప్రస్తుతం అహంకారంగా రూపుదిద్దుకుంటున్న దాఖలాలు సభలో రాహుల్ గాంధీ ముఖ కవళికలను, ప్రవర్తనను గమనించిన ఎవరికైనా ఇట్టే అర్థమైపోతుంది. గతంలోనూ అహంకారం ఉన్నా, ఈసారి తానేదో ప్రధాని నరేంద్ర మోదీపై విజయం సాధించానన్న తప్పుడు విశ్వాసంతో వచ్చింది అది.

రాహుల్ తన ఉపన్యాసం మొత్తాన్నీ పార్లమెంటరీ ప్రవర్తనా నియమావళి నిర్దేశించినట్టు స్పీకర్‌ను ఉద్దేశించి కాకుండా, తన కూటమి సభ్యులను ఉద్దేశించే ప్రసంగించడం గమనార్హం. అంటే అతడు తన వారికి ఏ అబద్ధాలు ప్రచారం చేయవచ్చో చూపుతున్నాడన్న మాట. ప్రధాని మోదీ మాట్లాడే టప్పుడు గందరగోళం సృష్టించవలసిందిగా ప్రతిపక్ష సభ్యులకు అతడు సైగ చేయడం స్పష్టంగా కనిపించింది. పార్లమెంటరీ నిబంధనావళి పట్ల రాహుల్ గాంధీకి గల నిర్లక్ష్యం కొత్తేం కాదు. గత పార్లమెంటుల కాలంలో ప్రధాని మోదీని బలవంతంగా సభలోనే కౌగలించుకోవడం, వేరొక సభ్యుడికి కన్ను కొట్టడం, ఫ్లైయింగ్ కిస్‌లు ఇవ్వడం వంటివన్నీ చేయడానికి గాంధీ వంశపు వారసుడిగా తనకు హక్కు ఉన్నట్టుగా అతడు ప్రవర్తించడం అందరికీ తెలిసిన విషయమే. అయితే, అప్పుడు వాటన్నింటినీ అపరిణితి కలిగిన వ్యక్తి చేస్తున్న చేష్టలుగా భావించి, అందరూ కొట్టిపారేశారే తప్ప అతడి అహంకారాన్ని గుర్తించలేదు. ఇప్పుడు తనే స్వయంగా ప్రకటించిన నేపథ్యంలో భవిష్యత్తులో అతడి ప్రవర్తన పార్లమెంటులో ఎలా ఉండనుందో

డి. అరుణ



మోదీ ఇమేజ్‌ను ఎట్లా అయినా దెబ్బతీయాలనే పట్టుదలతో ఉన్న ప్రతిపక్షం దిగజారి మాట్లాడిన వెకిలి మాటలు, చేసిన చేష్టలు పార్లమెంటు చరిత్రలోనే అసభ్యమైనవిగా నమోదు అయి ఉంటాయి. హిందువులు నిరంతరం హింస, ద్వేషంలో నిమగ్నమై ఉంటారంటూ రాహుల్ చేసిన వ్యాఖ్యలకు అభ్యంతరపెడుతూ హిందుత్వమంటే భయాన్ని, ద్వేషాన్ని, అబద్ధాలను వ్యాప్తి చేస్తున్నారంటూ ప్రధాని మండిపడ్డారు. ప్రధాని మోదీ చేసిన రెండు గంటల ప్రసంగంలో కాంగ్రెస్‌ను, ప్రతిపక్ష పార్టీల కాపట్యాన్ని తూర్పారబట్టారు. తన వ్యంగ్యపూరిత ఉపన్యాసంతో అంత వేడిగా ఉన్న సభలో కాస్త నవ్వులు కూడా పూయించారు.

# క్షమా?

వేరే చెప్పనవసరం లేదు. ఈసారి ఎన్నికలలో కొద్ది ఎదురుదెబ్బ ఎదురైనా, బీజేపీ, ప్రధాని మోదీ దానిని అడ్డుకుంటారన్నది నిర్వివాదం.

అందుకే ఎన్డీయే ఎంపీలను రాహుల్ ప్రదర్శించిన వైఖరిని అనుసరించవద్దని ప్రధాని ఆదేశించినట్టు వార్తలు వచ్చాయి. సభలో క్రమశిక్షణతో వ్యవహరించవల సిందిగా ఆయన తన ఎంపీలను ఆదేశించారు కనుకనే, రాహుల్ గాంధీ నిరాటంకంగా, నిర్లజ్జగా ప్రసంగించి తన అసలు రంగును బయటపెట్టుకున్నాడు. గతంలో అనేకసార్లు చేసినట్టుగానే ఈసారి కూడా సభలో హిందువులకు వ్యతిరేకంగా బాధ్యతారహితమైన వ్యాఖ్యలు చేసి రాహుల్ గాంధీ తనను తాను ఇరుకున పెట్టుకున్నాడు. కులాలవారీగా హిందువులను విభజించేందుకు, ఎంత జనాభా ఉంటే అంత హక్కు అంటూ నినాదాలు, హిందువులకు వ్యతిరేకంగా చేసిన వ్యాఖ్యలు ఎంత అబద్ధమో, వాటన్నింటికీ అతీతంగా ఇటీవలే జగన్నాధ రథయాత్రలో పాల్గొన్న హిందువులు నిరూపించారు. ఈ రకంగా విభజించి పాలించాలన్న అన్నది అన్ని వేళలా సాధ్యం కాదని రుజువు చేశారు.

అగ్నిశేషం, రుణశేషం, శత్రుశేషం, రోగ శేషాలను ఉంచకూడదన్న విషయాన్ని ప్రధాని బాగానే గుర్తించారు. అందుకే, రాహుల్ గాంధీకి, అతడి వెనుక ఉన్న వారికీ వారి భాషలోనే సమాధానం చెప్తామని తీవ్రంగా హెచ్చరించారు. సమాజాన్ని విచ్ఛిన్నం చేయడం తప్ప మరొకటి ఎరుగని కాంగ్రెస్‌పార్టీ వారసుడు, కాలానుగుణ హిందువు అయిన రాహుల్ గాంధీ లోక్‌సభలో హిందువులను హింసావాదులుగా అభివర్ణిస్తూ చేసిన ప్రసంగానికి ప్రధాని మోదీ ఘాటుగా స్పందించారు. ప్రధాని మోదీ ప్రసంగిస్తున్నంత సేపూ డాట్ డాట్ కూటమి చేసిన అల్లరీ, అందుకు రాహుల్ గాంధీ ప్రత్యక్ష ప్రోత్సాహం టీవీల్లో చూసిన ప్రజలు వాస్తవాన్ని గ్రహించారు. విభజించడం తప్ప మరొకటి తెలియని రాజకీయ పార్టీల చేతిలో మరోసారి మోసపోయామని గ్రహించి ఉంటారు.

మొత్తం కాంగ్రెస్, దానిని ఆవరించి ఉన్న సంస్థలు, వ్యక్తులు ఈ మధ్య ఒక పిల్లవాడిని సంతోషపెట్టడానికి ప్రయత్నిస్తున్నాయని ప్రధాని మోదీ వ్యంగ్యంగా చేసిన వ్యాఖ్యానం అసలు నిజాన్ని బయటపెడుతోంది. పరిణితి లేకుండా ప్రతిపక్ష నాయకుడు చేసిన ప్రసంగం, అతడి ప్రవర్తన పిల్ల చేష్టల్లా ఉన్నాయంటూ ప్రధాని మోదీ ఎత్తి చూపారు. తాను చేసిన తప్పులు చెప్పకుండా సానుభూతి పొందేందుకు ప్రయత్నించిన బాలక్ బుద్ధి (పిల్ల చేష్ట) గోలను నిన్న లోక్‌సభ వీక్షించిందని, రాహుల్ శైలిని విప్పి చెప్పారు.

ఈ మధ్య కాంగ్రెస్ పార్టీ తామేదో ఎన్నికల్లో అద్భుతంగా రాణించినట్టుగా ప్రచారం చేసుకోవడాన్ని ప్రధాని మోదీ తప్పు పట్టారు. "వరుసగా మూడవసారి కాంగ్రెస్ 100 స్థానాలను మించలేదు. ఈ నేపథ్యంలో పరాజయాన్ని అంగీకరించడానికి బదులుగా, చాలా అహంకారాన్ని ప్రదర్శిస్తున్నారు. మాపై ఏదో గెలిచామన్న ప్రచారాన్ని నిర్మించేందుకు వారు యత్నిస్తున్నారు," అంటూ ప్రతిపక్షాల కాకిగోల మధ్య ప్రధాని వారి కుట్రను బట్టబయలు చేశారు.

రాహుల్ వ్యవహారానికి ఉపమానంగా ఒక పిట్టకథను చెప్పి, సభ్యులను నవ్వించారు. "తనకు 99 మార్కులు వచ్చాయంటూ అందరికీ చూపించుకుంటూ గప్పాలు కొడుతున్న బాలుడి కథ నాకు గుర్తు వస్తోంది. జనం 99 అన్న మాట వినగానే, అతడిని ప్రశంసించి, ఆత్మవిశ్వాసాన్ని మరింత పెంచుతుండేవారు. కానీ, ఆ బాలుడి టీచరు వచ్చి, అతడికి వచ్చింది 100కి తొంభైతొమ్మిది కాదని, 543లోననే సత్యాన్ని వెల్లడించింది. ఆ మూర్ఖపు పిల్లవాడికి అతడు పరాజయంలో ప్రపంచ రికార్డును స్థాపించాడనే విషయం ఎవరు చెప్తారు?" అంటూ మోదీ విచారం వ్యక్తం చేశారు.

అంతేనా, బాలీవుడ్ సినిమా షోలే నుంచి కూడా కొన్ని పాత్రలను ఉదహరించారు. కాంగ్రెస్ నాయకుల ప్రకటనలు షోలే సినిమాను మించి పోయాయి. కానీ ఆ సినిమాలో గుర్తుంచుకోవలసింది మౌసీజీ (అత్త).మేం మూడోసారీ ఓడిపోయాం మౌసీ, కానీ ఇది నైతిక విజయం. 13 రాష్ట్రాలలో సున్నా సీట్లు వచ్చాయి, అయినా నేను హీరోని అన్న చందంగా వ్యవహరిస్తున్నారని ప్రధాని కాంగ్రెస్ నాయకులను ఎగతాళి చేశారు.

సానుభూతి పొందేందుకు లోక్‌సభలో కొత్త డ్రామాను వేశారంటూ వ్యాఖ్యానించిన ప్రధాని దాని వెనుక ఉన్న కారణాన్ని కూడా బట్టబయలు చేశారు. "వేల కోట్ల రూపాయలను అక్రమంగా అపహరించి నందుకు వారు బెయిల్‌పై ఉన్నామని వారికి తెలుసు. ఓబీసీలు దొంగలన్నందుకు శిక్షపడి, దేశంలోని

అత్యున్నత న్యాయస్థానంలో తమ బాధ్యతారహితమైన వ్యాఖ్యలకు క్షమాపణ చెప్పవలసి వచ్చింది," అంటూ రాహుల్ పేరును ప్రస్తావించ కుండానే గతాన్ని గుర్తు చేశారు.

అలాగే, అగ్నిపథ్ పథకంపైన, కనీస మద్దతుధర పైనా పార్లమెంటును పక్కదోవ పట్టించేందుకు యత్నించడాన్ని మోదీ ఖండించారు. "కనీస మద్దతు ధరకు సంబంధించి అబద్ధాలు చెప్తున్నారు. అనుభవజ్ఞులైన నాయకులు అరాచక మార్గాన్ని ఎంచుకోవడమంటే, దేశం సమస్యల్లోకి పయని స్తోందని తెలియచేస్తోందని" ప్రధాని హెచ్చరించారు. అంతేకాదు, పార్లమెంటు సవ్యంగా సాగాలని గత సోమవారం జరిగినదంతా చిరునవ్వుతో మీరు సహించారని స్పీకర్‌ను ప్రశంసిస్తూ, అటువంటి ప్రయత్నాలను 'బాలక బుద్ధి' అన్న పేరుతో విస్మరించ కూడదని, దీని వెనుక లోతైన కుట్ర ఉందని కూడా హెచ్చరించారు.

### ప్రజాభిప్రాయాన్ని గౌరవించండి

గత పదేళ్లుగా తమ ప్రభుత్వం ఎంత నిబద్ధతతో పనిచేసిందో, ప్రజలు చూశారని, మూడవ పదవీ కాలంలో పని వేగాన్ని మూడింతలు పెంచుతాం. పనులు చేయడానికి మూడింతలు శక్తిని ఉపయో గిస్తాం, మూడవ పర్యాయం మూడింతల ఫలితాలు వచ్చే హామీ ఇస్తామంటూ, మోదీ విశ్వాసాన్ని వ్యక్తం చేశారు. ప్రతిపక్షంలో కూర్చుని, వాదించడానికి ఏమీ లేనప్పుడు, కాకిగోల చేయాలనేది బీజేపీ ప్రత్యర్థులు నిర్ణయించుకున్నారని మోదీ ఆరోపించారు. ప్రజా నిర్ణయాన్ని నిజాయితీగా అర్థం చేసుకొని, అంగీకరించండి. ప్రజాభిప్రాయాన్ని అంగీకరించి, ఈ కృత్రిమ విజయోత్సవాల వెనుక దాక్కోవద్దని కాంగ్రెస్‌ను విజ్ఞప్తి చేస్తున్నానంటూ మోదీ అన్నారు.

### నీట్ పేపర్ లీక్‌పై మండిపాటు

యువత భవిష్యత్తుతో ఆటలాడుకునేవారెవరినీ విడిచిపెట్టేది లేదంటూ మోదీ హెచ్చరించారు. నేషనల్ ఎలిజిబిలిటీ-కమ్-ఎంట్రెన్స్ టెస్ట్ (ఎన్ఈఈటి) వ్యవహారానికి సంబంధించి దేశ వ్యాప్తంగా నిందితుల అరెస్టులు జరుగుతున్నాయని మోదీ చెప్పారు. ఇటువంటి సంఘటనలను నియంత్రించే విషయంపై ప్రభుత్వం గంభీరంగా ఉందని యువతకు, విద్యార్థులకు హామీ ఇస్తున్నాను. మా బాధ్యతలను నిర్వర్తించేందుకు యుద్ధ ప్రాతిపదికన వడివడిగా చర్యలు తీసుకుంటున్నామని అన్నారు. కేంద్రం ఇప్పటికే కఠినమైన చట్టాలు రూపొందించింది, పరీక్షలు నిర్వహించే ఈ మొత్తం వ్యవస్థనూ బలోపేతం చేసేందుకు ముఖ్యమైన చర్యలు తీసుకుంటున్నామని ప్రధాని వెల్లడించారు. ఈ కేసులో ముగ్గురు ముస్లింలు అరెస్టు కావడంతో ప్రతిపక్షం ఇప్పుడు గతుక్కుమంది.

### మణిపూర్ వ్యవహారంపై

మణిపూర్‌లో అనేక కుటుంబాలు సమస్యలను, కష్టాలను ఎదుర్కొంటున్నాయి. అందులో అనేకమంది తమవారిని కోల్పోగా, మహిళలపై దారుణమైన అత్యాచారాలు జరిగాయి. ఈ పరిస్థితిని చక్కదిద్దేం దుకు కేంద్రం, రాష్ట్ర ప్రభుత్వాలు కలిసి పని చేస్తున్నాయి. ఈ రాష్ట్రం వెలుగులను చూస్తుందని దేశానికి హామీ ఇచ్చారు. మనందరం కలిసి దానిని ఎదుర్కొందాం, అక్కడ శాంతిని నెలకొల్పుదాం. మణిపూర్‌ను తిరిగి అభివృద్ధి పట్టాలు ఎక్కించేందుకు అన్ని ప్రయత్నాలూ చేస్తామని హామీ ఇచ్చారు.దానితో పాటుగా, ఎన్ని అరెస్టులు జరిగాయి, ఎంత మాదకద్రవ్యాలను స్వాధీనం చేసుకున్నారు వంటి వివరాలు ఇచ్చారు. మణిపూర్‌ను, మొత్తం ఈశాన్య ప్రాంతంను పట్టి పీడిస్తున్న సమస్యలకు మూలాలు కాంగ్రెస్ రాజకీయాలలో ఉన్నాయని విమర్శించారు.

### ప్రతిపక్ష కూటమిపై వ్యంగ్య బాణాలు

ప్రతిపక్ష కూటమిని పొగరుమోతు వంశాల సమూహమని అభివర్ణిస్తూ, వారు భారత్‌ను రెండు శతాబ్దాల వెనక్కి తీసుకువెడతారని వ్యంగ్యాస్త్రాలు సంధించారు. ద్వేషాన్ని వ్యాపింపచేస్తున్నామన్న వారి ఆరోపణలను తిప్పికొడుతూ, 'ప్రతిపక్షం లూట్‌కి దుకాణ్, నఫ్రత్ కా బజార్' చందమని ప్రధాని అన్నారు. ప్రతిపక్షాల విశ్వసనీయతను ప్రశ్నిస్తూ, వారు మనుగడ కోసం కుటుంబ పార్టీ సహా 26 పార్టీల అహంకారం, ఇండియాను డాట్ డాట్‌గా విడగొట్టారని అన్నారు. ప్రతి విషయంలోనూ మమ్మల్ని పరీక్షించిన తర్వాత దేశ ప్రజలు ఇచ్చిన నిర్ణయమిది, పదేళ్ల మా ట్రాక్ రికార్డును ప్రజలు చూశారు. మానవసేవే మాధవ సేవ అన్న మంత్రాన్ని నెరవేరుస్తూ, పేదల సంక్షేమానికి మేము కట్టుబడి ఎలా పని చేశామో ప్రజలు చూశారు. ఎన్ని అబద్ధపు ప్రచారాలు చేసినా, వాటిని సమగ్రంగా ప్రజలు ఓడించిన వారి బాధను నేను అర్థం చేసుకోగల నంటూ ప్రధాని వ్యంగ్యాస్త్రాలు సంధించారు.

### రాహుల్ అహంకారం

ప్రధానమంత్రి ప్రసంగిస్తున్నంత సేపూ ప్రతిపక్షాలు నిరాటంకంగా నినాదాలు చేస్తూ అడ్డగించే ప్రయత్నం చేస్తూనే ఉన్నాయి. వారి ఓపికను శక్తినీ మనం మెచ్చుకున్నా, ప్రధాని పదవిని, భారత పార్లమెంటు సంప్రదాయాలను అవమా నించేలా ఉన్న వారి ప్రవర్తన, ఉద్దేశాలు మాత్రం అప్రియంగానే అనిపిం చాయి. ప్రధానమంత్రి మోదీ మాట్లాడు తున్నప్పుడు లేచి నిలబడి, తన తోటివారిని వెల్‌లోకి వెళ్లమని ప్రోత్సహిస్తున్న రాహుల్‌ను లోక్‌సభ స్పీకర్ ఓంబిర్లా మందలించవలసి వచ్చింది. తమ స్థానాలు 52 నుంచి ఒక్కసారిగా 99కి చేరుకున్న హాంగోవర్ నుంచి రాహుల్‌గాంధీ ఇంకా తేరుకోలేదని అతడి ప్రవర్తన చూసిన వారందరికీ అనిపిస్తుంది. కొన్ని ఏళ్లుగా తన పరాజయంపై పేలిన జోకులకు ప్రతీకారం తీర్చుకోవాలన్న పట్టుదలతో, ఉన్మాదంతో కనిపించాడు.

ప్రధాని మోదీపై వ్యంగ్యాస్త్రాలు సంధించడం, తక్కువ చేసి మాట్లాడడం అన్నీ కూడా ఉద్దేశ పూర్వకంగా చేస్తున్నవే. మోదీని బలహీనపరచి, ఆయనను నిస్సహాయ స్థితిలోకి తీసుకువెళ్లాలన్న పట్టుదలతో ప్రతిపక్షాలు ఉన్నాయి. ఆ రకంగా, మోదీ బలమైన వ్యక్తిత్వం ఉన్నవాడనే ఇమేజీని ధ్వంసం చేయడం ద్వారా ఎన్డీయే మిత్రపక్షాలు ఆయనను విడిచి వెళ్లేలా చేయాలన్నిదే వారి ఆకాంక్ష. ఆ రకంగా ప్రభుత్వం పడిపోతుందన్నది వారి లెక్క. కానీ, ఇక్కడ వారు ఒక్క విషయాన్ని మర్చిపోయారు. నేడు ప్రధాని మోదీ ఇంత కటువుగా, బలంగా ఉన్నారంటే



ప్రధానమంత్రి ప్రసంగిస్తున్నంత సేపూ ప్రతిపక్ష పార్టీలు నిరాటంకంగా నినాదాలు చేస్తూ అడ్డగించే ప్రయత్నం చేస్తూనే ఉన్నాయి. వారి ఓపికను శక్తినీ మనం మెచ్చుకున్నా, ప్రధాని పదవిని, భారత పార్లమెంటు సంప్రదాయాలను అవమానించేలా ఉన్న వారి ప్రవర్తన, ఉద్దేశాలు మాత్రం అప్రియంగానే అనిపిం చాయి. ప్రధానమంత్రి మోదీ మాట్లాడు తున్నప్పుడు లేచి నిలబడి, తన తోటివారిని వెల్‌లోకి వెళ్లమని ప్రోత్సహిస్తున్న రాహుల్‌ను లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా మందలించవలసి వచ్చింది.


అందుకు కారణం కాంగ్రెస్ పార్టీ, వారి చంకలో ఉన్న మీడియా 12 ఏళ్లపాటు ఆయనను వెంటాడి వేధించడమేనన్నది మరచిపోకూడదు.

ఇంత గందరగోళం జరిగినా, కొత్త పార్లమెంటు 34 గంటల్లో ఏడు సిట్టింగులతో 104 శాతం ఉత్పాదకతను సాధించింది. నిబంధన 377 కింద మొత్తం 41 అంశాలను చేపట్టగా, 73 ఎ నిర్దేశాల కింద మూడు ప్రకటనలు చేయడమే కాదు, 338 పత్రాలను పార్లమెంటులో ఉంచారు. బీజేపీ వంటి రాజకీయ శక్తితో కాంగ్రెస్ నిర్లక్ష్యంగా కాక అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉంది. ప్రతి వ్యవస్థను నియంత్రించడమే కాదు, ప్రతి దుష్ప్రవర్తనను, స్కాంను లేదా ద్రోహాన్ని గమనిస్తూ ఉంటుంది. అందుకే ప్రధాన మంత్రి ప్రతిపక్షాలు, దాని ఈకో సిస్టమ్ చేసే ప్రతి కుట్రను వారి భాషలోనే సమాధానం చెప్తానంటూ హెచ్చరించిన విషయాన్ని గుర్తు పెట్టుకోవాలి.

**ప్రజాస్వామ్యబద్ధమైన ప్రవర్తనేనా?**

ఒక ప్రతిపక్ష నేత ఇంతగా అసత్యాలను, ద్వేషాన్ని వ్యాప్తి చేయడం అన్నది ప్రజాస్వామ్యానికి ప్రమాదఘంటికే. తమది గొప్ప విజయమని, బీజేపీది నిర్ణయాత్మక పరాజయమని కాంగ్రెస్ నేతృత్వంలోని ప్రతిపక్షాలు భావిస్తుంటే అవి పెద్ద పొరపాటు చేస్తున్నాయి. గోబెల్స్ ప్రచారాన్ని మించి అసత్యాలను ప్రచారం చేసి, సత్యంగా చెలామణి చేయాలన్నది రాహుల్ ఆకాంక్ష. సోషల్ మీడియా అందుకు ఆస్కారమిస్తోంది. ఎన్నికల కాలంలో బీజేపీ రాజ్యాంగాన్ని రద్దు చేయాలనుకుంటోందంటూ ప్రచారం చేశాడు. అలాగే, ప్రాణప్రతిష్ఠ సమయంలో ఆ ప్రాంతంలో పేదలనెవరినీ రానివ్వలేదంటూ రాహుల్ మరొక పెద్ద అబద్ధం ఆడేశాడు. అగ్నివీర్ పథకం గురించి ఆసువుగా అందులో చేరిన యువత గతి అథోగతేనని, మరణించినవారికి కూడా

**ప్రతిపక్ష నేత బాధ్యతలు తీసుకున్నందున అతడు బాధ్యతగా వ్యవహరిస్తాడని అందరూ ఆశించారు. కానీ అతడి ప్రతి అడుగూ వ్యూహాత్మంగా వేస్తూ, బీజేపీ అత్యద్భుతంగా రాణించిన మౌలిక సదుపాయాల రంగంపై అవిశ్రాంతంగా దాడులు చేస్తున్నాడు. దేశభద్రత విషయంలో బీజేపీ అత్యంత శ్రద్ధ పెట్టి ముందుకు వెడుతోంది. ఆ ఇమేజ్‌ను ధ్వంసం చేసేందుకు అగ్నివీర్‌ను అడ్డంపెట్టుకొని నానా అబద్ధాలు ఆడేశాడు. రక్షణమంత్రి వాస్తవాలను సభలోనే చెప్పినా, నమ్మనట్టుగా నటించి, ప్రజల్లో అనుమానాలు కలిగించే ప్రయత్నాలు చేశాడు.**



ఒక్కపైసా రాదంటూ మాట్లాడిన మాటలను తర్వాత వీరగతి పొందిన జవాను కుటుంబమే ఖండించింది. పార్లమెంటులో ఒక నిర్మాణాత్మకమైన పాత్రను పోషించవలసిన ప్రతిపక్షం, ఇటువంటి విధ్వంసక పాత్రను పోషించడం ప్రజాస్వామ్యంలో శోభించదు.

**అబద్ధ ప్రచారం వ్యూహంలో భాగమే.**


గత పది సంవత్సరాలలో రాహుల్ గాంధీ భారతీయ ప్రజాస్వామ్యాన్ని, భారత ప్రభుత్వాన్ని, జాతి ప్రయోజనాలను పలు సందర్భాలలో ఖండించాడు, వేళాకోళం చేశాడు. ఇదంతా వ్యూహాత్మకంగా చేస్తున్నాడని అనేకమంది గ్రహించలేకపోయారు. గత ఏడాది మార్చిలో లండన్ వెళ్లినప్పుడు, మా ప్రభుత్వం ప్రతిపక్షం ఆలోచనలను చర్చించడానికి ఇష్టపడదు అంటూ వ్యాఖ్యానించిన రాహుల్ గాంధీ, ప్రతిపక్ష నేతగా తనకు అవకాశం వచ్చినప్పుడు కేవలం అబద్ధాలు మాత్రమే చెప్తున్నాడు. 2015–19 మధ్య కాలంలో సగటున రెండువందల నలభై ఏడుసార్లు విదేశాలలో పర్యటించాడు. అందులో ఏడుసార్లు పరిగణనలోకి తీసుకోవలసినవి. ఎందుకంటే, అతడు విదేశీ గడ్డపై భారత ప్రభుత్వంపై దాడి చేశాడు, తప్పుడు వ్యాఖ్యలు చేశాడు.

ఇప్పుడు ప్రతిపక్ష నేత బాధ్యతలు తీసుకున్నందున అతడు బాధ్యతగా వ్యవహరిస్తాడని అందరూ ఆశించారు. కానీ అతడి ప్రతి అడుగూ వ్యూహాత్మంగా వేస్తూ, బీజేపీ అత్యద్భుతంగా రాణించిన మౌలిక సదుపాయాల రంగంపై అవిశ్రాంతంగా దాడులు చేస్తున్నాడు. దానిని నిర్వీర్యం చేసేందుకు కాంగ్రెస్ కంకణం కట్టుకుందని, ఢిల్లీ విమానాశ్రయంలో కప్పు కూలినప్పుడు వారు చేసిన అల్లరి బయటపెడుతోంది. అలాగే, దేశభద్రత విషయంలో బీజేపీ అత్యంత శ్రద్ధ పెట్టి ముందుకు వెడుతోంది. అందుకే, ఆ ఇమేజ్‌ను ధ్వంసం చేసేందుకు అగ్నివీర్‌ను అడ్డంపెట్టుకొని నానా అబద్ధాలు ఆడేశాడు. రక్షణమంత్రి వాస్తవాలను సభలోనే చెప్పినా, నమ్మనట్టుగా నటించి, ప్రజల్లో అనుమానాలు కలిగించే ప్రయత్నాలు చేశాడు.

**హిందువులు, హిందుత్వ ఒక్కటే**

వామపక్ష, ఉదారవాద, ఇస్లామిస్టు లాబీ హిందూధర్మానికీ, హిందుత్వకు మధ్య భేదం ఉందని ప్రచారం చేసినా పెద్దగా విజయవంతం కాలేక పోయారు. కానీ, సభలో చేసిన ప్రసంగం ద్వారా దానిని పునరుజ్జీవింపచేసే ప్రయత్నం రాహుల్ చేశాడు. హిందువులలో అయోమయాన్ని సృష్టించి, రాజకీయ లబ్ధిపొందాలన్న ప్రయత్నం నిస్సందేహంగా జరుగుతున్నది. నెహ్రూ కాలంలో సెక్యులరిజం ముసుగు వెనుక నిజాన్ని చెప్పలేక పోవడానికి పరిస్థితులు కలిసి రాలేదు, ఇప్పుడు దానికి సమయం ఆసన్నమైంది. అందుకు హిందువులు కూడా బాధ్యత తీసుకోవలసి ఉంటుంది.

ప్రపంచంలోనే అత్యంత ప్రాచీనమైన నాగరికత చెందినవారిగా దానిని కాపాడుకునేందుకు అనేక





స్థాయుల్లో పని చేయవలసిన అవసరం ఉంది. రాహుల్ గాంధీ ఆ వ్యాఖ్యలు చేసింది బీజేపీని ఇరుకున పెట్టేందుకు మాత్రమే కాదు. విదేశాలలో ఉన్న అతడి యజమానులు భారత సమాజాన్ని ఎలాగైనా విభజించి తీరాలన్న పట్టుదలతో ఉన్నందునే అతడు అటువంటి ప్రసంగాన్ని చేశాడు. ద్వేషం, అరాచకతను దేశంలో ప్రజ్వరిల్ల చేసేందుకు ఇప్పటికే ప్రణాళికలు సిద్ధంగా ఉన్నాయి. శ్రీరామచంద్రుడితో అసలు తమకు సంబంధమే లేదన్నట్టుగా డీఎంకే ఇప్పటికే రాగాలాపన మొదలెట్టిన విషయం తెలిసిందే. అసలు రాముడు ఎవరు? దక్షిణాదితో రాముడికి సంబంధం ఏమిటి అంటూ గతంలో డీఎంకే నాయకుడు ఒకడు చేసిన వ్యాఖ్యలు గుర్తుండే ఉంటాయి. దీనిని బట్టి, వీరు కేవలం కులాల మధ్యే కాదు, శైవులు వర్సెస్ వైష్ణవుల మధ్య కూడా చిచ్చుపెట్టేందుకు యత్నాలు ప్రారంభించారు. ఈ ప్రచారాన్ని మరింత ముందుకు తీసుకువెళ్లేందుకు దక్షిణాదిని విభజించాలన్న డిమాండ్‌తో గత ఏడాది కేరళలలో వామపక్షులు, కాంగ్రెస్ నాయకులు సదస్సు నిర్వహించారు.

బీజేపీ ఎంపీలలో ఆత్మవిశ్వాసాన్ని దెబ్బ తీసేందుకు సభలో రాహుల్, 'మీరు హిందువులు కాదు. ఆర్ఎస్ఎస్ బీజేపీలు హిందుత్వానికి ప్రతినిధులు కాదు,' అంటూ గొంతు చించుకున్నాడు. కానీ, ఎదుటివారు ఎవరో చెప్పేందుకు హిందూ ధర్మం అనుమతించదు. ఈశ్వరవాది అయినా నిరీశ్వరవాది అయినా వారిని గౌరవిస్తుందే తప్ప నువ్వు ఇది అంటూ వారిని తప్పుగానో, సరిగానో నిర్వచించదు. కానీ, అబ్రహామిక్ మతానికి చెందిన రాహుల్ గాంధీ చిన్న బుర్రలోకి ఈ విషయం ఎక్కలేదు. తాను ఇక్కడ ఇంత స్వేచ్ఛగా తిరగగలుగుతున్నాడంటే కారణం, హిందూమతంలో గల ఈ సహనమేననే విషయాన్ని అతడు ఇవాళ కాకపోయినా రేపైనా గుర్తించి తీరాలి.


తెలుపు, నలుపులుగా విషయాన్ని విభజించి, ముందుకు తీసుకువెళ్లేందుకు ప్రయత్నాలు జరుగుతున్నది. ఈ విషయాలను సూక్ష్మరూపంలో, సానుకూలంగా అర్థం చేసుకోవడం అవసరం. మనది హిందూయిజం కాదు, హిందుత్వ లేక హిందూ ధర్మం ('యిజం' అనేది సంకుచితత్వాన్నే సూచిస్తుంది). ఇది మన దేశీయ తాత్వికతను, విశ్వాసాలను ప్రతిఫలిస్తుంది. నిజానికి హిందుత్వం మతం కాదు, ఒక జీవన విధానం. సుప్రీం కోర్టు కూడా ఇదే విషయాన్ని నొక్కి చెప్పింది.

'ధారయతి ఇతి ధర్మః' అంటే మనను నిలబెట్టేది, ఉద్ధరించేదే ధర్మం. ధర్మానికి అనేక పర్యాయపదాలు ఉన్నాయి. మనిషిగా మనం కుటుంబానికి, సమాజానికీ చేయవలసిన పనులు, బాధ్యతలు కూడా ధర్మమే. సత్యాన్ని అనుసరించడం కూడా ధర్మమే. అహింసను, అవసరమైతే సమాజాన్ని పట్టి పీడించే దుష్టులను సంహరించడమూ ధర్మమే. ఇంత విస్తృతమైన రీతిలో భారతీయులు దీనిని పరిగణిస్తారు కనుక ఆంగ్లేయులు దీనికి ఒక పదాన్ని ఇవ్వలేకపోయారు. నిజానికి భారతీయ ఆత్మకు ఈ భావనే పొందికను ఇస్తోందన్నది నిర్వివాదం. తన తాత్విక మూలాలను చెక్కుచెదరనివ్వకుండానే, ఇతర మతాలను ఆహ్వానించి, కలుపుకునే సామర్థ్యాన్ని హిందూత్వం కలిగి ఉంది. అందుకే, దేశంలో ఇన్ని మతాలు, పద్ధతులు కనిపిస్తాయి. కానీ, ఇప్పటివరకూ అవి సమాజం పనిలో ఎప్పుడూ అడ్డురాలేదు.

అలాగే, భారతీయ సమాజానికి ప్రజాస్వామ్య భావన కొత్తకాదు. కౌటిల్యుడి దగ్గర నుంచి వైశాలి రాజులవరకు అందరూ ప్రజాస్వామ్యం గురించి మాట్లాడారు. తన పేరులో 'గాంధీ' అనే తోక ఉండటానికి కారణమైన మహాత్మా గాంధీ కూడా గ్రామీణ రిపబ్లిక్‌ల గురించి మాట్లాడిన విషయాన్ని రాహుల్‌కు ఎరుక కూడా ఉన్నట్టు లేదు. ఈ సనాతన ధర్మం ఎన్నో అంతర్గత, బహిర్గత దాడులను ఎదుర్కొంది. సమాజంలో ఎన్నో ఒడిదుడుకులను చవి చూసింది, అయినప్పటికీ అది నిత్యనూతనంగా ప్రవహిస్తూనే ఉంది. ఆ విషయాన్ని ఎవరైనా రాహుల్‌కు బోధించాల్సిన అవసరం ఉంది. ప్రజలు కూడా తమ ధర్మాన్ని గుర్తించాలి.

ఫ్రాన్సు, యుకె వంటి దేశాలలో ఇటువంటి కుట్రలవల్లే వామపక్షవాదులు అధికారాన్ని కైవసం చేసుకున్నా, ఇక్కడ హిందువులు విజ్ఞతతో వ్యవహరించడం వల్లే ఎన్డీయే తిరిగి అధికారంలోకి వచ్చింది. ఇందుకు హిందువులను అభినందించవలసిందే. ఇదే విజ్ఞతతో ముందుకు వెళ్లినప్పుడు మాత్రమే భారతదేశం తన పునర్వైభవాన్ని సాధించగలదు. ★

ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన పూరి జగన్నాథస్వామి రథయాత్ర ఆషాఢ శుద్ధ విదియ (జులై 7)నాడు ఘనంగా ప్రారంభమై రెండు రోజుల పాటు కొన సాగింది. సాధారణంగా రథయాత్రను ఒకే రోజు నిర్వహిస్తారు. 1971 తరువాత ఈసారి రెండు రోజుల పాటు నిర్వహిం చారు. ఒకేసారి జగన్నాథ నవయౌవన దర్శనం, నేత్రోత్సవం, రథయాత్ర జరిగాయి. ఈ రథయాత్రలో సుమారు 20 లక్షల మందికి పైగా భక్తులు హాజరయ్యారని అంచనా. పురుషోత్తమ క్షేత్రంతో రాష్ట్ర రాష్ట్రేతర ప్రాంతాలు, విదేశాల్లో ఈ ఉత్సవం కన్నుల పండుగగా జరిగింది ఆలయ పరిసరాలు, ఊరేగింపు ప్రాంతాలు 'జై జగన్నాథ్' నినాదాలతో ప్రతిధ్వనించాయి.



పూరీ జగన్నాథుడికి మొక్కుతున్న రాష్ట్రపతి ముర్ము

# జగజ్జేయమానం జగన్నాథ రథయాత్ర

పూరి రథోత్సవంలో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము పాల్గొనడమే కాకుండా రాష్ట్ర గవర్నర్ రఘుబర్ దాస్‌తో కలసి సుభద్ర రథం తాడును లాగారు. రథయాత్రకు హాజరైన మొదటి రాష్ట్రపతిగా నిలిచారు. అంతకు ముందు పూరి గజపతి మహరాజు బంగారు చీపురుతో రథాలను శుభ్రపరచి శుద్ధి కార్యక్రమం నిర్వహించారు.



ఒడిశా ముఖ్యమంత్రి మోహన్ చరన్ మాఝీ, కేంద్రమంత్రి ధరేంద్ర ప్రధాన్, మాజీ ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ రథయాత్రలో పాల్గొన్నారు.

బలభద్ర, సుభద్ర, జగన్నాథుల రథాలు తాళధ్వజ, పద్మధ్వజ, నందిఘోష్ వరుసగా గుడించా మందిరానికి చేరాయి. బలభద్రుని రథం ముందు భాగంలో, దాని వెంట సోదరి సుభద్ర రథం వెళుతుంటే జగన్నాథుడి తేరు వాటిని అనుసరిస్తుంది.ఇది. చెల్లెలిని సు'భద్రం'గా చూసుకోవాలన్న తత్త్వాన్ని బోధిస్తున్నట్లుంటుంది. గుడించా మందిరం నుంచి తొమ్మిది రోజుల తరువాత తిరుగు ప్రయాణం (బహుదాయాత్ర) ఉంటుంది.

**భద్రతా ఏర్పాట్లు**

పూరిలో ఏఐ సాంకేతికతను ప్రయోగాత్మకంగా తొలిసారి అమలు చేశారు. 40 ప్రదేశాల్లోని సీసీటీవీలకు దీనిని అనుసంధానం చేశారు. భక్తజన రద్దీని గుర్తించి, నియంత్రించేందుకు డ్రోన్ వ్యవస్థను సమర్థంగా వినియోగించుకున్నట్లు పోలీసు ఉన్నతాధికారులు తెలిపారు. లక్షలాది భక్తులు హజరైన సందర్భంగా పోలీసులు గట్టి భద్రతా చర్యలు చేపట్టినప్పటికీ, అనూహ్యంగా తొక్కిసలాట చోటు చేసుకుని ఒకరు మరణించారు. పలువురు గాయపడ్డారు

దేశ రాజధాని ఢిల్లీలో రథయాత్రకు కేంద్ర మంత్రి గజేంద్రసింగ్ షెకావత్ హాజరయ్యారు. చత్తీస్‌ఘడ్‌లోని రాయపూర్ రథయాత్రలో ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి విష్ణుదేవ్ పాల్గొన్నారు. కోల్‌కతాలో ఇస్కాన్ ఆధ్వర్యంలో జరిగిన రథయాత్రలో పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతాబెనర్జీ పాల్గొని బలభద్ర, సుభద్ర ,జగన్నాథుల విగ్రహాలకు హారతి ఇచ్చి, రథాల తాళ్లు లాగడం ద్వారా యాత్రను ప్రారంభించారు. అగర్తలలో ఇస్కాన్ నిర్వహించిన రథోత్సవానికి త్రిపుర ముఖ్యమంత్రి మణిక్ సాహ హాజరయ్యారు.

**భాగ్యనగరిలో**

హైదారాబాద్ జుబ్లీహిల్స్‌లోని జగన్నాథ మందిరం, నగర శివారులోని సంస్కృతి టౌన్ షిప్ (సింగపూర్ టౌన్‌షిప్) మందిరం ఆధ్వర్యంలో రథయాత్ర ఘనంగా జరిగింది. ఇస్కాన్ ఆధ్వర్యంలో ఎన్టీఆర్ స్టేడియం వద్ద జరిగిన రథయాత్రను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రారంభించారు. అంతకుముందు రథం ముందు ఆయన చీపురుతో శుభ్రపరిచారు. రథయాత్ర నాంపల్లి ఎగ్జిబిషన్ మైదానం వరకు సాగింది.

అమెరికాలోని శాన్ ఫ్రాన్సిస్కోలో తొలిసారిగా 1967లో జగన్నాథ రథయాత్ర జరిగింది. వందకు పైగా ప్రపంచ సుప్రసిద్ధ నగరాలలో ఏటా రథయాత్రలు కొనసాగుతున్నాయి.

– జాగృతి డెస్క్

## జాతీయవాదానికీ, ఉదారవాదానికీ

# ఫ్రాన్స్‌లో హంగ్




ఫ్రాన్స్ అధ్యక్షుడు ఇమ్మాన్యుయేల్ మెక్రాన్

ఒలింపిక్స్ క్రీడోత్సవాలు మొదలు కావడానికి మరొక మూడు వారాలు మాత్రమే సమయం ఉండగా, ఆ విశ్వ క్రీడోత్సవాలకు ఆతిథ్యం ఇస్తున్న ఫ్రాన్స్‌లో అసాధారణ రాజకీయ క్రీడకు తెర లేచింది. ప్రపంచంలో జాతీయవాద పోకడలు బలపడడం, వాటిని అడ్డుకోవడానికి వామపక్షాలు, ఉదారవాదులు యథాశక్తిని విన్యాసాలు చేయడం నేటి వాస్తవిక రాజకీయ చిత్రం. ఫ్రాన్స్‌లోను ఇదే ప్రతిబింబించింది. అతివాదం, మితవాదం, మధ్యేవాదం మధ్య ఫ్రాన్స్ ఓటర్లు సందిగ్ధంలో ఉండిపోయారు. ఫలితమే హంగ్ పార్లమెంట్. అయితే ఏదో విధంగా అధికారంలోకి వచ్చి తిష్ట వేయాలని చూస్తే వామపక్షం ప్రభుత్వం ఏర్పాటు చేసే అవకాశం తమకే ఇవ్వాలని అధ్యక్షుడు ఇమ్మాన్యుయేల్ మెక్రాన్ మీద అప్పుడే ఒత్తిడి తేవడం ఆరంభించాయి. జూలై 8వ తేదీన వెలువడిన ఎన్నికల అంతిమ ఫలితాలను బట్టి 577 స్థానాలకు గాను ఏ కూటమి మేజిక్ నంబర్‌కు దగ్గరగా

ప్రభుత్వ ఏర్పాటుకు 289 స్థానాలు అవసరం. అయితే వామపక్ష కూటమి 180 స్థానాలలో, మెక్రాన్ కూటమి 160 చోట్ల, అతి మితవాద కూటమి 140 స్థానాలు సాధించాయి. మెక్రాన్ ఇంతవరకు తెచ్చిన అన్ని సంస్కరణలు తీసుకువస్తామని చెబుతున్న వామపక్ష కూటమి ప్రభుత్వ ఏర్పాటు తమకు మొదటి ప్రాధాన్యం ఇవ్వాలని కోరడం పెద్ద మలుపు. ఇజ్రాయెల్ పట్ల ఇంతకాలం ఫ్రాన్స్ అనుసరిస్తున్న సానుకూల వైఖరికి తాము వ్యతిరేకమని వామపక్షం చెబుతున్న నేపథ్యంలో ప్రపంచంతో ఫ్రాన్స్ సంబంధాలు కూడా కొత్త దారిలోకి మళ్లే ప్రయత్నం చేస్తాయి. మరొక మూడేళ్లు అధికారంలో కొనసాగే అవకాశం ఉన్న మెక్రాన్ ఈ రాజకీయ సంక్షోభం నుంచి ఎలా బయటపడతారన్నది ఇప్పుడు అందరినీ వేధిస్తున్న ప్రశ్న.

ఐరోపా సమాఖ్య దేశాల పార్లమెంట్ ఎన్నికల ఫలితాల నేపథ్యంలో, ఫ్రాన్స్ అధ్యక్షుడు ఇమాన్యువల్ మెక్రాన్ దేశంలో ఆకస్మిక ఎన్నికలు జరపడానికి తీసుకున్న నిర్ణయం ఆయన నేతృత్వంలోని సెంటర్ రైట్ సంకీర్ణ కూటమికి అశనిపాతంగా మారడమే కాదు, దేశాన్ని అనిశ్చితి రాజకీయాల్లోకి నెట్టేసింది. రెండు దశలుగా జరిగిన ఈ ఎన్నికల్లో తొలిరౌండ్‌లో 76 స్థానాలకు, రెండోదశలో 501 స్థానాల్లో ఎన్నికలు జరిగాయి. జూన్ 30న జరిగిన తొలి రౌండ్‌లో 67శాతం పోలింగ్ జరిగింది. జూలై 7న జరిగిన రెండో విడత ఎన్నికల్లో రికార్డు స్థాయిలో 59.7శాతం పోలింగ్ నమోదైంది. 1981 తర్వాత ఇంతటి స్థాయిలో పోలింగ్ నమోదవడం ఇదే ప్రథమం. తొలిదశలో వెనుకబడినప్పటికీ రెండో దశ ఎన్నికల్లో పుంజుకొని 182 స్థానాలు గెలుచుకొని న్యూపాపులర్ ఫ్రంట్ పెద్ద పార్టీగా అవతరించింది. పార్లమెంట్‌లోని మొత్తం 577 స్థానాల్లో ఏ పార్టీకి పూర్తి మెజారిటీ రాలేదు. తుది ఫలితాల తర్వాత పార్లమెంట్‌లో న్యూపాపులర్ ఫ్రంట్ 182 స్థానాలు, ఎన్సెంబుల్ అలయన్స్ 168, రిపబ్లికన్స్+రైట్ గ్రూపు 60, నేషనల్ ర్యాలీ కూటమి 143, ఇతరులు 11, అదర్ లెఫ్ట్ గ్రూపు 13 సీట్లు సాధించాయి. గత జూన్ 30వ తేదీన జరిగిన తొలిరౌండ్ ఎన్నికల్లో ఎన్ఆర్ నేతృత్వంలోని జాతీయవాద కూటమి ఏకంగా 30% ఓట్లు నమోదు చేయడం లెఫ్ట్‌వింగ్ పార్టీలను కోలుకోలేని నైరాశ్యంలోకి నెట్టేసింది. న్యూపాపులర్ ఫ్రంట్ లెఫ్ట్‌వింగ్ (ఎన్ఎఫ్‌పి) 28% ఓట్లు సాధించగా, మెక్రాన్ నేతృత్వంలోని సెంటర్ రైట్ సంకీర్ణ పార్టీలు కేవలం 20% సీట్లు మాత్రమే సాధించడంతో దేశం మరోసారి అనిశ్చితి రాజకీయాలకు తెరలేచే పరిస్థితి నెలకొంది. ప్రజలు ధ్రువాత్మకతకే మద్దతిస్తున్నారన్న సత్యాన్ని తొలి రౌండ్ ఎన్నికలు స్పష్టం చేసిన నేపథ్యంలో మధ్యేవాద, వామపక్ష పార్టీలు కలిసిపోయి 'రిపబ్లికన్ ఫ్రంట్'గా ఏర్పడ్డాయి. ఎట్లాగైనా జాతీయవాద పార్టీ ఎన్.ఆర్.ను అధికారంలోకి రాకుండా అడ్డుకోవాలని 'రిపబ్లికన్ ఫ్రంట్'గా ఏర్పడిన ఈ పార్టీలన్నీ శపథం పూనాయనే చెప్పాలి. రెండో రౌండ్ ఎన్నికల్లో పోటీల్లో ఉన్న ఈ ఫ్రంట్ అభ్యర్థుల్లో విజయావకాశాలున్నవారిని రంగంలో ఉంచి, మిగిలిన వారిని పోటీ నుంచి తప్పించే వ్యూహాన్ని అనుసరించడం ద్వారా జాతీయ



జమలాపురపు విఠల్‌రావు
సీనియర్ జర్నలిస్ట్

# జరిగిన పోటీ ఫలితమే

# పార్లమెంట్

రాలేకపోయాయి. ప్రధాని గాబ్రియెల్ అట్టల్ తన పదవికి రాజీనామా చేయడానికి సిద్ధపడ్డారు. ఒలింపిక్స్ క్రీడోత్సవాల దృష్ట్యా పదవిలో కొనసాగాలని అధ్యక్షుడు మెక్రాన్ ప్రస్తుతం ఆ రాజీనామాను ఆమోదించలేదు. ఏ విధంగా చూసినా ఇది జాతీయవాదానికీ, వామపక్ష-ఉదారవాద రాజకీయాలకీ నడుమ పోరాటమే. ఇదే పోరాటం ఫ్రాన్స్ ఇరుగుపొరుగు దేశాలలో జరుగుతోంది. అక్కడ జాతీయవాదమే ముందంజలో ఉంది. కాబట్టి ఐరోపాను కూడా ఫ్రాన్స్ హంగ్ ఏ మేరకు ప్రభావితం చేస్తుందో చూడాలి.

వాద ఎన్.ఆర్.పార్టీని నిరోధించగలిగినప్పటికీ, పూర్తి మెజారిటీ సాధించలేకపోవడం గమనార్హం.

**హింసకు రాడికల్ లెఫ్ట్ పార్టీలే కారణం**

రెండో రౌండ్‌లో ఎన్.ఆర్. పార్టీ అధికశాతం ఓట్లు సాధించి ప్రభుత్వం ఏర్పాటుచేసే పరిస్థితి వస్తే దేశంలో అంతర్గత యుద్ధం తప్పదని లెఫ్ట్ వింగ్ సమర్థకులు రెండో రౌండ్ ఎన్నికలకు ముందు చేసిన ప్రకటనలు జాతీయవాదాన్ని హింసతోనే ఎదుర్కొంటా మని వారు చెప్పకనే చెప్పినట్లయింది. తొలిరౌండ్‌లో జాతీయవాద పార్టీ ఎన్.ఆర్.కు ఎక్కువ శాతం ఓట్లు రావడంతో తట్టుకోలేక విధ్వంసానికి పాల్పడింది రాడికల్ లెఫ్ట్ గ్రూపులు మాత్రమే. ప్రజలు తమకు అనుకూలంగా ఓట్లువేస్తేనే ప్రజాస్వామ్యమని, ఇతరులకు వేస్తే అప్రజాస్వామ్యమనే రీతిలో వాదించడం ఈ పార్టీలకే చెల్లింది. అంతేకాదు ఒకవేళ ఎన్.ఆర్. పార్టీకి అధికసీట్లు వచ్చినట్లయితే ఫ్రాన్స్‌ను ఈ రాడికల్ లెఫ్ట్ గ్రూపులు అల్లకల్లోలం చేసి ఉండేవనడంలో ఎంతమాత్రం సందేహం లేదు. జాతీయవాద పార్టీల విజయాన్ని, లెఫ్ట్ పార్టీలు తీవ్రంగా వ్యతిరేకిస్తున్న నేపథ్యంలో ఆ పార్టీల మద్దతుదార్లు దేశంలో విధ్వంసానికి పాల్పడటం వారిలోని అసహనానికి నిదర్శనం తప్ప సమాజంలో పెరుగుతున్న అభద్రతా భావాన్ని అవి గుర్తించడం లేదు. ముఖ్యంగా అక్రమంగా వలసలు వచ్చిన ముస్లింల వల్ల కలుగుతున్న సామాజిక అశాంతి అన్ని యూరప్ దేశాల సమాజాల్లో సాంస్కృతిక, అస్తిత్వానికి సంబంధించిన అభద్రతా భావానికి కారణమవు తోంది. దీన్ని అతివాద వామపక్షాలు లేదా సెంటర్ రైట్ పార్టీలు గుర్తించడంలేదు. అదీకాకుండా వలస దార్లపై ఓట్లకోసం నెరపే బుజ్జగింపు రాజకీయాలు కూడా ప్రజల్లో ఏవగింపునకు దారితీసినట్టు ఈ ఎన్నికలు స్పష్టం చేస్తున్నాయి. దేశీయ సామాజిక, సాంస్కృతిక పరిరక్షణ కోసం వలసలను వ్యతిరేకిస్తున్న జాతీయవాద నేషనల్ ర్యాలీ (ఎన్.ఆర్.) పార్టీ గణనీయంగా సీట్లు పెంచుకోవడానికి ఇదే కారణం. ఈ మూల కారణాన్ని గుర్తించకుండా లెఫ్ట్ పార్టీలు వ్యవహరించడమే ఇక్కడ ప్రధాన లోపం. ప్రస్తుతం ఫ్రాన్స్ ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలకు ఎన్.ఆర్. పార్టీకి ఓటువేయడం పరిష్కారం కాదనేది రాడికల్ లెఫ్ట్ పార్టీల వాదన. ఇందుకోసం రెండో రౌండ్ ఎన్నికల్లో తమకు అనుకూల పార్టీల ఓట్లు చీలకుండా ఎక్కడి కక్కడ అభ్యర్థులను ఉపసంహరించుకొని ఎన్.ఆర్. పార్టీకి వ్యతిరేకంగా కేవలం ఒకే అభ్యర్థి రంగంలో ఉండేలా జాగ్రత్తపడిన రాజకీయమే పాపులర్ ఫ్రంట్ అధిక స్థానాలు గెలవడానికి ప్రధాన కారణం. ప్రజల్లో జాతీయవాదానికి వ్యతిరేకంగా చైతన్యం కలిగించామని పైకి ఎంతగా చెప్పుకున్నా ప్రజల్లో తమ భద్రతపై భయాందోళనలు వ్యక్తమవు తున్నాయన్న సత్యం ఈ ఎన్నికలు స్పష్టం చేశాయి. "తాము ఫ్రాన్స్ సాంస్కృతిక, సామాజిక విలువలకు ప్రాధాన్యం ఇస్తామని, 2017నుంచి అధికారంలో వున్న ఇమాన్యువల్ మెక్రాన్ నేతృత్వంలోని ప్రభుత్వం పట్ల ప్రజల్లో పెరుగుతున్న వ్యతిరేకత ఇప్పుడు ఓట్ల రూపంలో బయటపడింది" అని జాతీయవాద ఎన్.ఆర్.పార్టీ పేర్కొనడమే కాదు తమపై 'తీవ్రవాద' ముద్ర వేయడం ఎంతమాత్రం సబబు కాదని స్పష్టం చేసింది. ప్రస్తుత ఎన్నికల ఫలితాలను పరిశీలిస్తే



ప్రధాని గాబ్రియెల్ అట్టల్

ఎన్ని రాజకీయ జిమ్మిక్కులు చేసినా ఒక నిర్ణయానికి వచ్చిన ఫ్రెంచ్ ఓటర్లను మభ్యపెట్టడం లేదా వారి అభిప్రాయంలో మార్పులు తేవడానికి యత్నించడం సాధ్యం కాదన్న నిపుణుల అంచనాలు నిజమయ్యా యనే చెప్పాలి. ఎందుకంటే గత పార్లమెంట్‌లో కేవలం 83 స్థానాలు కలిగిన ఎన్.ఆర్. ఈసారి సొంతంగా 125 స్థానాల్లో గెలుపొందగా, దీని కూటమి 143 స్థానాలను కైవసం చేసుకుంది. ఇప్పుడు ఫ్రాన్స్ పార్లమెంట్‌లో సింగిల్ పార్టీల పరంగా చూస్తే ఎన్.ఆర్. రెండోస్థానంలో ఉంది. ప్రజల్లో వచ్చిన మార్పునకు ఎన్.ఆర్. సాధించిన ఈ సీట్లే నిదర్శనం.

నిజానికి 2027వరకు దేశ అధ్యక్షుడిగా మెక్రాన్ పదవిలో కొనసాగుతారు. ఇటీవలి కాలంలో యూరప్‌లో ప్రభుత్వాలకు వ్యతిరేకంగా చోటు చేసుకున్న 'ఎల్లో వెస్ట్' ఉద్యమాలు ఫ్రాన్స్‌కు కొత్తేం కాదు. జూన్ 30న జరిగిన తొలిరౌండ్ ఎన్నికల తర్వాత ఏకంగా లెఫ్ట్‌వింగ్ అనుయాయులు వీధి పోరాటాలకే దిగారు.

రెండో రౌండ్ ఎన్నికల తర్వాత దేశంలో ఫార్ రైట్, ఫార్ లెఫ్ట్ పార్టీల అనుయాయుల మధ్య తీవ్రస్థాయిలో గొడవలు చోటుచేసుకుంటే పరిస్థితేంటని ఒక దశలో ప్రభుత్వం భయపడింది. అయితే ఈ ఎన్నికల్లో జాతీయవాద పార్టీల కూటమి సాధించిన సీట్లను పరిశీలిస్తే దేశంలోని అన్ని స్థాయిల రాజకీయాలపై దీని ప్రభావం తప్పక పడి తీరుతుంది. ముఖ్యంగా సంస్థాగత, పార్టీ రాజకీయాలు, జాతీయ అసెంబ్లీల్లో మాత్రమే కాకుండా సమాజంలో ఈ 'ధ్రువాత్మకత' ప్రభావం తీవ్రంగా ఉండి తీరు తుంది. మైనారిటీలు, యువత, ఫెమినిస్టుల్లో ఈ పరిణామం ఆందోళ కలిగించడంలో ఆశ్చర్యంలేదు.

తొలిరౌండ్‌లో జాతీయవాద పార్టీ ఎన్.ఆర్.కు ఎక్కువ శాతం ఓట్లు రావడంతో తట్టుకోలేక విధ్వంసానికి పాల్పడింది రాడికల్ లెఫ్ట్ గ్రూపులు మాత్రమే. ప్రజలు తమకు అనుకూలంగా ఓట్లువేస్తేనే ప్రజాస్వామ్యమని, ఇతరులకు వస్తే అప్రజాస్వామ్యమనే రీతిలో వాదించడం ఈ పార్టీలకే చెల్లింది. అంతేకాదు ఒకవేళ ఎన్.ఆర్. పార్టీకి అధికసీట్లు వచ్చినట్లయితే ఫ్రాన్స్‌ను ఈ రాడికల్ లెఫ్ట్ గ్రూపులు అల్లకల్లోలం చేసి ఉండేవనడంలో ఎంతమాత్రం సందేహం లేదు. జాతీయవాద పార్టీల విజయాన్ని, లెఫ్ట్ పార్టీలు తీవ్రంగా వ్యతిరేకిస్తున్న నేపథ్యంలో ఆ పార్టీల మద్దతుదార్లు దేశంలో విధ్వంసానికి పాల్పడటం వారిలోని అసహనానికి నిదర్శనం తప్ప సమాజంలో పెరుగుతున్న అభద్రతా భావాన్ని అవి గుర్తించడం లేదు.

### అభద్రత, అక్రమవలసలే ప్రధానాంశాలు

జాతీయవాద ఎన్.ఆర్. పార్టీ ముఖ్యంగా సమాజంలో పెరుగుతున్న నేరాలతో కలుగుతున్న అభద్రత, అక్రమ వలసలు, జాతీయ గుర్తింపు వంటి అంశాలను ప్రధానంగా ప్రస్తావించింది. ఎన్.ఆర్.కు చెందిన 28 ఏళ్ల జోర్డాన్ బార్డెల్లా శాంతి భద్రతలను పునరుద్ధరిస్తామని, వలసలను నిరోధిస్తామని, సమాజంలో పెరుగుతున్న నేరప్రవృత్తిని అణచి వేస్తామని ప్రజలకు హామీ ఇచ్చారు. అయితే పార్టీ మరోనాయకుడు మారిన్ పెన్‌తో పాటు బార్డెల్లా నాటోనుంచి ఫ్రాన్స్ బయటకు రావాలన్న తమ వాదనను పక్కనపెట్టడం, పార్టీ అనుసరించే సంప్రదాయిక రష్యా అనుకూల విధానాన్ని కొంత సరళతరం చేయడం గమనార్హం. బార్డెల్లా ఉక్రెయిన్‌కు ఆయు ధాల సరఫరాను సమర్థిస్తున్నప్పటికీ, ఫ్రాన్స్ దళాలను మద్దతుగా పంపడాన్ని వ్యతిరేకిస్తున్నారు. జాతీయ అసెంబ్లీలో మొత్తం 577 స్థానాల్లో మెజారిటీ మార్క్ 289కు చేరువ కావడం ఎన్.ఆర్. పార్టీకి కష్టసాధ్యమని వేసిన రాజకీయ పండితుల అంచనా నిజమైంది. ఎన్నికల ఫలితాల నేపథ్యంలో హంగ్ ప్రభుత్వం ఏర్పాటు కానుండటంతో దేశ రాజకీయాల్లో ఇప్పటివరకు అనుసరిస్తూ వస్తున్న పాత పద్ధతులు పనిచేయకపోవచ్చు. ప్రస్తుతం ఫ్రాన్స్, 'సంప్రదాయాలు', 'అలవాటు పడిన రాజకీయాలకు' దూరంగా పయనిస్తోంది. ఈ నేపథ్యంలో మారుతున్న ప్రస్తుత పరిస్థితులను ఫ్రాన్స్ సమాజం ఏవిధంగా సర్దుబాటు చేసుకోగలదనేది పెద్ద ప్రశ్న!

### వామపక్షాల ఆగ్రహం

ఇటీవల జరిగిన యూరోపియన్ పార్లమెంట్ ఎన్నికల్లో జాతీయవాద పార్టీ ఎన్.ఆర్. విజయం నేపథ్యంలో దీనికి వ్యతిరేకంగా జూన్ 9న వామపక్ష పార్టీల ఆధ్వర్యంలో 'జాతీయవాద వ్యతిరేక ఆందోళనలు' దేశవ్యాప్తంగా జరిగాయి. వామ






వామపక్ష కూటమి సృష్టికర్త జీన్ ల్యూక్ మెలిన్

**ఇటీవల జరిగిన యూరోపియన్ పార్లమెంట్ ఎన్నికల్లో జాతీయవాద పార్టీ ఎన్.ఆర్. విజయం నేపథ్యంలో దీనికి వ్యతిరేకంగా జూన్ 9న వామపక్ష పార్టీల ఆధ్వర్యంలో 'జాతీయవాద వ్యతిరేక ఆందోళనలు' దేశవ్యాప్తంగా జరిగాయి. వామ పక్షాలకు చెందిన అనేక యూనియన్లు, సంస్థలు, మానవహక్కుల సంఘాలు, విద్యార్థిసంఘాలు ఫ్రాన్స్‌లోని వివిధ నగరాల్లో ఈ ర్యాలీలు, నిరసనలు జరిపాయి.**

పక్షాలకు చెందిన అనేక యూనియన్లు, సంస్థలు, మానవహక్కుల సంఘాలు, విద్యార్థిసంఘాలు ఫ్రాన్స్‌లోని వివిధ నగరాల్లో ఈ ర్యాలీలు, నిరసనలు జరిపాయి. వీరు ఎన్.ఆర్.పార్టీ నాయకుడు జోర్డాన్ బార్డెల్లాకు వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ హోరెత్తిం చారు. ఆ తర్వాత కూడా జూన్ నెల వ్యాప్తంగా నిరసనలు కొనసాగాయి. జూన్ 15న దేశ వ్యాప్తంగా 350,000 నుంచి 640,000 వరకు ఆందోళన కారులు ఎన్.ఆర్. పార్టీకి వ్యతిరేకంగా నిరసనల్లో పాల్గొన్నారు. చాలావరకు ఇవి శాంతియుతంగానే జరిగాయని చెప్పాలి. ముఖ్యంగా జాత్యహంకారానికి వ్యతిరేకంగా, పాలస్తీనా అనుకూల నినాదాలు చేయడం గమనార్హం. యూరోపియన్ పార్లమెంట్ ఎన్నికల్లో జోర్డాన్ బార్డెల్లా నేతృత్వంలోని ఎన్.ఆర్. పార్టీ ఏకంగా 31.34% ఓట్లు సాధించడం వావపక్షాలకు ఎంతమాత్రం మింగుడు పడకపోవడమే ఈ ఆందోళనలకు ప్రధాన కారణం. జాతీయవాద పార్టీలు బలపడకూడదన్న ఉద్దేశంతో ఫ్రాన్స్ అధ్యక్షులు ఇమ్మాన్యుయెల్ మెక్రాన్ ఏకంగా జాతీయ అసెంబ్లీని రద్దుచేసి కొత్తగా ఎన్నికలకు పిలుపు నిచ్చారు.

### ఎన్.ఆర్. పార్టీ ప్రతిస్పందన

ప్రజాస్వామ్యంలో ప్రజల తీర్పును గౌరవించా లని ఎన్.ఆర్. పార్టీ నా యకుడు జోర్డాన్ బోర్డెల్లా కోరారు. నిరసనల సందర్భంగా తిరుగుబాటు, విప్లవం వంటి పదజాలం ఉపయోగించడం చాలా ప్రమాదకరమని, వాక్‌స్వాతంత్ర్యాన్ని తాను గౌరవిస్తానని చెప్పారు. నిరసనలు శాంతియుతంగా ఉండాలే తప్ప విధ్వంసకాండ, హింసాకాండ ఎంతమాత్రం సమర్థనీయం కాదు. ఎన్నికల ఫలితాలను ప్రశ్నిస్తున్న వామపక్షాలను ఆపార్టీ నాయకుడు ఇల్లీ–ఎట్– విలాయినీ మాట్లాడుతూ 40% ఉద్యోగులు జోర్డాన్ బోర్డెల్లాకు అనుకూలంగా ఓటువేసిన సంగతిని గుర్తుచేశారు. రాడికల్ లెఫ్ట్ నిరసనల్లో ఫ్రాన్స్ పతాకాలు లేకపోవడం, యూదులకు, పోలీసులకు వ్యతిరేకంగా నినాదాలు చేయడాన్ని ఎన్.ఆర్.పార్టీ తప్పు పట్టింది. తొలి రౌండ్ ఎన్నికల ఫలితాల తర్వాత ఫ్రాన్స్‌కు చెందిన జర్నలిస్ట్ విన్సెంట్ ట్రిమోలెట్ డి విల్లర్స్, 'తీవ్రవాద వామ పక్షాలనుంచి వ్యక్తమవుతున్న విధ్వంసాత్మక ప్రతిస్పందన'గా వర్ణించాడు. తొలిరౌండ్ ఎన్నికల తర్వాత, వివిధ మెట్రోపాలిటన్ నగరాల్లో అన్నిరకాల వాణిజ్య సంస్థలు, షాపులు, స్టోర్సులు, ఇతర కార్యాలయాలు ఆందోళనకారుల భయంతో రక్షణగా బారికేడ్లు ఏర్పాటు చేసుకున్నాయంటే రాడికల్ వామపక్ష భావజాలికుల విధ్వంసకాండ పట్ల వారు ఎంతగా భయపడుతున్నదీ తెలియజేస్తుంది.

మొదటి రౌండ్ ఎన్నికల్లో ఏకంగా మూడో స్థానంలో ఉన్న మెక్రాన్ పార్టీకి రెండో రౌండ్ ఫలి తాలు ఊపిరి పోశాయనే చెప్పాలి. ఈ నేపథ్యంలో ప్రస్తుత ప్రధాని గేబ్రియల్ అట్టల్‌ను తాత్కాలికంగా పదవిలో కొనసాగామని మెక్రాన్ కోరారు. అతిపెద్ద గ్రూపుగా ఎన్నికైన పాపులర్‌ఫ్రంట్ ఇప్పుడు తమ ప్రధాని అభ్యర్థిని త్వరలో నిర్ణయించాలి. కానీ వాటికి పార్ల మెంట్‌లో పూర్తి మెజారిటీ లేనందువల్ల అసలు సమస్య ముందుంది. ప్రస్తుతానికి జాతీయవాద పార్టీ వెనకడుగు వేసినప్పటికీ, ఫ్రాన్స్ అనిశ్చితి రాజకీయ దశలోకి ప్రవేశించిందనేది మాత్రం నిష్ఠుర సత్యం! ★

సుజాత గోపగోని, 6302164068



రాష్ట్రం విడిపోయి సరిగ్గా పదేళ్లు పూర్తయిన తర్వాత రెండు తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రులు విభజన సమస్యల పరిష్కారం కోసం జులై 6న భేటీ అయ్యారు. తమ అధికార మార్బలంతో హైదరాబాద్‌లోని బాబూ జగ్జీవన్‌రామ్ ప్రజా భవన్‌లో ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఆయన మంత్రి వర్గ సహచరులు కందుల దుర్గేష్, సత్యప్రసాద్, బీసీ జనార్దన్‌రెడ్డి, తెలంగాణ నుంచి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో పాటు మంత్రులు భట్టి విక్రమార్క, శ్రీధర్‌బాబు, పొన్నం ప్రభాకర్ హాజరయ్యారు. దాదాపు గంటన్నరకుపైగా సాగిన సమావేశంలో ఆంధ్రప్రదేశ్ విభజన చట్టంలో పేర్కొన్న ఆస్తులు, అప్పులపై చర్చించారు.



చంద్రబాబు, రేవంత్

# ఎటూ తేలని 'విభజన'పై భేటీ

విభజన చట్టంలో ఉన్న ఆస్తులు, అప్పులపై చర్చిస్తూ.. హైదరాబాద్‌లో కొన్ని భవనాలు ఏపీకి ఇవ్వాలని చంద్రబాబునాయుడు కోరగా, హైదరాబాద్‌లోని స్థిరాస్తులు మొత్తం తెలంగాణకే చెందుతాయని రేవంత్‌రెడ్డి తేల్చి చెప్పారు. కావాలంటే ఢిల్లీలో ఏపీ భవన్ తరహాలో భవనం కట్టుకునేందుకు పర్మిషన్ ఇస్తామని తెలంగాణ సర్కార్ చెప్పిందంటున్నారు. ఇక.. భద్రాచలంలో నుంచి ఏపీలో కలిపిన 7 మండలాల్లోని ఐదు గ్రామాలను తెలంగాణ ప్రభుత్వం అడిగింది. ఇదే విషయంపై కేంద్ర హోం మంత్రిత్వ శాఖకు లేఖ రాయాలని తెలంగాణ ప్రభుత్వం నిర్ణయించింది. మరోసారి రెండు రాష్ట్రాల ప్రధాన కార్యదర్శుల స్థాయిలో సమావేశం నిర్వహించాలని నిర్ణయించారు. విభజన సమస్యలపై మంత్రులతో ఒక కమిటీ, అధికారులతో మరో కమిటీ వేయనున్నారు. షెడ్యూల్ 9,10లోని ఆస్తుల పంపకం, ఏపీకి రావాల్సిన రూ. 7,200 కోట్ల విద్యుత్ బకాయిలు, ఉమ్మడి సంస్థలపై షీలా బిడే కమిషన్ సిఫార్సుల అమలు, ఫైనాన్స్ కార్పొరేషన్, ఉద్యోగుల విభజన అంశాలు, లేబర్ సెస్ పంపకాలపై చర్చ జరిగింది.

తెలంగాణలో అంశాలు చూస్తే... రాష్ట్ర ఏర్పాటు తర్వాత ఆర్డినెన్స్ ద్వారా ఆంధ్రప్రదేశ్‌లో కలిపిన ఏడు మండలాలను తిరిగి తెలంగాణలో చేర్చాలన్న అంశంపై చర్చ జరిగింది. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి వెయ్యి కిలోమీటర్ల మేర విస్తారమైన తీరప్రాంతం ఉందని, అందులో తెలంగాణకు భాగం కావాలని, తిరుమల తిరుపతి దేవస్థానానికి సంబంధించి కూడా భాగం కావాలని, తమకు ఓడరేవులు లేనందున, విభజనలో భాగంగా ఏపీలోని కృష్ణపట్నం, మచిలీపట్నం, గంగవరం పోర్టుల్లో భాగం కావాలని తెలంగాణ బృందం ప్రతిపాదించింది. కృష్ణా జలాల్లోని 811 టీఎంసీల నీటి లభ్యతలో అంతర్జాతీయ నీటి పంపిణీ సూత్రం ప్రకారం క్యాచ్‌మెంట్ ఏరియా నిష్పత్తిలో నీటి పంపకాలు జరగాలని కోరింది. ఈ లెక్కన తెలంగాణకు 558 టీఎంసీలను కేటాయించాలనే అంశం చర్చకు వచ్చింది. తెలంగాణ విద్యుత్ సంస్థలకు, ఆంధ్రప్రదేశ్ విద్యుత్ సంస్థలు రూ. 24 వేల కోట్ల బకాయిలను సత్వరమే చెల్లించాలని కోరింది. ఏపీకి ఏమైనా రావలసి ఉంటే చెల్లిస్తామని అధికారులు ప్రస్తావించారు.

అయితే,ఈ ప్రతిపాదనలపై ఆంధ్రప్రదేశ్ బృందం ఉలిక్కిపడింది. ఇప్పటివరకు ఊహించని కొత్త ప్రతిపాదనను తెరపైకి తెచ్చింది. హైదరాబాద్ ఆదాయంలో ఆంధ్రప్రదేశ్‌కు వాటా ఇవ్వాలని కొర్రీ పెట్టినట్లు సమాచారం. హైదరాబాద్ మహానగరం లాంటి నగరం ఆంధ్రప్రదేశ్‌లో లేనందున, ఇప్పటికీ రాజధాని లేనందున దాని ఆదాయంలో తమకు వాటా ఇవ్వాలని ఏపీ ప్రభుత్వ బృందం ప్రతిపాదనను సమావేశం ముందుంచినట్లు సమాచారం. విభజన చట్టం ప్రకారం పాలనా పరమైన సౌకర్యాల కోసం హైదరాబాద్‌లో ఏపీకి మూడు భవనాలను కేటా

యించారు. ఉమ్మడి రాజధాని గడువు ముగిసి పోవడంతో వాటిని తెలంగాణ ప్రభుత్వం స్వాధీనం చేసుకోవాలనుకుంటున్నది. అయితే వీటిపై ఏపీ పెట్టిన ప్రతిపాదనలు పీటముడులుగా మారాయి.

**రెండు అత్యున్నత కమిటీలు**

మొత్తానికి రెండు తెలుగు రాష్ట్రాల విభజన సమస్యల పరిష్కారానికి రెండు వైపుల నుంచి అత్యున్నత స్థాయి కమిటీలు వేయాలని నిర్ణయించారు. ఉన్నతాధికారులతో ఒక కమిటీ వేయాలని, మంత్రుల స్థాయిలో మరో కమిటీ వేయాలని ఇరు రాష్ట్రాల ఉన్నతస్థాయి భేటీలో నిర్ణయానికి వచ్చారు. రెండు రాష్ట్రాల ప్రభుత్వ ప్రధాన కార్యదర్శుల అధ్యక్షతన వేయనున్న కమిటీలు రెండు వారాల్లోగా మనుగడలోకి రానున్నాయి. మరో ముగ్గురు చొప్పున అధికారులు ఇందులో సభ్యులుగా ఉంటారు. ఆ తర్వాత మంత్రుల స్థాయి కమిటీలో ఆ అంశాలపై చర్చిస్తారు. చివరగా ముఖ్యమంత్రుల నేతృత్వంలో తుది నిర్ణయం తీసుకొని కేంద్ర హోంశాఖకు ప్రతిపాదిస్తారు.

**ఫలితమివ్వని సమావేశాలు**

విభజన అంశాలపై చర్చకు ఇద్దరు సీఎంలు భేటీ కావడం ఇదే మొదటిసారి. అంతకు ముందు గడచిన పదేళ్లలో కేంద్ర హోంశాఖ నేతృత్వంలో పలుమార్లు సమావేశాలు జరిగినా, చాలా అంశాలు పెండింగ్‌లోనే ఉన్నాయి. ఇప్పటివరకు 30సార్లు భేటీ అయినా, ఇరు రాష్ట్రాల అధికారులు, ప్రజా ప్రతినిధుల్లో ఏకాభిప్రాయం కుదరలేదు. అనేక అంశాల్లో విభజన చట్టానికి విరుద్ధంగా ఇరుపక్షాలు వాదించడం వల్లే సమస్య జటిలమైందన్న వాదనలున్నాయి. నాటి రెండు రాష్ట్రాల మధ్య ఆస్తుల పంపకానికి సంబంధించి నాటి గవర్నర్ నరసింహన్ నేతృత్వంలో రాజ్ భవన్ వేదికగా కొన్ని సమావేశాలు జరిగాయి. అయితే.. నరసింహన్ తెలంగాణకు అనుకూలంగా వ్యవహరిస్తున్నారని ఆరోపిస్తూ ఏపీ



జల వివాదం

సర్కార్ అప్పుడు పక్కకు తొలగింది. అనంతరం పలు కీలక పరిణామాల నేపథ్యంలో ఏపీ ప్రభుత్వం తమ పాలనను హుటాహుటిన అమరావతికి మార్చుకోవడంతో సచివాలయ విభజన అంశం తెగని సమస్యగానే మారిపోయింది.

**ఒకే సమస్య పరిష్కారం**

ఢిల్లీ లోని ఏపీ భవన్ సమస్య ఒక్కటే పరిష్కారం కావడం గమనార్హం. ఇందులో భాగంగా, ఈ ఏడాది మార్చిలో రెండు రాష్ట్రాలకు కేంద్రం భూకేటాయింపులు జరిపింది. విభజన చట్టం ఆధారంగా 58:42 నిష్పత్తి ప్రకారం ఏపీ భవన్ ఆస్తులు పంచుకున్నాయి.

**9వ షెడ్యూల్ కొర్రీలు**

9వ షెడ్యూల్‌లోని అంశాలపై కేంద్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన షిలా బిడే కమిటీ కొన్ని సిఫార్సు చేసింది. ఈ షెడ్యూల్‌లో మొత్తం 91 కార్పొరేషన్లు ఉన్నాయి. వీటిలో 89 కార్పొరేషన్లను విభజించాలని కమిటీ చేసినా, ఏపీ అంగీకారం తెలిపింది. కానీ 68 కార్పొరేషన్లను మాత్రమే విభజిస్తామని తెలంగాణ ప్రభుత్వం స్పష్టం చేసింది. ఆర్టీసీ, ఎఫ్ఎస్‌సీ వంటి



మాజీ ముఖ్యమంత్రులు
వైఎస్ జగన్, కేసీఆర్

23 కార్పొరేషన్లలోని ఆయా సంస్థలకు ఉన్న ఆస్తులపై ఏపీ, తెలంగాణ రాష్ట్రాలపై భిన్నవాదనలు ఉన్నాయి. విభజన చట్టంలో నిధులు, ఉద్యోగులను పంచుకోవాలని ఆస్తులను ఏ రాష్ట్రంలో ఉంటే ఆ రాష్ట్రానికి చెందుతాయని పేర్కొంది. విభజన చట్టంలోనని హెడ్ క్వార్టర్స్ అన్న పదానికి ఏపీ మొదటినుంచీ పేచీ పెడుతోంది. కార్పొరేషన్ ప్రధాన కార్యాలయాన్నే హెడ్‌క్వార్టర్స్‌గా పరిగణించాలని తెలంగాణ వాదిస్తోంది. దీనికి భిన్నంగా హైదరాబాద్‌లోని కార్యాలయాలను, భవనాలను హెడ్ క్వార్టర్స్‌గా పరిగణించాలని ఏపీ వాదిస్తోంది. వీటిలో ఏపీకి వాటా కావాలన్నది ఏపీ ఉద్దేశం. ఈ వివాదానికి ముగింపు పలకడానికి కేంద్రం హెడ్‌క్వార్టర్స్ అనే పదానికి స్పష్టత ఇచ్చింది. తెలంగాణ వాదనను సమర్థించింది. దీన్ని అంగీకరించలేదు. దీన్నిబట్టి 9 షెడ్యూల్‌లో సంస్థల విభజన ఎందుకు పూర్తి కాలేదు అర్థమౌతోంది.

**10వ షెడ్యూల్ పీటముళ్లు**

మరోవైపు.. విభజన చట్టంలోని 10 వ షెడ్యూల్ చూస్తే అందులో 142 సంస్థలు ఉన్నాయి. తెలుగు యూనివర్సిటీ, అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం, తెలుగు అకాడమీ వంటి 30 సంస్థలపై ఏపీ, తెలంగాణ రాష్ట్రాల మధ్య భిన్నవాదనలు ఉన్నాయి. తెలుగు అకాడమీ సహా భవనాలు, ఇతర అంశాల్లో ఏకాభిప్రాయం కుదర లేదు. అలాగే, ఏపీ స్టేట్ కో ఆపరేటివ్ యూనియన్, ఏపీ ఫారెస్ట్ అకాడమి, సెంటర్ ఫర్ ఫుడ్ గవర్నెన్స్, ఎన్విరాన్మెంట్ ప్రొటెక్షన్ ట్రైనింగ్ అండ్ రీసెర్చ్ ఇనిస్టిట్యూట్, ఏపీ పోలీస్ అకాడమీ వంటి శిక్షణా సంస్థలు కూడా ఉన్నాయి. రాజ్‌భవన్, లోకాయుక్త, హైకోర్టు రాజ్యాంగ బద్ధ సంస్థల నిర్వహణపై ఏపీ నుంచి జనాభా ప్రాతిపదికన బకాయిలు రావాలని తెలంగాణ అంటున్నది. కార్మిక సంక్షేమ నిధి, వాణిజ్య పన్నుల బకాయిలపై వివాదాలున్నాయి. హైదరాబాద్‌లో ఏపీ ఆధీనంలో ఉన్న లేక్ వ్యూ గెస్ట్

హౌజ్, సీఐడీ కార్యాలయం, మినిస్టర్స్ క్వార్టర్స్ , ఐఏఎస్ క్వార్టర్స్ లను ఆధీనంలోకి తీసుకోవాలని తెలంగాణ ప్రభుత్వం యోచిస్తోంది. లేక్ వ్యూ గెస్ట్ హౌజ్, సీఐడీ కార్యాలయం, హెర్మిటేజ్ కాంప్లెక్స్ తమకు కావాలని ఏపీ కోరుతోంది. స్థానికత, ఆప్షనల్స్ ఆధారంగా ఉద్యోగుల పరస్పర మార్పు అంశం పెండింగ్‌లో ఉంది. ఏపీ స్థానికత కలిగిన 1800 మందికి పైగా విద్యుత్ ఉద్యోగుల వేతనాల వ్యత్యాసం, సర్దుబాటు వంటి అంశాలూ పీటముడిగా మారాయి. విద్యుత్ బకాయిల అంశం కూడా సుదీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉంది. సుమారు రూ. 24 వేల కోట్లు ఏపీ చెల్లించాలని తెలంగాణ వాదిస్తోంది. అయితే, తమకే 7 వేల కోట్ల రూపాయలు రావాలని ఆంధ్రప్రదేశ్ అంటోంది.

**జల వివాదాలు ఇవీ...**


ఇక, నీటిపారుదలకు సంబంధించి పరిశీలిస్తే... కృష్ణా జలాల్లో 811 టీఎంసీల నీటి లభ్యత ఉన్నందున అంతర్జాతీయ నీటి పంపిణీ నిబంధనల ప్రకారం క్యాచ్ మెంట్ ఏరియా నిష్పత్తిలో నీటి పంపిణీ చేయాలని, తెలంగాణ వాదిస్తోంది. దీని మేరకు 558 టీఎంసీలు తమ రాష్ట్రానికి కేటాయించాలని వాదిస్తోంది. కృష్ణా జలాల పంపిణీపై వేసిన బ్రిజేష్ కుమార్ ట్రైబ్యునల్ తుది తీర్పు త్వరలో వెలువడనుంది. ఆ ట్రైబ్యునల్ కృష్ణా జలాలను మహారాష్ట్ర, కర్ణాటక, ఉమ్మడి ఏపీ రాష్ట్రాలకు పంచింది. ఇప్పుడు తెలంగాణ ఏర్పడింది కాబట్టి ఆ జలాలను నాలుగు రాష్ట్రాలకు పంచాలని తెలంగాణ అధికారులు వాదిస్తున్నారు. దీనిపై సుప్రీంకోర్టులోనూ కేసు నడుస్తోంది. కేసు విత్ డ్రా చేసుకుంటే సమస్యను పరిష్కరిస్తామని కేంద్రం చెప్పినా ఆ సమస్య ఇంకా పరిష్కారం కాలేదు.

**పట్టించుకోని కేసీఆర్-జగన్**

ఏపీలో చంద్రబాబు, తెలంగాణలో చంద్రశేఖర రావు హయాంలో గవర్నర్ సమక్షంలో జరిగిన చర్చలూ విఫలం కాగా, అనంతరం ఏపీలో సీఎంగా వచ్చిన జగన్మోహన్‌రెడ్డి పట్టించుకోలేదు. ఆయనతో రెండవసారి సీఎం అయిన కేసీఆర్‌కు రాజకీయంగా సన్నిహిత సంబంధాలు ఉన్నప్పటికీ విభజన సమస్యలు మాత్రం పరిష్కారం కాలేదు. వీరిద్దరూ ఒకటి రెండు సార్లు సమావేశమైనా.. అవి రాజకీయ కోణంలోనే జరిగాయి.

**సొంత ఎజెండా ఉందా?**

చంద్రబాబు నాయుడు, రేవంత్‌రెడ్డి మధ్య సఖ్యత, సాన్నిహిత్యం గురించి రెండు తెలుగు రాష్ట్రాల్లోని రాజకీయ వర్గాల్లో అందరికీ తెలుసు. రాష్ట్రం విడిపోయిన తర్వాత తెలుగుదేశం పార్టీలో రేవంత్‌రెడ్డి ఓ వెలుగు వెలిగారు. టీడీపీ నాయకుడిగానే రాజకీయాల్లో గుర్తింపు తెచ్చుకున్నారు. అయితే, అప్పటి పరిస్థితులు, రాజకీయ పరిణామాల



పవన్ కళ్యాణ్


**రెండు తెలుగు రాష్ట్రాలకు చెందిన ఉన్నత స్థాయి సమావేశం అది. పదేళ్లుగా ఎడతెగని సమస్యల పరిష్కారమే ఎజెండాగా సాగిన అత్యంత ముఖ్యమైన భేటీకి ఆంధ్రప్రదేశ్ నుంచి పలువురు మంత్రులు హాజరైనప్పటికీ కీలక హోదాలో ఉన్న ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఎందుకు హాజరు కాలేదన్నది చర్చనీయాంశంగా మారింది. దీనిపై రకరకాల వాదనలు వినిపిస్తున్నాయి. సార్వత్రిక ఎన్నికల అనంతరం ప్రస్తుత పరిస్థితుల్లో జాతీయ రాజకీయాల్లో ఎన్డీఏ కూటమిలో జనసేన పార్టీ కీలకంగా నిలుస్తోంది.**

నేపథ్యంలో అనివార్యంగా రేవంత్‌రెడ్డి కాంగ్రెస్ పార్టీలో చేరాల్సి వచ్చిందని చెబుతారు. అంతేకాదు.. అసలు కాంగ్రెస్‌పార్టీలో రేవంత్‌రెడ్డి చేరడానికి కారణం చంద్రబాబే అని, ఆ తర్వాత పీసీసీ అధ్యక్షుడిగా నియామకం వెనుకా చంద్రబాబే చక్రం తిప్పారని ఇప్పటికీ చెప్పుకుంటారు. మరి.. ఈ నేపథ్యంలో ఇరువురు నాయకులు తమ సొంత ఎజెండా కోసమే భేటీ అయ్యారా? అనే సందేహాలు కూడా కలుగుతున్నాయి. ఇద్దరూ ముఖ్యమంత్రుల స్థానంలో ఉన్నారు. వాళ్లేం చేసినా బహిరంగమే. ఎవరిని కలిసినా వార్తే. అయితే, ఏ ఎజెండా లేకుండా, ఏ ప్రతిపాదనలూ లేకుండా ఈ ఇద్దరు ముఖ్యమంత్రులు కలిస్తే రాజకీయ వర్గాల్లోకి, ప్రజల్లోకి తప్పుడు సంకేతాలు వెళ్లే అవకాశం ఉంది. పైగా ఉప్పు నిప్పులా ఉండే విభిన్న పార్టీలకూ ఇద్దరు నేతలు నేతృత్వం వహిస్తున్నారు. ఈ సమయంలో చంద్రబాబు రేవంత్‌రెడ్డిని కలిస్తే.. కేంద్రంలో ఉన్న ఎన్డీఏ కూటమికి చెందిన బీజేపీతో విభేదాలు వచ్చే ప్రమాదం ఉంది. అదే.. రేవంత్‌రెడ్డి స్వయంగా చంద్రబాబును కలిసినా కాంగ్రెస్ అధిష్ఠానం నుంచి ఆగ్రహం ఎదుర్కోవాల్సి వస్తుంది. అందుకే ఇద్దరి భేటీకి విభజన సమస్యల ఎజెండా కలిసి వచ్చిందని కూడా విశ్లేషణలు సాగుతున్నాయి.

**పవన్ కల్యాణ్ గైర్హాజర్‌కు కారణం?**

రెండు తెలుగు రాష్ట్రాలకు చెందిన ఉన్నతస్థాయి సమావేశం అది. పదేళ్లుగా ఎడతెగని సమస్యల పరిష్కారమే ఎజెండాగా సాగిన అత్యంత ముఖ్యమైన భేటీకి ఆంధ్రప్రదేశ్ నుంచి పలువురు మంత్రులు హాజరైనప్పటికీ కీలక హోదాలో ఉన్న ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఎందుకు హాజరు కాలేదన్నది చర్చనీయాంశంగా మారింది. దీనిపై రకరకాల వాదనలు వినిపిస్తున్నాయి. సార్వత్రిక ఎన్నికల అనంతరం ప్రస్తుత పరిస్థితుల్లో జాతీయ రాజకీయాల్లో ఎన్డీఏ కూటమిలో జనసేన పార్టీ కీలకంగా నిలుస్తోంది. అనేక సందర్భాల్లో పవన్ కళ్యాణ్ మీద ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రశంసలు కురిపించారు. ముఖ్యంగా తెలుగు రాష్ట్రాల్లో బీజేపీకి బలమైన మిత్రుడు పవన్ కళ్యాణ్ అని ఆయనే స్వయంగా చెప్పారు. అందుచేత బీజేపీ కలసి నడుస్తున్నందున.. కాంగ్రెస్‌కు దూరంగా ఉండాలని పవన్ నిర్ణయించుకున్నట్లు తెలుస్తోంది. ఈ కారణంతోనే హైదరాబాద్‌లో ముఖ్యమంత్రుల స్థాయి భేటీకి ఆయన దూరంగా నిలిచారని చెబుతున్నారు. తెలంగాణ ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ఈ సమావేశంలో పాల్గొన్నా ఏపీలో అదే హోదా గల పవన్ కళ్యాణ్ పాల్గొనక పోవడం గమనార్హం. సమావేశానికి ముందు విడుదల చేసిన రెండు రాష్ట్రాలకు ప్రాతినిధ్యం వహిస్తూ పాల్గొనబోయే మంత్రులు, అధికారుల పేర్ల జాబితాలో పవన్ కళ్యాణ్ పేరు కూడా ఉంది. అయినా ఆయన పాల్గొనక పోవడం గమనార్హం. కాంగ్రెస్ నేతలతో వేదిక పంచుకోవడం పట్ల విముఖతతోనే హాజరు కాలేదని తెలుస్తున్నది. అయితే ఈ అంశంపై జనసేన వర్గాల నుంచి మరో విధమైన సమాధానం వస్తోంది. 2024 ఎన్నికల్లో జనసేన పార్టీ ఘన విజయం సాధిస్తే అమ్మవారి వారాహి దీక్ష చేపడతానని మొక్కుకున్నారట. అందులో భాగంగా జూన్ 25న 11 రోజుల అమ్మవారి వారాహి దీక్ష చేపట్టారు. దీక్ష సమయంలో ద్రవ ఆహారమైన పాలు, పండ్లు, మంచినీరు మాత్రమే తీసుకున్నారు. అందుకే ముఖ్యమంత్రుల భేటీకి ఆయన హాజరుకాలేదని పార్టీ వర్గాలు అంటున్నాయి. కారణమేదైనా ఈ పరిణామంతో ఢిల్లీ స్థాయిలో బిజెపి పెద్దల దగ్గర పవన్ కళ్యాణ్ క్రేజ్ మరింత పెరుగుతుందన్న విశ్లేషణలు సాగుతున్నాయి.

**వ్యాసకర్త : సీనియర్ జర్నలిస్ట్**




31

# "రావణుడి మొండి వైఖరి" ఒక నియంత అంతం

నిజానికి అతి కాముకులలో కాముకుడు రావణుడు. ఎందరో మునికన్యలను, ముని పత్ను లను, దేవగంధర్వ, మానవకాంతలను, పరదార లను చెరబట్టాడు. భంగపరిచాడు. వాడి కామం చల్లారలేదు. శూర్పణఖ చేత ప్రేరితుడై సీతను బలాత్కారంగా దొంగచాటుగా, పిరికిపందలా లాక్కుని వచ్చాడు. కేవలం బ్రహ్మ శాపం– రంభ శాపం, ఉమాదేవి శాపం, నందీశ్వరుని శాపం. ఇలా శాప భయ కారణంగానే ఆమెను బలా త్కారంగా అనుభవించలేక పోయాడు. కామం విషయంలో వాడు పశుతుల్యుడు, చాటు మరుగు, గోప్యం, ఇంగితం లేవు కామానికి! బ్రహ్మజ్ఞానుల వంశంలో జన్మించిన రావణుడు, కఠోర తపస్సుతో ఎన్నో వరాలు పొంది త్రిలోక విజయమూ సాధించిన రావణుడు "కామం" అనే అరిషడ్వర్గాలలోని మొదటి అగ్నికి లొంగి పశు తుల్యుడై–గుప్తంగా సాగవలసిన ప్రణయాన్ని, తుచ్ఛ కోరిక స్థాయికి దిగజార్చాడు. రాక్షసులలో – గంధర్వులలో– విద్యాధరులలో, మానవులలో ఇలా కామాతురులు, మధిరాపానమత్తులూ ఎందరో ఉన్నారు ఆనాడు, ఈనాడు. కానీ పుత్ర, మిత్ర, కళత్ర, పరివారమంతటికీ తెలిసేలా ఒక స్త్రీ సంబంధమైన కామంతో ఒళ్లు తెలియకుండా తన మరణానికీ, కుల నాశనానికీ, వంశ నాశనానికీ వెనుకాడని కామాంధులు ఏ యుగంలోనూ, ఏ దేశంలోనూ, ఏ కాలంలోనూ లేరు. ఇక ఉండబోరు. తన కామానికి ఇంద్రజిత్తును బలిచేశాడు. అప్పుడు నిజంగా ఏడుస్తాడు. సీతమీద కోపం వచ్చి, ఆమెను చంపబూనుకుంటాడు.

సీతను మభ్యపెట్టడానికి రాముని శిరస్సు మాయతో కల్పించినంత, సీత చనిపోయినట్లు రాముని మభ్యపెట్టడానికి ఇంద్రజిత్తు సహాయంతో పుష్పక విమానంలో మాయసీతను పంపి – ఇంద్రజిత్తు చంపినట్లుగా నాటకం ఆడిస్తాడు. అలాగే ఈ శుకసారణులనే గూఢచారుల ద్వారా సుగ్రీవుని తనవైపు ఆకర్షించుకొనే ప్రయత్నంచేసి, తద్వారా వానరసేనను వెనుకకు మరలించవచ్చని ఆలోచిస్తాడు.

ఇన్ని ఆలోచనల పర్యవసానం, కేంద్ర బిందువు సీత! ఆమెను పొందాలనే ఆలోచన, "రాజు చేసిన తప్పువల్ల మనందరి ప్రాణాలు పోయే సమయం వచ్చింది" అని రాక్షసులంతా అనుకుంటున్నా ఖాతరు చేయలేదు. అవినీతి, అధర్మం, అతి కాముకత్వం, పరదారాపహరణం, తన పంతం నెరవేర్చుకునేందుకు మమత, ప్రేమాభిమానాలు లేకుండా బలిపెట్టి ఒక జాతిజాతినే ఆహుతి చేశాడు. తన శౌర్యంపట్ల అహంకారం, వరగర్వం, ఆత్మీయుల, హితైషుల హితవాక్యాలు అతగాడిని చలింపజేయలేదు. అందుకే ఆ నియంత అంతానికి ప్రకృతి, పశువులు, పక్షులు, మృగాలు, నీరు, గాలి, నిప్పు, ఆకాశం, దేవతలు, ఋషులు, ఔషధులు, దేవతలు –ఒకటేమిటి సర్వం సహకరించింది శ్రీరామునికి. "రామావతారం" అంటూ ఒక అవతారమే అవసరమయ్యింది. అలాంటి రావణుని పాత్రను మహర్షి దుష్టుడిని దుష్టిడిగానే మలచిచూపి "ఈ లక్షణాలు మీలో పెరగనివ్వ కండర్రా!" అని భావితరాల్ని హెచ్చరించాడు రామాయణ కావ్యం ద్వారా! కానీ ఈనాడు ఆ అతి కాముకుణ్ణీ, అతి మొండి వైఖరి గలవాడినీ, అతి దుర్వార్తనాపరుణ్ణి – మన సినీ నిర్మాతలు, కొందరు కవులు, నటులు వీణావాదనం చేస్తూ అతిరసికుడిగానూ, ఈశ్వరపూజ చేస్తూ అతి శివపూజా దురంధరుడి గానూ, స్త్రీలతో చతుర సంభాషణలు సాగిస్తూ అతి సున్నిత ప్రణయ, శృంగార నిధిగానూ వర్ణిస్తూ చిత్రించి, రాముడి కంటే రావణుడే పూజనీయుడనే ధోరణిలో యువతరాన్ని మభ్యపెట్టటం చూస్తుంటే – ఉప్పుకూ కర్పూరానికీ తేడా తెలియకుండా ఉన్న ఈ అతి తెలివిపరులను ఏమనాలో తోచదు! దుష్టుడిని శిష్యుడిగా చిత్రిస్తే నష్టపోయేది ఎవరు? ఆలోచిద్దామా కాస్సేపు!

**పవని నిర్మల ప్రభావతి**

**జాగృతి 15.09.1986 సంచిక నుంచి**



ఆధ్యాత్మికం

మన ఋషులు

# కలియుగదైవం అవతార కర్త భృగువు



బ్రహ్మ హృదయం నుంచి పుట్టిన వాడు భృగువు. భృగు వంశానికి మూలపురుషుడు. ఆయన వంశీయు లను భార్గవులు అంటారు. భృగుసూత్రాలు, నాడీ శాస్త్రంను లోకానికి అందించాడు. కాత్యాయనుడు ఆయనను ధర్మశాస్త్ర ప్రవక్తగా పేర్కొన్నాడు. కాత్యా యనుడు 'భృగుస్మృతి'లో ఆకతాయిల (ఇంటికి నిప్పు అంటించేవాడు, విష ప్రయోగం చేసేవాడు, పరదార ధనాదులను దోచుకునేవాడిని ఆకతాయిలు అంటారు)గురించి ప్రస్తావించగా, ఆకతాయి విద్యావంతుడైనా అతని చేష్టలు సమర్థనీయం కావని, సంహరించతగిన వాడని భృగువు నిర్ధా రించాడు. కర్దమ ప్రజాపతి కుమార్తె ఖ్యాతిని వివాహం చేసు కున్నాడు. ధాత, విధాత అనే కుమారులు, శ్రీ అనే కుమార్తె కలిగారు. ఆయన తపస్సు చేసిన ప్రదేశం భృగుతీర్థంగా ప్రసిద్ధి పొందింది. భృగువు త్రికాల వేది. కామధేనువు తరలించేందుకు ప్రయత్నించిన కార్తవీర్యార్జునుడు అందుకు అడ్డువచ్చిన జమ దగ్నిని సంహరించగా, భృగువు ఆయనను సజీవు డిని చేశాడు. క్షత్రియ సంహారం తరువాత తనను కలిసి ఆశీర్వాదం పొందిన మునిమనవడు పరశు రామునితో, తపోబలం పెంచుకోవడానికి కాకుండా లోక కల్యాణం కోసం తపస్సు చేయాలని సూచిం చాడు. దానిని పాటించిన పరశురాముడికి పర మేశ్వరుడు భార్గవాస్త్రాన్ని ప్రసాదించాడు.

ఋషుల ఆగ్రహానుగ్రహాలు లోక కల్యాణ కారకా లని ఈ మహర్షివల్ల మరోసారి రుజువైంది. కలియుగ

# క్షమించడం అంటే ఏమిటో కృష్ణుడికి తెలుసు

31




శ్రీకృష్ణుడు క్షమాగుణసంపన్నుడు. ఈ మాట కొంతమందికి తొందరగా గొంతు దిగదు. శ్రీకృష్ణుణ్ణి భగవంతుని అవతారము అనవచ్చు, నీలామానుష విగ్రహుడనవచ్చు. మాయవి అనవచ్చు. జగన్నాటక సూత్రధారి అనవచ్చు. రాజనీతిచతురుడు అనవచ్చు. యుద్ధనీతి విశారదుడు అనవచ్చు. ధర్మసంస్థాపకుడు అనవచ్చు. పాండవ పక్షపాతి అనవచ్చు. కానీ క్షమా శీలి అని అంటే పొసగుతుందా? అని అంటారు. శ్రీకృష్ణుడు ఎవర్ని క్షమించాడు కనుక? కంసుడిని చంపాడు, జరాసంధుడిని చంపించాడు. భీష్మ, ద్రోణ, కర్ణ, దుర్యోధనాదులను అంతమొందించటానికి కారకుడయినాడు. అభిమన్య, ఘటోత్కచాదుల మరణానికి కూడా కృష్ణుడు అదృశ్య హస్తం ఉండక పోదని అంటారు. ఇక బాల్యంలో పూతన, శకటాసుర, ధేమకాసుర, తృణావర్తాది రాక్షస గణాలను ఒక్కరినీ విడవకుండా మట్టుపెట్టాడు. ఇలాంటి కృష్ణుణ్ణి అంటే "మహావీరుడు" అని అనవచ్చునేమో గాని "క్షమాశీలుడు" అని అనగలమా?

ఇక్కడ అసలు క్షమించటం అంటే ఏమిటో నిర్వచించుకోవలసిన అవసరం ఏర్పడుతుంది. క్షమా గుణంవేరు, దయాగుణం వేరు. దీనులు, దుఃఖితులు, హీనులు, దుర్బలులు అయిన వారిపట్ల చూపించేది దయ. కష్టదశలో ఉన్న వ్యక్తి వచ్చి శరణు వేడితే లేక సహాయాన్ని అర్థిస్తే అప్పుడు ప్రకటించేది దయ. క్షమించటం అనే ప్రసక్తి వచ్చినపుడు ఎదుటివాడు బలవంతుడు, అహంకారి అయి ఉండటం, అట్టివాడు అజ్ఞానంవల్లనో, ఆవేశంలోనో ఒక అకృత్యానికి పాల్పడటం – ఆ స్థితిలో వాణ్ణి శిక్షించడం ద్వారా కాక క్షమించడం ద్వారా సంస్కరించడానికి ప్రయత్నించటం జరుగుతుంది. అనగా క్షమించేవాడు. ఇంకా ఎక్కువ బలవంతుడుగా ఉండాలన్న మాట. క్షమించేవాడు ఎదుటివాడిని దారికి తీసుకొని వచ్చే బాధ్యతను గ్రహించాలన్న మాట. క్షమాగుణానికి వ్యతిరేక మయినది క్రోధం వికృతి, క్షమ సంస్కృతి.

ఈ దృష్టితో ఆలోచిస్తే క్షమాగుణం ఉన్నదని చెప్పేవారిలో చాలామందికి అది సంపూర్ణంగా అలపడలేదని చెప్పాల్సి వస్తుంది. ఇది సాహసంగా కనిపించవచ్చు. ఉదాహరణకు – ఏసుక్రీస్తును శిలువ వేశారు. అప్పుడు ఆయన "ఓ తండ్రి, వారు ఏమి చేస్తున్నారో వారికి తెలియదు, వారిని క్షమించు" అని అన్నాడు. తాను బలి అయినాడు. ఏసుక్రీస్తు చేసిన బలిదానం తక్కువదేమీ కాదు. ఆయన పరాక్రమవంతుడే. కాకపోతే ఆత్మాహుతి కాగలడా? అకర్మణ్యతతో విధి రాతకు లొంగిపోయే సామాన్య మానవుని కన్నా ఆయన ఎన్నో రెట్లు పైస్థాయిలో ఉన్నవాడే – కాని ఆయన బలిదానంలో క్షమాగుణం సంపూర్ణ లక్షణం ఎంతవరకు ఉన్నది అనేది ప్రశ్న. అలాగే సోక్రటీసు కూడా. సోక్రటీసును జైలులో పెట్టారు. విషపాత్ర ఇచ్చి త్రాగమన్నారు. జైలు నుండి పారిపోయేందుకు అవకాశం వచ్చింది. బయటి యువకులను పోగుచేసి దుష్టులకు ఎదురు తిరిగి నిలిచే అవకాశం వచ్చింది. కాని సోక్రటీసు విషాన్ని తాగి మరణించడానికి సిద్ధపడ్డాడు. తనను దండించిన అధార్మికులయిన పాలకులను ఆ విధంగా క్షమించానని అనుకొన్నాడు. సోక్రటీసు చేసిన ఆత్మబలిదానం తక్కువ స్థాయికి చెందింది అని చెప్పటం ఇక్కడ తాత్పర్యం కాదు. క్షమాగుణ సంపన్నత సంపూర్ణ స్వరూపం ఇక్కడ సాక్షాత్కరిస్తున్నదా? అనేది పరిశీలించవలసిన విషయం.

మనకు తెలిసిన మరొక చారిత్రిక ఉదాహరణ ఉన్నది. మహమ్మదు ఘోరీ మన దేశం మీదికి 17సార్లు దండెత్తి వచ్చాడు. ప్రతిసారి ఓడిపోయే వాడు. ఓడిపోయిన ప్రతిసారీ పృథ్వీరాజు ముందు నిల్చి 'శరణు' అనేవాడు. పృథ్వీరాజు క్షమించేవాడు. ఘోరీ మళ్లీ దండెత్తి వచ్చాడు. ఈసారి జయచంద్రుడు తోడయినాడు. పృథ్వీరాజు ఓడిపోయినాడు. ఘోరీ ఏంచేశాడు? పృథ్వీరాజును బంధించాడు. కళ్లు కూడా పీకించాడు. ఈ సంఘటనలో పృథ్వీరాజును క్షమాశీలునిగా ఎంతవరకు పరిగణించగలం? క్షమించమన్నాడు కనుక క్షమించాలి, అది ధర్మం అని పృథ్వీరాజు అనుకొన్నాడు. బహుశా శ్రీరాముడి శరణాగత వత్సలత పృథ్వీరాజు కనులముందు ఉండిఉంటుంది. శ్రీరాముడు తనకు పరమశత్రువైన రావణుడి తమ్ముడు విభీషణునికి శరణు ఇచ్చాడు కదా! రావణుడేవచ్చి అడిగినా శరణు ఇస్తాను అని ప్రకటించాడు కదా!

–వైశంపాయన

'జాగృతి' 18-09-1982 సంచిక నుంచి

---

ప్రత్యక్షదైవం శ్రీవేంకటేశ్వరుని ఆవిర్భావానికి ఈ రుషే కారకుడని వెంకటాచల మహాత్మ్యం చెబుతోంది. సరస్వతీనదీతీరంలో మహాక్రతువు నిర్వహిస్తున్న రుషులకు, త్రిమూర్తులలో ఎవరు గొప్ప? ముక్తి ప్రదాతలు ఎవరు? అనే అంశంపై కలిగిన సందేహాన్ని తీర్చడంలో ఆయన కీలక పాత్రవహించి త్రిమూర్తులను పరీక్షించ నిశ్చయించుకున్నాడు.

మొదట సత్య లోకానికి వెళ్లిన తన పట్ల బ్రహ్మ అవమానకరంగా వ్యవహరించాడని ఆగ్రహించి రజోగుణ ప్రధానుడవైన నీకు పూజాదికాలు ఉండవని శపించి కైలాసానికి వెళ్లాడు. పార్వతీదేవితో క్రీడిస్తున్న శివుడు, తన ఆకస్మిక రాకకు ఆగ్రహించడంతో తమోగుణ ప్రధానుడవైన నీకు నిజరూపంలో అర్చనలు ఉండవని శపించి వైకుంఠానికి వెళ్లాడు. ఆయన రాకను గమనించిన విష్ణువు తటాలున లేచి వచ్చి ఆ మహర్షికి నమస్కరించాడు. అయినా ఆయన విష్ణువు వక్షస్థలంపై తన్నాడు.

శ్రీహరి ఏ మాత్రం కోపగించక, పాదసేవ చేస్తూ ఆయన అరికాలిలోని కన్నును చిదిమి వేయడంతో మహర్షి అహం నశించి ఆత్మజ్ఞానమైంది. అయితే, తను నివాసమైన విష్ణు వక్షస్థలంపై ఆ రుషి పాదతాడనం చేశాడన్న కినుకతో వైకుంఠం వీడివెళ్లింది లక్ష్మీదేవి. ఆమెను వెదుక్కుంటూ వెళ్లిన శ్రీపతి శ్రీనివాసుడిగా అవతరించి పూజలు అందుకుంటున్నట్లు ఐతిహ్యం. తపశ్శక్తితో బ్రహ్మత్వం పొందిన మహనీయుడు. 'మహర్షీణాం భృగురహం ...' (మహర్షులలో భృగువును) అని శ్రీకృష్ణ భగవానుడు భగవద్గీతలో చెప్పడాన్ని బట్టే ఆయన ఉన్నతి విదితమవుతుంది.

–రామచంద్ర రామానుజ

## వివేకానంద సూక్తిశతి

The more our bliss is within,
the more spiritual we are.
Let us not depend upon
the world for pleasure.



అనుభవించుచున్న ఆనందమందున
అవని లౌక్యదృష్టి అంతరింప
అంత గొప్పన ఆధ్యాత్మపరుడవు
వినుడి స్వామి సద్వివేక వాణి!!



బండిరాజుల శంకర్

“నేను తల్లిని కావాలి. నాకా అవకాశంలేదు. నా భర్త తండ్రి కావాలి. కానీ నా ద్వారా తండ్రి కాలేడు. మా ఇద్దరి అండం, వీర్యాల్ని సేకరించి మాకు పాపనిచ్చే అద్దె తల్లి కావాలి. తొమ్మిది నెలలు మా సంతానాన్ని తన కడుపులో మోయటానికి గర్భాన్ని అద్దెకిచ్చే అమ్మ కావాలి. అందుకు సహాయపడే తల్లికి ఎంత డబ్బయినా ఇస్తాను” డాక్టర్ వరదతో చెప్పింది ఉష.

వరద విని తరువాత గీరాతో సంప్రదించింది.

ఆలోచిస్తానంది గీరా, ఆ విషయం విని.

‘అది కొత్తేమీ కాదు. సంపాదన కోసం అందరూ చేస్తున్న పనే!” వివరించింది వరద. ఒక పక్క ధనం, ప్రలోభం, అవకాశం.. మెల్లిమెల్లిగా ఆలోచనల్ని పక్కకు పెట్టి అవకాశాన్ని ఉపయోగించుకోమన్నది.

అది వివేకం కాదు. త్యాగం అంతకన్నా కాదు. వివేకమయితే అమృతనాన్ని అద్దెకివ్వదు. త్యాగమయితే పుట్టిన బిడ్డను పంచి ఇవ్వదు. ఈ రెండూ కాని ధన ప్రలోభం.. ద్రవ్య జగత్తులోకి ఆమెను నడిపించింది.

కూతురు హాస్టల్లో ఉండి చదువుకుంటుంది. తాము బతకటానికి గ్రామాన్ని విడిచి ‘వలస’ వెళ్లారు గీరా తల్లిదండ్రులు. తాను హాస్టల్లో ఉంటానంటే, మొదట కాదన్న తల్లిదండ్రులు తరువాత ఒప్పుకున్నారు.

అమ్మా నాన్నలు అంగీకరించకపోయినా, విషయం విని ఆలోచిస్తాననటమే ఉషలాంటివారికి అవకాశాన్నిచ్చి ‘సంతాన సాఫల్యకేంద్రానికి’ నడిపించిందామెను. ఐ.యు.ఐ. (ఇంట్రా యుటిరైన్ ఇంజక్షన్) ద్వారా ఇప్పుడు తల్లిగా నిలబడింది.

ఇక్కడ గీరా తల్లి కాదు. కనే తల్లి గీరా. తండ్రి అనిరుద్. ఆ సంతానాన్ని చేతుల్లోకి తీసుకునేది ఉషా, అనిరుద్. తల్లి గీరా, తండ్రి దుష్యంత్. ఆ పాపను చేతుల్లోకి తీసుకునేది కుంతలా దుష్యంత్ గాంధారి అండం. వ్యాస్ శుక్రకణం. ఆ పాపాయిని చేతుల్లోకి తీసుకునేది గాంధారి, రాష్ట్రాయ్.

ఇందరికి చెందిన గర్భాల్ని గీరా మోస్తుందిపుడు మూడో వ్యక్తిగా. డాక్టర్ వరద నర్స్ వెనకాల నిలబడి



**‘జాగృతి’ నిర్వహించిన స్వర్గీయ కొండపాక కిషన్‌రావు స్మారక నవలల పోటీలో ప్రథమ బహుమతి పొందిన రచన**



# జన్మ 15

స్కానింగ్ చూస్తున్నది దీక్షగా.

టెక్నిషియన్ నూతన స్కాన్ చేస్తున్నది.

పరిశీలిస్తున్న వరద క్షణం ఆశ్చర్యపోయింది. పదే పదే గీరా తలవైపున్న మానిటర్‌ను చూస్తున్నది. అతి సూక్ష్మప్రాణులు చిన్న చిన్న చుక్కల్లా ఉమ్మనీటి ఉయ్యాల్లో చేపగుడ్లలా ఉన్నాయి. అయితే వరద ఆశ్చర్యపోయింది అందుకు కాదు. ఆమె లెక్క ప్రకారం, ముగ్గురు పిల్లల్ని గీరా మొయ్యాలి. కాని, ఇక్కడ, మరో ప్రాణి, ఆ చిన్ని ప్రపంచంలో, చోటు కోసం వెతుక్కుంటున్నది.



"నాకూ చాలమంది పిల్లల్ని కనాలనుంది డాక్టర్. నేను ఒంటరిదాన్ని, ఒంటరిగా పెరిగాను. ఆ ఒంటరితనాన్ని ఛేదించటానికి, బహు సంతానానికి తల్లిగా బ్రతికి, అమ్మా అనిపించుకోవాలనుంది. కాని, నేనొక బాధ్యతా బంధానికి కట్టుబడి పోయాను. నేను అమ్మగా కన్నా, అమ్మకానికో అమ్మగా నిలబడ్డాను. తొమ్మిది నెలలు నా ప్రాణంలో ప్రాణంగా పెంచి, కనీసం కంటితో నయినా చూడకుండా వారిని దూరం చేసుకుంటాను. ఇది తప్పదు. కానీ కనీసం ఆ అనుభూతుల నయినా నన్ను పొందనీండి" అన్న గీరా మాటలు గుర్తొచ్చాయి.

డాక్టర్ వరద ఆలోచిస్తున్నది.

గీరా అగ్రిమెంట్ చేసుకుంది ముగ్గురు దంపతులతో. వాళ్లు ఉషా అనిరుద్, కుంతలా దుష్యంత్, గాంధారి రాష్ట్రాయ్. కాని, మరి.. ఈ న్యూలీ బేబి... ఆ చిన్నప్రాణి ఉనికి ఆమెకే సవాలుగా నిలిచింది.

ఉషా, కుంతల దంపతులకు వేర్వేరు జీవకణాలు, అండాలు. అలాగే గాంధారి... ఈ గర్భం కూడా. కానీ, ఒహ్, ముగ్గురికి మాట ఇచ్చి, అగ్రిమెంట్ తీసుకున్నారు కాబట్టి ఓకే.

కానీ ముందు జాగ్రత్తగా, ఎందుకైనా మంచిదని, గీరాలో మూడు అండాల్ని ప్రవేశపెట్టింది.

అందులో ఒకటి ఉష సంతానం కోసం, రెండోది కుంతలకు అబ్బాయిని కనివ్వడం కోసం. మూడోది ముందు జాగ్రత్త కోసం.

నిజానికది నిర్వీర్యం కావాలి. కారణం ఒక్కోసారి, గర్భంలో సరైన పోషణ లభించక, చోటు లభించక ఎదగదు. తరువాత నిర్వీర్యంగా జారిపోతుంది. కానీ... ఈ పాప అవే కారణాలయినా, రెండు రోజులు ఆలస్యంగా ఫలదీకరణం చెంది ప్రాణిగా మారింది.

అదే లాబరేటరీలో కాక, అతి సహజంగా గర్భంలో.

ఓ... ప్రస్తుతం గీరా నలుగురు బిడ్డల తల్లి. ఓ గాడ్! ఇందులో కుంతలకు అబ్బాయే కావాలి. లక్కీగా మగపిల్లవాడయితే చాలు అనుకుంది. స్కాన్‌లో పరిశీలిస్తున్న నూతన "డాక్టర్! వాట్ ఏ వండర్. ఫోర్ బేబీస్" అంటూ ఆశ్చర్యపోయింది.

గీరా... మగతగా పడుకునుంది, వినడం లేదు. లేకుంటే, ఎగ్జయిట్ అ య్యేదే. ఒక గర్భం. అందులో నలుగురు పిల్లలు. ఇదేమి అద్భుతం కాదులే నూతనా! ఒక్కోసారి పాలిసిస్టు అండాలు ఉత్పత్తి అవుతాయి. అంటే, ఒకే అండానికి జతగా మరో అండం తయారై, అది కూడా ఒకేసారి ఫలదీకరణ చెందితే కవలలు పుడతారు. వీరి రూపాల్లోను, లింగనిర్ధారణలోనూ తేడాలుంటాయి. అలా కాక, ఒక్కోసారి ఫలదీకరణ చెందిన అండమే 'సెల్ డివిజన్'లో అనూహ్య మార్పులు జరిగి, రెండు బదులుగా, నాలుగు, ఎనిమిదిగా విడిపోతే కవలలు పుడతారు.

అయితే, వీరిలో తేడాలుండవు. ఇద్దరూ ఒకే రూపంతో, ఇద్దరు ఆడకాని, ఇద్దరు మగకాని పుడతారు. వీరినే 'సారుప్యకవలలూ' లేదా ఐడెంటికల్ ట్విన్స్ అంటారు" చెప్పింది డాక్టర్ వరద.


ఆ విషయం గీరాకు సర్‌ప్రయిజింగ్‌గా చెప్పాలని, ఇప్పుడే చెప్పలేదు డాక్టర్ వరద.

* * *

గీరాకు, మూడు నెలలు నిండాయి. గర్భంలోని శిశువుల్లో కదలిక మొదలయింది. డాక్టర్ వరద కనుసన్నల్లో, గీరా సంతానం అపురూపంగా పెరుగుతున్నది.

ఆసుపత్రికి దగ్గరగా, అన్నీ వసతులున్నా డబుల్ బెడ్‌రూమ్ ఫ్లాట్ తీసుకుని అందులో ఉంచింది గీరాను. ఆమెను ఇరవై నాల్గు గంటలు కంటికి రెప్పలా చూసుకుంటూ తోడుగా ఉండే నర్స్ సహాయకురాలిగా ఉంటుంది.

బలమైన ఆహారం, అదీ సమయం ప్రకారం. బ్రేక్‌ఫాస్టు పదకొండు గంటలకు. గ్లాస్ పాలు, ఒక యాపిల్, పన్నెండున్నరకు. తరువాత మంచి పుష్టికల సమీకృత ఆహారంతో కూడిన లంచ్. రెండు గంటలు



సంబరాజు లీల (లట్టుపల్లి)

విశ్రాంతి.

తరువాత తన పని తను చేసుకుంటుంది. మూడు గంటలకు ప్రొటీన్ బిస్కట్లు, ఒక ఆరెంజ్, గ్లాస్ ద్రాక్ష రసం, నాలుగు గంటలకు 'టి' వాకింగ్, తోడుగా నర్స్ ఉంటుంది. ఆరు గంటలకు చిన్న గ్లాసు పైనాపిల్ రసం. ఎనిమిది గంటలకు ఒక చపాతితో మితంగా భోజనం– తొమ్మిదిన్నరకు గ్లాస్ పాలతో కార్యక్రమం పూర్తవుతుంది.

ఆమె నిద్రపోతున్నా బీపీ షుగర్ టెస్టు చేస్తుంది నర్స్. మళ్లీ ఉదయం రొటీన్ ప్రారంభమౌతుంది. గీరాకే ఆశ్చర్యం వేస్తుంటుంది.

నిజంగా మాతృమూర్తి కాబోయే వారికి ఇంత శ్రద్ధ అవసరమా? అసలు మనవాళ్లు ఇస్తున్నారా? పాపం, ప్రసవం పునర్జన్మతో సమానమంటారు. కానీ నాకు, ఇది కమర్షియల్ ప్రసవం మరి, అనుకుని నవ్వుకుంది. ఆ రోజు డాక్టర్ స్కానింగ్ రిపోర్టు చూస్తూ "గుడ్ ప్రొగ్రెస్ గీరా! నీవనుకున్నట్లే, చక్కటి పెరుగుదల కనిపిస్తుంది. యు ఆర్ లక్కీ. బీపీ, షుగర్ లాంటివేవి లేవు. ఎలాంటి కంప్లయింట్లూ లేవు.

"సాధారణంగా ఇలాంటి కేసుల్లో, న్యూలీ బేబీతో తల్లికి, మొదటి రెండు వారాల్లోనే సమస్యలొస్తాయి. నీవు ఆ దశ నుంచి బయటపడినట్లే! యూ ఆర్ సక్సెస్" అని చెప్పింది.

"ఇందులో మీ సహకారం ఎంతో ఉంది డాక్టర్! నేను అమ్మనవుతున్నానంటే, అందులో సగం మీ శ్రమే!" అంది గీరా.

వరద నవ్వుతూ "మరి ఫీజు రావాలిగా!" అంది.

"డాక్టర్! ఆ పిల్లల్లో ఆడా, మగా అనేది తెలుస్తుందా?" ఆత్రుతగా అడిగింది.

"తెలుస్తుంది. మరీ అంత ఎగ్జయిట్ కాకు మరి, కుంతలా దుష్యంత్‌లకు, వారు కోరుకున్నట్లె అబ్బాయి. ఉషా, అనిరుద్‌లకు అబ్బాయే. గాంధారికి మాత్రం ఆడపిల్ల" చెప్పింది.

"అలా... ఎలా తెలుస్తుంది?" ఆశ్చర్యంగా

చెట్టుకు కాసిన ఫలం, చేతిలోకి తీసుకుని, తినటానికి నోచుకోకపోవటం ఎంత దురదృష్టం, మరెంత దుఃఖం? ప్రాప్తం లేదనుకోవటానికి, ఇదేమి భగవంతుడు చేసింది కాదు, ప్రకృతే నా మాతృత్వాన్ని నిలపకుంటే, నేనింత బాధపడేదాన్ని కాదు. దానితో అనుబంధం నాకింతే! చెట్టుకు పూసిన పూతంతా కాయలు కావు. ఇది, అలాగే అనుకునేదాన్ని. కానీ మా ఇంటివాళ్లే, బలవంతంగా ఆ పసిప్రాణాల్ని తొలగించారు." కళ్లు తుడుచుకుంది.



ప్రశ్నించింది.

"డి.ఎన్.ఎ. టెస్టు. కన్న తరువాతయినా మళ్లీ చేసే ఇస్తాం. ఇలాంటి కేసుల్లో చాలా గుట్టుగా ఉంటాం. నీవు ఎవరో వాళ్లకు తెలవదు. వాళ్ల గురించి నీకు తెలవదు పేర్లు తప్ప. నీ కష్టం, శ్రమ చూసి చెప్పాను" అంది వరద.

గీరా ఒక్కసారి, కుడిచేత్తో పొట్టని తడుముకుంది. బొడ్డు క్రింది భాగమంతా కొంచెం గట్టి పడి, ముడుతలు లేకుండా నిండుగా ఉంది.

చెయ్యి తగలగానె చిన్న కదలిక. అది సన్నగా తెలిసింది గీరాకు. గీరా దేహమంతా పులకరించి పోయింది. ఎంతటి భాగ్యం తనది. ఇలాంటి అదృష్టానికి నోచుకోని ఆ తల్లులదెంత దురదృష్టం" అనుకుంది.

మనసు పులకరింతలతో కూడిన సంతోషంతో కదలిపోతుంటే, ధరిత్రి వెంట వాకింగ్‌కు వెళ్లింది.

* * *

ఉష అనిరుద్, గాంధారి రాష్ట్రాయ్, కుంతలా దుష్యంత్‌లను విడివిడిగా పిలిచి వారితో మాట్లాడింది. విషయం చెప్పింది.

"మిసెస్ కుంతలా! మీకు అబ్బాయి. మీరు కోరుకున్నట్లుగా అబ్బాయి అయ్యి, ఎంత అదృష్టవంతులయ్యారో! కానీ మీరు అప్పుడు కాదు దురదృష్ట వంతులు. ఇప్పుడు. మీకిప్పుడు పుట్టేది, ఐ మీన్...సరోగేట్ మదర్ ద్వారా పుట్టేది అబ్బాయి... కానీ, ఆ నవజాత శిశువును మీ స్వయం కృతాపరాధం వల్ల, కుంతల కనలేకపోయింది. దీనికి బాధ్యత మీ అమ్మగారిది."

అది వినగానే దుష్యంత్‌లో క్షణంపాటు బాధా వీచికలు కనిపించి మాయమయ్యాయి. కుంతలయితే కూర్చున్న చోటనే కూలబడిపోయింది.

చెట్టుకు కాసిన ఫలం, చేతిలోకి తీసుకుని, తినటానికి నోచుకోకపోవటం ఎంత దురదృష్టం, మరెంత దుఃఖం? ప్రాప్తం లేదనుకోవటానికి, ఇదేమి భగవంతుడు చేసింది కాదు, ప్రకృతే నా మాతృత్వాన్ని నిలపకుంటే, నేనింత బాధపడేదాన్ని కాదు. దానితో అనుబంధం నాకింతే! చెట్టుకు పూసిన పూతంతా కాయలు కావు. ఇది, అలాగే అనుకునేదాన్ని. కానీ మా ఇంటివాళ్లే, బలవంతంగా ఆ పసిప్రాణాల్ని తొలగించారు." కళ్లు తుడుచుకుంది.

అలాంటి అనుబంధాలకూ, అనుభూతులకూ, వృత్తిరీత్యా దూరం అయిన డాక్టర్ వరదకే బాధనిపించింది.

తన హాస్పిటల్లో బిడ్డల్ని కని, బ్రతికించుకోలేని తల్లులు తనకు తెలుసు! కానీ, కుంతలలాంటి కేసులు చాల అరుదు. తనసలు, ఇలాంటి కేసులే పట్టుకోదు. అందుకే ఓదార్చింది.

"రిలాక్స్ కుంతలా! ఇక్కడికైనా నీ అదృష్టం. నీవు తలచుకుంటే, నీ బిడ్డే నీ ఇంట్లోకి వస్తుంది. మీ ఇద్దరి ఎక్స్, వై క్రోమోజోములతో రూపుదిద్దుకున్న బిడ్డనే మీ సరోగేట్ ఇస్తుంది. నీవు ఆడదానివయినందుకు ప్రకృతి నీకింకా, వరాలిస్తూనే ఉంది. దాన్ని నిలుపుకుంటున్నారు. అది చాలు కుంతలా! పూర్వ కాలంలోనైతే పిల్లలు పుట్టక పోవటానికి కారణం ఎవరైనా, ఆ లోపాన్ని ఆ ఇల్లాలి మీద రుద్ది భర్తకు మరో పెళ్లి చేసేవారు.

దానివల్ల ఒకటికి మరో దుఃఖం తోడయి భర్తను మరొకరితో పంచుకున్న దుఃఖం తోడయ్యేది. ఈ రోజుల్లో విజ్ఞానం పెరిగి ఆడవాళ్లని అలాంటి అపవాదు నుంచి తప్పిస్తున్నది" చెప్పింది ఓదార్పుగా.

(సశేషం)



నీల




# 'కాళ్ల కిందకు నీరు వస్తోంది'

**హిందువులు అంటేనే హింస అంటూ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ పార్లమెంటులో ఎంత అరచి గీపెట్టినా క్షేత్రస్థాయిలో వాస్తవాలు హింసకులు ఎవరో పట్టి చూపుతున్నాయి. అంతేనా, నిద్రిస్తున్న హిందువును తన కాళ్లకిందకు వస్తున్న నీరును గమనించకపోతే మునిగిపోతారని కోర్టులు కూడా హెచ్చరిస్తున్నాయి. అయినప్పటికీ, మనకు సెక్యులరిజం ముసుగు తొలగించుకోవాలంటే భయం.**

సెక్యులర్ తృణమూల్ కాంగ్రెస్ ప్రభుత్వంలో శాసనసభ్యుడు ఫిర్హాద్ హకీమ్, "మనం ముస్లిమేతరుల మధ్య ఇస్లాంను వ్యాప్తిచేయాలి. మనం ఎవరినైనా ఇస్లాం మార్గంలోకి తీసుకురాగలిగితే, విశ్వాసవ్యాప్తికి భరోసా ఇవ్వడం ద్వారా మనం నిజమైన ముస్లింలుగా నిరూపించుకుంటాము," అంటూ బహిరంగంగా ప్రకటించడం అన్నది ఇస్లామిస్టులలో పెరుగుతున్న ఆత్మవిశ్వాసానికి తార్కాణం వేరొకటి అవసరం లేదు. వారిలో తూర్పు, పడమర, ఉత్తర, దక్షిణ అన్న తేడా లేకుండా నలు దిక్కులా చొరబాటుదారులు అక్రమంగా ప్రవేశించడమే కాదు, హిందువులపై చేస్తున్న అత్యాచారాలు, దాడులు ఎదుర్కోవాలంటే, హిందూసమాజం



ఫిర్హాద్ హకీమ్

కులాలకు అతీతంగా ఏకం కావలసిందే. భారత దేశంలో హిందువుల ఉనికే లేకుండా చేయాలని ఇస్లామ్, క్రైస్తవ మతాలు కంకణం కట్టుకున్నట్టు కనిపిస్తోంది. రెండు వర్గాలవారూ పోటీపడి చేస్తున్న మతాంతరీకరణల వ్యవహారం కోర్టుల దాకా వెళ్లడంతో అవి కూడా సచేతనమై, హిందువులను అప్రమత్తం చేసే యత్నం చేస్తున్నాయి.

**మతాంతరీకరణపై హైకోర్టుల వ్యాఖ్యలు**

గతవారంలోనే ఉత్తర్‌ప్రదేశ్‌లో మతాంతరీకరణ చేస్తున్నాడన్న ఆరోపణలను ఎదుర్కొంటున్న నిందితుడికి బెయిల్‌ను నిరాకరిస్తూ, అలహాబాద్ హైకోర్టు న్యాయమూర్తి హిందువులు అప్రమత్తంగా ఉండకపోతే, మెజార్టీ జనాభా మైనార్టీలుగా మారే ప్రమాదం ఉందని హెచ్చరించిన విషయం గుర్తుండే ఉంటుంది.

తాజాగా, చట్టవిరుద్ధంగా చొరబడిన బంగ్లాదేశీ వలసదారులైన రోహింగ్యాలను గుర్తించి, బహిష్కరించి వారి దేశానికి తిప్పి పంపమంటూ ఝార్ఖండ్ హైకోర్టు ఉత్తర్వులను జారీచేసింది. షెడ్యూల్డు తెగలకు చెందిన ఆడపిల్లలపై అత్యాచారం చేసి దోచుకుంటున్నారంటూ డానియల్ డానిష్ అనే వ్యక్తి దాఖలుచేసిన పిటిషన్‌కు స్పందించి, విచారించిన హైకోర్టు ఈ ఉత్తర్వులను జారీ చేసింది.

బంగ్లాదేశ్‌లో నిషేధించిన సంస్థలకు చెందిన సభ్యులు భారత్‌లో చొరబడి ఇక్కడ గిరిజన బాలికలను ఇస్లాంలోకి మతాంతరీకరిస్తున్నారు. ఇందులో వారు ఎంచుకున్న ప్రధాన పద్ధతి లవ్‌జిహాద్. బంగ్లాదేశ్ సరిహద్దులలో గల సంథాల్ పరగణాలో అకస్మాత్తుగా మదర్సాల సంఖ్య పెరగడమేకాదు, వారు జాతి వ్యతిరేక కార్యకలాపాలలో పాలుపంచుకుంటున్నారు. ఈ చొరబాటు దారులు కేవలం స్థానిక మహిళలను దోచుకోవడమే కాకుండా చట్టవిరుద్ధంగా వారి భూములను కూడా ఆక్రమించుకుంటున్నారు. వివాహంద్వారా భారతీయ ఐడి కార్డులను పొందుతూ యథేచ్ఛగా తమ కార్యకలాపాలను సాగిస్తున్నారు. అంతేనా, వీరిలో కొందరు ఇక్కడ వ్యవస్థను ఉపయోగించుకొని రాజ్యాంగబద్ధమైన పదవులను కూడా పొంది, భూమి జిహాద్ కార్యకలాపాల్లో పాల్గొంటున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. అయినా, హిందూ సమాజం నిద్రలేవడం లేదు.

ఈ వ్యవహారం కేవలం రాష్ట్రప్రభుత్వం ఒంటరిగా నిర్వహించగలిగింది కాదంటూ కోర్టు నొక్కిచెప్పింది. ఈ సమస్యను పరిష్కరించేందుకు రాష్ట్రంతో సహకరించవలసిందిగా కేంద్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది. విచారణ సమయంలో చొరబాటు దారులకు వ్యతిరేకంగా చర్య తీసుకునేందుకు అన్ని రాష్ట్ర ప్రభుత్వాలకూ అధికారాలు ఉన్నాయంటూ కేంద్రం నివేదించింది. ఇలా చర్య తీసుకునేందుకు స్వేచ్ఛను ప్రసాదించింది కూడా మోదీ ప్రభుత్వ విధానమే!

**ఒకటి, రెండు రాష్ట్రాల సమస్య కాదు**

వాస్తవానికి ఈ సమస్య కేవలం ఝార్ఖండ్‌కు సంబంధించింది మాత్రమే కాదు. అన్ని సరిహద్దు రాష్ట్రాల్లోనూ ఇటువంటి మతాంతరీకరణలు, ఉద్దేశ్య పూరితంగా జనసంఖ్య సంబంధిత మార్పులను చేయడం అన్నది సర్వసాధారణంగా మారింది. నిజానికి, అనేక సరిహద్దు రాష్ట్రాల ప్రభుత్వాలు ఈ సమ స్యలను పరిష్కరించడంలో విఫలమవుతున్నాయి లేదా చర్య తీసుకుంటే తమ సెక్యులరిజానికి భంగం వాటిల్లుతుందేమోనని ఇష్టపడడం లేదు. ఈ చొరబాటుదారులు కేవలం భారతీయ వనరులను దోచుకోవడమే కాదు, చురుకుగా మతాంతరీకరణ లలో పాల్గొంటుండడంతో సమస్య వస్తోంది. ఈ రకంగా భారతీయ ఆత్మపై బహుముఖంగా జనాభా జిహాద్‌కు కూడా పాల్పడుతున్నారని నిపుణులు అంటు న్నారు. శాంతిదూతలమని చెప్పుకునే వీరు సనాతనుల ఉనికి లేకుండా చేసే యత్నం చేస్తున్నారు. అందులో భాగంగానే లవ్‌జిహాద్‌కు పాల్పడడం. ఈ ఇస్లామిక్ చొరబాటుదారులు భారత్‌లో స్థిరపడేందుకు సహాయం చేస్తున్నది భారతీయ ముస్లింలే. అందుకే, సమస్య క్షేత్రస్థాయిలో తీవ్రంగా ఉండటమే కాదు, అంత తొందరగా ఎవరి దృష్టినీ ఆకర్షించడం లేదు.

ఇక, హిందువులపై అత్యాచారాలకు అయితే లెక్కే లేకుండా పోతున్నది. గతంలో హిందూ, ముస్లింల మధ్య అల్లర్లు అంటే సామూహిక స్థాయిలో జరుగు తుండేవి. ఇవి ముస్లింలు పద్ధతి మార్చుకున్నట్టు కనిపి స్తోంది. తమ జనాభా అధికంగా ఉన్న ప్రాంతంలో తమ శాసనాలను అమలుచేస్తూ అరాచకాన్ని సృష్టిస్తు న్నారు. అది గ్రామ, మండల స్థాయిల్లో జరగడం, అక్కడి శాసనసభ్యులు భయంతోనో, పార్టీ విధానాల కారణంగానో వాటిని చూసీ చూడనట్టుగా వ్యవహ రించడం పెద్ద సమస్యగా మారుతున్నది. ఇలా కంటికి కనిపించకుండా జరుగుతున్న ఈ ఘటనల కారణంగా క్షేత్ర స్థాయిలో సామాజిక అల్లికే మారి పోతుండటం ఆందోళనకరమైన విషయం.

**పశ్చిమ బెంగాల్‌లో పాశవికత**

అందితే జుట్టు అందకపోతే కాళ్లు అన్న చందంగా, ఇస్లామిస్టులు, మిషనరీలు మెత్తగా ఉన్నవారిని మాయమాటలు చెప్పి మతాంతరీక రిస్తుండగా, తమతో విభేదించినవారిపై నిర్భయంగా దాడులకు పాల్పడుతున్నారు. కిందటివారంలోనే పశ్చిమ బెంగాల్లో షరియా శిక్ష తరహాలో కూచ్ బెహార్‌లో ఒక మహిళను, పురుషుడిని ఆ ప్రాంత ఎమ్మెల్యేకు సన్నిహితుడు అయిన షఫీకుల్, అతడి అనుచరులు నడిరోడ్డు మీద వివస్త్రులను చేసి మరీ కొట్టిన ఘటనను మరవకుండానే, బీజేపీ కార్యకర్త అయిన ఒక మహిళను వివస్త్రను చేసి పదునైన ఆయుధంతో దాడి చేశారు.

ఇప్పుడు ఆ మహిళ ఆసుపత్రిలో చికిత్స పొందుతోంది. ఒకవైపు రాజకీయ బలం, మరోవైపు మతబలంతో ఇస్లామిస్టులు హిందువులకు నరకం చూపిస్తున్నారు. ఈ రాష్ట్రం కూడా సరిహద్దు రాష్ట్రం కావడంతో బంగ్లాదేశీ చొరబాటుదారు గ్రామాలకు గ్రామాలను ఆక్రమించుకొని ఏలేస్తున్నారు. సందేశ్ ఖాళీ దారుణం బయటపడే వరకూ వారి అత్యా చారాలు బయటపడలేదు. దీని తర్వాత మీడియా దృష్టి ఆ రాష్ట్రంపై పడడంతో ఒక్కొక్క ఘటనా బయటకు వస్తున్నది.




**మహారాష్ట్రలో తక్కువ తినలేదు**

మహారాష్ట్రలో అయితే, కేవలం పదిహేను రోజుల్లో ఎనిమిదిమంది హిందువులపై హింసాత్మక మైన దాడులు జరిగాయి. మూకుమ్మడిగా కాకుండా, అక్కడొకటి, ఇక్కడొకటి అన్నట్టుగా జరుగుతున్న ఘటనలను యాదృచ్ఛికంగా పరిగణించడం సరికాదు. ఒక పథకం ప్రకారమే, ఎంచుకొని మరీ ఈ దాడులకు ముస్లింలు పాల్పడుతున్నారు. ఇలా అకస్మాత్తుగా ఒక దానితో మరొకదానికి సంబంధం లేకుండా అక్కడక్కడ జరుగుతున్న ఇటువంటి దాడులను యాదృచ్ఛికంగా ఎడతెగని తక్కువస్థాయి చెదురుమదురు హింసగా కొందరు విశ్లేషకులు అభివర్ణిస్తున్నారు.

ముఖ్యంగా, లోక్‌సభ ఎన్నికలు పూర్తి అయిన తర్వాత ఆ రాష్ట్రంలో హిందువులపై హింసకు పాల్పడుతున్న ఘటనలు పెరుగుతున్నాయని వార్తలు చెబుతున్నాయి. ముఖ్యంగా రాష్ట్రంలో ఎన్సీపీ (శరద్ పవార్), శివసేన (యుబిటి), కాంగ్రెస్‌కు ఓటువేసి ఎక్కువ సంఖ్యలో ఎంపీలను గెలిపించిన తర్వాత ఇస్లామిస్టులు మరింత నిర్భీతితో తిరుగుతూ, హిందూ యాక్టివిస్టులు, నాయకులపై అనవసరమైన దాడులకు పాల్పడుతున్నారని వార్తా కథనాలు వెలువడు తున్నాయి. ఒక ప్రాంతానికి చెందిన వారనే సాకుతో హిందూ సమాజంపై ఇస్లామిస్టులు చేసిన 7-8 దాడులతో రాష్ట్రం ఉలిక్కిపడింది.

**జైభీమ్ జైమీమ్ అన్నది అవకాశవాదమని రుజువు చేస్తున్న ఇస్లామిస్టులు**

గతవారం పూణె జిల్లాలోని లోహియానగర్ ప్రాంతంలో హిందూ కార్యకర్త అక్షయ్ ధావ్రేపై పదిమంది ఇస్లామిస్టులు దాడి చేశారు. హిందూ దళిత యాక్టివిస్టు అయిన అతడిపై ఇస్లామిస్టులు దాడి చేయడానికి కారణం అతడు ఒక నిర్దిష్ట ప్రాంతానికి చెందినవాడు, బీజేపీతో సంబంధాలు కలిగినవాడు కావడమే.

ఈ ఘటన జరిగిన నాలుగు రోజులు కాకుండా అదే ప్రాంతంలో రోహిత్ థోరట్ అనే హిందూ దళిత నాయకుడిపై దాడి జరిగింది. 'జై భీమ్ -జై మీమ్' అంటూ నినాదాలు చేసే ప్రతిపక్ష నాయకులు ఎవరూ ఈ ఘటనలను ఖండించి నట్టు కనిపించలేదు, వినిపించలేదు. హిందూ దళిత నాయకుడు రోహిత్ థోరట్‌పై అఫ్రీదీ షేక్ తన అనుయాయులతో కలిసి దాడిచేశాడు. తన వర్గానికి జరుగుతున్న అన్యా యాలు, ఎదురవుతున్న సవాళ్ల గురించి గొంతెత్తి పోరాడుతున్న అతడిని ఇస్లామిస్టులు లక్ష్యంగా



## అసలు నిజం

ప్రతీకారంగానే 2024 సార్వత్రిక ఎన్నికలలో ముస్లింలు బీజేపీని ఓడించేందుకు ఆ పార్టీకి వ్యతిరేకంగా ఓటు వేశారని దారుల్- ఉలూం- దేవబంద్ ప్రిన్సిపల్, జమాయెత్ ఉలేమా- ఇ-హింద్ అధ్యక్షుడు అర్షద్ మదనీ వ్యాఖ్యానించి, అసలు గుట్టు రట్టు చేశాడు. సార్వత్రిక ఎన్నికల ఫలితాలు ద్వేషాన్ని, మతతత్త్వ రాజకీయాలను తిరస్కరించాయని, ముస్లింలు తెలివిగా ఓటు వేయడంవల్లే ఈ ఫలితం సాధ్యమైందని వ్యాఖ్యా నించాడు. వారు తెలివిగా ఓటు వేయకపోయి ఉంటే ఫలితాలు మరొకరకంగా ఉండేవంటూ కూడా తాలిబన్‌ను సమర్థించే అర్షద్ మదనీ వ్యాఖ్యా నించడాన్ని మించిన మతతత్వం వేరేవైనా ఉంటుందా? రాహుల్‌గాంధీ, సమాజ్‌వాది పార్టీ అధ్యక్షుడు అఖిలేష్ సెక్యులర్ వైఖరిని కొనియాడాడు. అంతేనా, ముస్లింలు దేశభక్తులని, దేశాన్ని తమ ప్రాణాలకన్నా ఎక్కువగా ప్రేమిస్తారంటూ ఒక హాస్యాస్పదమైన వ్యాఖ్య చేశారు. మేధావులు, సెక్యులరిస్టులుగా భావించుకునే వారికి అతడు మాట్లాడినది సమంజసంగా అనిపించవచ్చేమో కానీ, ఇస్లాంలో ఉమ్మాకు తప్ప దేశమనే భావనకే చోటు

లేదని తెలిసినవారు మాత్రం అందులోని కాపట్యాన్ని గ్రహిస్తారు. దేశ విభజన సమయంలో జమాయెత్ ఉలేమా-ఇ- హింద్, తబ్లీగీ జమాత్‌కు చెందిన నాయకులు అనేకమంది విభజన కోరిన జిన్నాను సమరిస్తూ ముస్లిం లీగ్‌లో చేరగా, భారతీయులను పూర్తిగా మతాంతరీకరించాలనే ఉద్దేశ్యంతో విభజన సమయంలో అనేకమంది జమాయెత్ నాయకులు భారత్‌లోనే ఉండిపోయారన్న వాస్తవాన్ని మరువలేం. పైకి సెక్యులరిజం గురించి మాట్లాడే ఈ నాయకులు దారుల్-ఉలూం- దేవ్‌బంద్‌ను అడ్డుపెట్టుకొని, అతివాద ఇస్లామిస్టులను తయారుచేసి ప్రపంచ వ్యాప్తంగా వేల (ఇప్పుడు లక్షలవరకూ ఉండచ్చు) సంఖ్యలో మదర్సాలు తెరిచి, ఏం చేస్తున్నారో ఎవరికీ ప్రత్యేకంగా చెప్పనవసరం లేదు.

సెక్యులరిజం పేరుతో ఇస్లామిస్టుల పట్ల బుజ్జగింపు ధోరణిని అనుసరించడమే ప్రపంచ వ్యాప్తంగా రాజకీయ నాయకులు చేస్తున్న తప్పులా కనిపిస్తోంది. లండన్, ఫ్రాన్స్ మొదలుకొని జర్మనీ వరకూ ఆ పొరపాటువల్ల నేడు శిక్షను అనుభవిస్తు న్నాయి. వేరే దేశంలో ఉన్న రెండవ తరం ముస్లింను కూడా బ్రెయిన్‌వాష్ చేసి ముస్లిం ఉమ్మా తప్ప దేశభక్తి అనే భావనలేకుండా చేసే మదర్సాలు, మదనీ వంటి నాయకులు తమ దేశభక్తి గురించి మాట్లాడడం హాస్యాస్పదంగా అనిపించక మానదు. ఒక్కటి మాత్రం నిజం, వారు హిందువుల పెద్ద మనసు కారణంగా వచ్చే లాభాలను అనుభవించి, బీజేపీ వంటి పార్టీని అణగదొక్కాలనుకున్నారు, ఓటు వేయలేదు. అయినా, బీజేపీ గెలవడాన్ని జీర్ణం చేసుకోలేక ఇటువంటి వ్యాఖ్యలను చేసి, వాతావరణాన్ని పాడు చేయాలని ప్రయత్నిస్తున్నారు. హిందువులు అప్రమత్తంగా ఉండడం తప్ప మరొక మార్గం లేదు. ★

చేసుకున్నారు. అలాగే, అదే ప్రాంతానికి, వర్గానికి ఆదర్శ్ భారత్ హనువతేపై జరిగిన దాడిని లీగల్ రైట్స్ అబ్జర్వేటరీ (ఎల్ఆర్ఓ) అనే సంస్థ సోషల్ మీడియాలో ఉంచడంతో వెలుగులోకి వచ్చింది.

తాజాగా, భారత్ టి20 వరల్డ్ కప్‌ను గెలుచు కున్నందుకు నాందేడ్‌లో వేడుకలు చేసుకుంటున్న నలుగురు హిందూ విద్యార్థులపై ముస్లిం విద్యార్థులు దాడికి పాల్పడ్డారు. దాదాపు పాతికమంది ఇస్లామిస్టులు కర్రలు, ఇనుపరాడ్లతో దాడి చేశారు. ఈ ఘటనలో హిందూ యువకులు తీవ్రంగా గాయపడ్డారు. ఈ మొత్తం ఘటన సిసిటివిలో రికార్డు అయింది.

ఇక, థానెలో ఒక హిందూ మహిళపై అత్యాచారం చేయడమే కాదు ఎఫ్ఐఆర్ చేస్తే సహించ నంటూ షెహజాద్ షేక్ హెచ్చరించాడు. ఈ ఘటన ముస్లింలు అధికంగా ఉండే హాజూరీ దర్గా ప్రాంతంలో గత వారం జరిగింది. అదే ప్రాంతంలో నివసిస్తున్న ఒక హిందూ మహిళపై నిందితుడు అత్యాచారానికి పాల్పడ్డాడు. సకల్ హిందూ సమాజ్ సంస్థ ప్రకారం, ఘటన తర్వాత మహిళ తనను తాను కాపాడుకోవడానికి దగ్గరలో ఉన్న ఆలయంలో దాక్కుంటే దాదాపు వంద నుంచి నూట యాభైమంది ముస్లింలు చెప్పులు విడువకుండా ఆలయంలోకి ప్రవేశించి, పోలీసులకు ఫిర్యాదు చేయవద్దంటూ బెదిరించారు.

పోలీసులు నిందితుడిని అనంతరం అరెస్టు చేసి నప్పటికీ వారి ఆగడాలను వెలుగులోకి తెచ్చేందుకు జూన్ 30వ తేదీన సకల హిందూ సమాజం భారీ నిరసన ప్రదర్శన నిర్వహించి, నింది తుడిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేసింది. వారు ఆలయంలోకి చెప్పులతో ప్రవేశించడాన్ని నిరసిస్తూ, నిందితులకు కఠిన శిక్షనే కాకుండా ఆ ప్రాంతంలో హిందువుల భద్రతకు చర్యలు తీసుకోవాలని హిందువులు డిమాండ్ చేశారు.

థానే జిల్లాలోని భివాండీ నగరంలో మదర్సా ఆవరణలో ఒక పదకొండేళ్ల బాలుడిని నసీరుల్లా అనే రాక్షసుడు రేప్ చేశాడు. మదర్సాలో చదువుకుంటున్న ఆ బాలుడిపై నసీరుల్లా దారుణమైన అత్యాచారానికి పాల్పడ్డాడు.

అది పేరుకు మీరా రోడ్డే కానీ, అక్కడ ఆధిపత్యం ఇస్లామిస్టులదే. ఒక అపార్ట్‌మెంట్ సముదాయంలో బక్రీద్ సందర్భంగా గొర్రెలను కోయవద్దని కోరిన హిందువులను అవమానించి, దాడి చేశారు ఇస్లా మిస్టులు. గతంలో కూడా రామమందిర ప్రాణప్రతిష్ఠ సమయంలో జరిపిన ఊరేగింపు ఈ ప్రాంతంలోకి వచ్చినందుకు దానిపై రాళ్లు రువ్వి దాడి చేసిన ఘటన పలువురికి గుర్తుండే ఉంటుంది. ఇలా చెదురు మదురుగా ఘటనలు దేశవ్యాప్తంగా అనునిత్యం చోటు చేసుకుంటున్నాయి.

**అస్సాంలో రాడికల్ ముస్లిం ముల్లా అరెస్టు**

అధికారులకు వ్యతిరేకంగా ప్రజలను రెచ్చగొట్టే ప్రకటనలు చేస్తున్నందుకు, హేతుబద్ధంగా మాట్లాడు తున్న ఒక ఇస్లామిక్ మత గురువును బెదిరించి



రాడికల్ ముస్లిం ముల్లా అరెస్టు

నందుకు జులై 2వ తేదీన అస్సాం పోలీసులు ముఫ్తీ అర్ఘురీ అనే రాడికల్ ముస్లిం ముల్లాను అరెస్టు చేశారు. లఖీంపూర్ పోలీస్ స్టేషన్‌ను జులై 6న ఘెరావ్ చేయాలని ముఫ్తీ అర్ఘురీ ప్రణాళిక వేశాడు. అంతేకాదు, 6 నుంచి 10వ తేదీ వరకూ రాష్ట్రంలో రోజువారీ జనజీవనానికి భంగం కలిగించే భారీ ఉద్యమాలు చేపడతానంటూ పోలీసులను బెదిరిం చాడు. అధికారులు వేగంగా స్పందించి, అతడిని అరెస్టు చేశారు.

గోవధ ఇస్లాంలో లేదంటూ కమాల్ ముస్తాఫా ఇస్లామిస్టులకు చేసిన అప్పీలు వారికి నచ్చలేదు. దీనితో ఇస్లామిస్టు వర్గాల నుంచి వ్యతిరేకత రావడమే కాక ముస్తాఫాను ముఫ్తీ ప్రత్యక్షంగా బెదిరించాడు. గోవధను నివారించి, హిందువుల భావనలను గౌర వించమంటూ కమాల్ చేసిన విజ్ఞప్తి అక్కడి ఇస్లా మిస్టులకు, వారి గురువు ముఫ్తీకి నచ్చలేదు. దీనితో, కమాల్ ఇస్లామ్‌ను, మహమ్మద్ ప్రవక్తను అవమా నించాడని నిందిస్తూ, అవసరమైన జిహాదీ ఉద్యమాన్ని ప్రారంభిస్తానని ప్రకటిస్తూ ఒక వీడియోను సోషల్ మీడియాలో విడుదల చేశాడు. ఇందులో అతడు పోలీసు అధికారులను నిందించ డమే కాదు, బెదిరించాడు కూడా.

**భారత్‌లో పెరుగుతున్న రాడికల్ ఇస్లామ్**

అస్సాంలో జరిగిన ఘటన దేశంలో పెరుగుతున్న రాడికల్ ఇస్లామిక్ శక్తుల ప్రభావానికి ఒక చిన్న ఉదాహరణ మాత్రమే. అంతేకాదు, ఇస్లామ్‌లో కూడా కాస్త హేతుబద్ధంగా మాట్లాడుతున్న వారి గొంతుకలను ఈ రాడికల్ ఇస్లామిస్టులు ఎలా నొక్కేస్తున్నాయో పట్టిచూపుతుంది. దేశం నుంచి వేరు చేయాలనే ప్రయత్నం చేస్తున్నవారు ఈ అతివాద ఇస్లామిస్టులు. ఇస్లామ్ పేరుతో ఆరోగ్యవంతమైన ఆలోచనలు ఉన్నవారిని కూడా ఉన్మాద ఎంపికలు చేయాలని విజ్ఞప్తి చేస్తారు.

**హిందూ సమాజం నిద్ర లేవడం**
**మినహా మార్గం లేదు**

అన్ని సమస్యలను కోర్టులు పరిష్కరించలేవు. హిందూ సమాజం ఐక్యంగా కలిసి పోరాడితేనే వీటిని నిర్మూలించవచ్చు. ఘజ్వా-ఎ-హింద్ అన్నది కేవలం భారతీయ సరిహద్దులపై దాడిచేసి, భూమిని ఆక్ర మించుకోవడమే కాదు, సనాతన సమాజం అంతర్గత విస్ఫోటనం చెందేలా లవ్ జిహాద్, భూమి జిహాద్, జనాభా జిహాద్ తదితరాలను ప్రయో గించడం. కులాలు, వర్గాలు, ప్రాంతాల పేరుతో అనైక్యంగా ఉన్న భారతీయ సమాజమే వారికి రక్షణ కవచంగా పనిచేస్తోంది. మన నాగరికతా మూలాలనే నిర్మూ లించాలని యత్నిస్తున్న వారిని నిలువరించాలంటే హిందూ సమాజం ఐక్యంగా ఉండటం మినహా మరో మార్గం లేదు. ★

శరీరంలో జరగాల్సిన ప్రక్రియలన్నీ సజావుగా జరిగితేనే ఆరోగ్య భాగ్యం సిద్ధిస్తుంది. పోషకాహారం తీసుకొనడంతో ఆరోగ్యంతో పాటు దేహానికి అవసరమైన శక్తి లభిస్తుంది. అలా జరగని పక్షంలో అనారోగ్యం బారిన పడి ఆసుపత్రి పాలు కావలసి వస్తుంది. మనం తీసుకోవలసిన ఆహారం వయస్సు, లింగ, శారీరక క్రియాశీలత, శారీరక శ్రమ/విధులు లాంటి అంశాలపై ఆధారపడి ఉంటాయి. భారతదేశంలో 74 శాతం ప్రజలకు పోషకాహారం దొరకడం లేదని, ఇటీవల స్థూలకాయ సమస్యలు పెరిగాయని నివేదికలు తెలుపుతున్నాయి. అసంబద్ధ ఆహారపు అలవాట్లతో 05–09 ఏళ్ల పిల్లల్లో 5 శాతం, కౌమార యువతలో 6 శాతం వరకు స్థూలకాయ రుగ్మతలతో బాధ పడుతున్నారని, 2 – 10 శాతం వరకు పిల్లలు/కౌమార వయస్కులు డయాబెటిస్/ప్రీ–డయాబెటిస్ బారిన పడుతున్నారని తెలుస్తున్నది.

**ఐసీఎంఆర్ - ఎన్ఐఎన్ సంయుక్త నివేదిక**

మనం తీసుకునే ఆహారంలో తృణధాన్యాలు, పప్పులు, కూరగాయలు, ఆకుకూరలు, పాలు/పాల ఉత్పత్తులు, గుడ్లు, మాంసం, చేపలు, నూనె గింజలు, డ్రై ఫ్రూట్స్ లాంటివి నిర్ధారిత మోతాదులో ఉండే విధంగా జాగ్రత్త పడాలని ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ మెడికల్ రీసెర్చ్ (ఐసీఎంఆర్), నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ న్యూట్రిషన్ (ఎన్ఐఎన్) తాజాగా విడుదల చేసిన 148 పేజీల శాస్త్రీయ నివేదిక స్పష్టం చేస్తున్నది. ఉప్పు, చక్కెర, జంక్ ఫుడ్స్‌ను పూర్తిగా తగ్గించడంతో పాటు నూనెలు, కొవ్వు పదార్థాలను మితంగా తీసుకుంటూ ఉండాలని నివేదిక తెలుపుతున్నది. ఇటీవల విడుదల చేసిన నివేదిక ప్రకారం 17 పోషకాహార మార్గదర్శకాలను సిఫార్సు చేస్తూ భారత పౌరులు ఎదుర్కొంటున్న 56.4 శాతం వ్యాధులకు కారణం అనారోగ్యకరమైన ఆహారపు అలవాట్లే అంటూ హెచ్చరిక చేస్తున్నారు.

జీవనశైలి వ్యాధులుగా గుర్తిస్తున్న బీపీ, షుగర్, స్థూలకాయం, హృద్రోగాలు లాంటి అసంక్రమిక వ్యాధులకు కారణం అసంబద్ధ ఆహారమే అంటూ నిర్ధారణ చేస్తున్నారు. జీవనశైలి రుగ్మతలకు విరుగుడుగా సమతుల పోషకాహారంతో పాటు తగిన శారీరక వ్యాయామం లేదా శ్రమ అవసరం అవుతాయని సూచిస్తున్నారు. పోషకాహారం, శారీరక శ్రమ విధానాలను వాడితే టైప్-2 మధుమేహం 80 శాతం వరకు నియంత్రించవచ్చని నివేదిక స్పష్టం చేస్తున్నది.



**ఐసీఎంఆర్-ఎన్ఐఎన్ సిఫార్సు 17 మార్గదర్శకాలు**

- సమతుల ఆహారంగా అన్ని రకాల పదార్థాలను తగు మోతాదులో తీసుకోవాలి.
- గర్భిణులు, శిశువులకు అదనంగా ఆహారం అందించాలి.
- శిశువులకు తొలి ఆరు నెలలు తల్లిపాలు అందించాలి. కనీసం రెండేళ్లు రొమ్ముపాలు ఇవ్వాలి.
- ఆరు మాసాలు దాటిన పిల్లలకు తల్లి పాలతో పాటు ఇంట్లో తయారుచేసిన సెమీ–సాలిడ్ ఫుడ్స్ ఇవ్వాలని సూచిస్తున్నారు.
- ఎదిగే పిల్లలు, కౌమార యువత శారీరక ఎదుగుదలకు తగు అదనపు ఆహారం అందించాలి.
- అధిక కూరగాయలు, చిక్కుళ్లు తీసుకోవాలి.
- దిన చర్యలకు అనుగుణంగా తగు మోతాదుల్లో నూనెలు, కొవ్వు పదార్థాలు తీసుకోవాలి.
- ప్రయోజనకర మాంసకృత్తులు, అత్యవసర అమనో ఆమ్లాలు తీసుకోవాలి.
- ఆరోగ్యకర జీవనశైలితో స్థూలకాయం, అధిక బరువులను నివారించాలి.
- ప్రతి రోజు శారీరక వ్యాయామం లేదా శ్రమ ఉండే విధంగా ప్రణాళికలు వేసుకోవాలి.
- ఉప్పును పూర్తిగా తగ్గించాలి.
- సురక్షిత, శుభ్రమైన ఆహార పదార్థాలను తీసుకోవాలి.
- వంట పద్ధతులను తగు రీతిలో మార్చుకోవాలి.
- నీటిని ఎక్కువగా సేవించాలి.
- జంక్, అల్ట్రా ప్రాసెస్డ్, ప్యాకేజ్ ఫుడ్స్ తగ్గించాలి. అధిక కొవ్వులు, చక్కెరలు, లవణం ఉన్న ఆహార పదార్థాలకు దూరంగా ఉండాలి లేదా పూర్తిగా తగ్గించాలి.
- పెద్దలు తగు పోషకాహారం అందించాలి.
- ఆహార పదార్థాల ప్యాకెట్లపై సూచించిన విషయాలను చదివి తెలుసుకోవాలి.

**సమతుల పోషకాహారం అంటే?**

ఒక భోజనంలో అవసరమైన మోతాదులో తృణధాన్యాలు, పప్పులు, చిక్కుళ్లు, డ్రైఫ్రూట్స్, పెరుగు/పాలు/పాల ఉత్పత్తులు,



# ఆరోగ్యకరమైన ఆహారం అంటే..

పండ్లు, ఆకుకూరలు, కూరగాయలు లాంటి పోషక పదార్థాలు ఉన్నట్లయితే దానిని పోషకాహారం అంటారు. పోషకాహారంలో ఉప్పు, షుగర్, కొవ్వులు, నూనెలు లాంటివి అధిక మోతాదులో అదనంగా తీసుకోరాదు. ఆరోగ్యకర చిరుతిండ్లలో కూరగాయలు, పండ్లు, నట్స్, ఉడికించిన చిక్కుళ్లు లాంటివి తీసుకోవాలి. పోషకాహారంలో సమతుల ప్రొటీన్స్, కాలరీస్, విటమిన్స్, ఖనిజ లవణాలు, పీచు పదార్థాలు తగు మోతాదులో ఉండే విధంగా జాగ్రత్త పడాలి. సాధారణంగా సీజనల్ ఫుడ్స్, ఫ్రూట్స్, ఆయా సమయాల్లో లభించే కూరగాయలు తీసుకోవాలి. రోజుకు రెండు లేదా మూడుసార్లు మాత్రమే భోజనం చేయాలి. భోజనాలమధ్య అసంబద్ధ చిరుతిండ్లు తీసుకోరాదు. రోజుకు 20–25 గ్రాముల లోపు చక్కర తీసుకోవాలి.

**సమతుల భోజనం లేదా 'మై ప్లేట్ ఆఫ్ ది డే'**

2000 కిలో కాలరీల భోజనంలో 400 గ్రాముల కూరగాయలు, 100 గ్రాముల పండ్లు, 250 గ్రాముల తృణధాన్యాలు, 300 మిల్లీలీటర్ల పాలు/పెరుగు, 85 గ్రాముల పప్పులు/చిక్కుళ్లు/మాంసం/చేపలు, 62 గ్రాముల నట్స్/సీడ్స్/కొవ్వులు/నూనెలు ఉండే విధంగా చూసుకోవాలి. "మై ప్లేట్ ఆఫ్ ది డే" నిమిత్తం 8 రకాల ఆహార పదార్థాలను సూచిస్తున్నారు. తృణధాన్యాలు విభాగంలో (బియ్యం, గోధుమలు, చిరుధాన్యాలు లాంటివి), పప్పులు (కంది, పెసర, శనగ, మినుములు, రాజ్మా లాంటివి), నట్స్ లేదా డ్రైఫ్రూట్స్ (పల్లీలు, బాదాం, పిస్తా, వాల్‌నట్స్ లాంటివి), ఆయా కాలాల్లో లభించే అన్నిరకాల కూరగాయలు/ఆకుకూరలు, పాలు/పాల ఉత్పత్తులు (పెరుగు, మజ్జిగ, పాలు), దుంపలు/రూట్స్ (క్యారెట్, బీట్‌రూట్, రాడిస్, కందలు, ఆలుగడ్డలు లాంటివి), మాంసాహారం (చేపలు, చికెన్, రెడ్ మీట్), సుగంధ ద్రవ్యాలు/మూలికలు (పసుపు, అల్లం, వెల్లుల్లి, పెప్పర్, దనియా, ఆవాలు, జీలకర్ర, మసాలా, కారం లాంటివి) వస్తాయని తెలుసుకోవాలి. నిత్య భోజనంలో 45 శాతం వరకు తృణధాన్యాలు/మిలెట్స్, 15 శాతం వరకు పప్పులు/గుడ్లు/మాంసం, 30 శాతం వరకు కొవ్వులు, 10 శాతం వరకు నూనెగింజలు ఉంటే సరిపోతుంది. మన దినచర్యలకు కావలసిన శక్తిలో 50–70 శాతం వరకు తృణధాన్యాలు, 06–09 శాతం వరకు పప్పులు/పాలు/మాంసం/చేపల నుండి అందుతుంది.

**చేయగూడనివి, చేయాల్సినవి (డూస్ అండ్ డోన్ట్స్)**

ఉప్పు, చక్కెర, కొవ్వులను పూర్తిగా నియంత్రించాలి. ఆల్కహాల్, ధూమపానం, గుట్కా లాంటి దురలవాట్లకు దూరంగా ఉండాలి. తక్కువ పోషక విలువలు ఉంటూనే ప్రమాదకరమైన ఉప్పు, చక్కెర, కొవ్వులు అధికంగా ఉన్న ఆహార పదార్థాలను జంక్ ఫుడ్స్ అంటున్నాం. జంక్ ఫుడ్స్, ప్యాకేజ్డ్ ఫుడ్స్, అల్ట్రా – ప్రాసెస్డ్ ఫుడ్స్‌ను పూర్తిగా నివారించాలి. నిత్యం శారీరక వ్యాయామం లేదా పని చేయాలి. సమతుల పోషకాహారాన్ని తీసుకోవాలి. ఫుడ్ ప్యాకెట్స్‌ను ఖరీదు చేసే ముందు ఆ ప్యాకెట్‌పై రాసిన సూచనలను/హెచ్చరికలు/సంఘటనలను పూర్తిగా అర్థం చేసుకోవాలి.

ఆరోగ్యకర జీవనశైలిని పాటించడం ద్వారా అనారోగ్యాలు, అకాలమరణాలను కట్టడి చేయవచ్చు. భారతంలో ఆహార పదార్థాల వినియోగం పెరగడం, శారీరక శ్రమ తగ్గడం, విచిత్రమైన ప్రతికూల ఆహార పదార్థాలకు అలవాటు పడడంతో పోషకాల లోపం ఏర్పడడం, స్థూలకాయ జనాభా పెరగడం, అనారోగ్యం పాలు కావడం సర్వదా కనిపిస్తున్నదని తెలుసుకొని భారతీయ కుటుంబాలు, పౌర సమాజం సమతుల ఆహారం దిశగా అడుగులు వేస్తూ ఆరోగ్య భారత నిర్మాణంలో భాగస్వాములమవుదాం. ★

**(ఇటీవల ఐసీఎంఆర్-ఎన్ఐఎన్ సంస్థలు విడుదల చేసిన నివేదిక ఆధారంగా)**



**డా. బుర్ర మధుసూదన్ రెడ్డి**
విశ్రాంత ప్రధానాచార్యులు, 9949700037




సినారె... శివశంకరి
'విశ్వంభర' జాతీయ పురస్కారం
ఈ మూడూ అంశాలూ తెలుగు, తమిళ ప్రాంతాలతోపాటు దేశ విదేశాల్లోని సాహితీప్రియుల మానసవీణలను మధుర మనోహరంగా పలికిస్తున్నాయి. జులై 29న భాగ్యనగరంలోని రవీంద్రభారతి వేదికగా సి.నారాయణరెడ్డి పేరిట 'విశ్వంభర' జాతీయ పురస్కారం ఆమెకు ప్రదానం. సారస్వత ఆరాధకులందరికీ నేత్రానందం, శ్రవణసుందరం (మునుపే సరస్వతీ సమ్మాన్ స్వీకర్త ఆ రచయిత్రి). ఈ సందర్భంలోనే ఆయన 'ఆత్మసూక్తం' మదిలో మెదులుతుంది. గణం కంటే గుణం ముఖ్యం, రాశికన్నా రమ్యత శ్రేష్ఠం అన్నారు ఏనాడో. అభ్యాస ఫలం రాశి, సౌందర్య చిహ్నం రమ్యత. అంతర్గతంగా ఆకృతి ఒకటి, ఆత్మ ప్రకృతి మరొకటి. హిమబిందువు ఉత్సాహం, తారాజువ్వ ఉల్లాసం కలగలిస్తే మెరుపు దిశగా ఉజ్వలదశ తథ్యమే కదా!

# 'శివ శంకరి' నవా

శ్రీ నక్షత్రాల అక్షరాలు ఆయనవి. పంచాక్షరిని తలపించే పేరు ఆమెది. జ్ఞానపీఠం నారాయణరెడ్డిది, వికాసదీపం శివశంకరిది. అన్నట్లు, సినారె తమ 'విశ్వంభర' కావ్య విభాగాలూ ఐదు. కవి హృదయం కాబట్టి - నాదంగా ఎగిసి, పదంగా నడిచి, కాంతిరేఖలా మెరిసి, మూర్తి రూపాలై నిలిచి, కలం అణువణువునా లయలొలికించింది. జిజ్ఞాస పురోగమిస్తున్నా, సత్య రహస్వాదన చేస్తున్నా, పిపాస మాత్రం ఇంకా ఇంకా తీరనిదే!

ఎప్పటికైనా మనిషిని దిద్దితీర్చేది మనసే. విశ్వ దర్శనమంతా ఇందులోనే. దర్శనం ఒక్కటే కాదు... స్వరముద్రణ భాగ్యమూ ఇదివరలోనే కలిగింది శివశంకరికి. ఎలా అంటే- యునైటెడ్ స్టేట్స్ లైబ్రరీ (ఆఫ్ కాంగ్రెస్) కోరడం వల్ల. ఆ విజేత సాహితీవేత్త వయసు ఇపుడు ఎనిమిది పదులకు పైమాటే. అయినప్పటికీ, నేటికీ తనది శక్తి సంపన్న తత్వమే.

పేరులో మహోదయం, తీరులో స్థిర సంకల్పం ఉన్నందునే ప్రతిష్ఠాత్మక బహూకృతికి ఎంపిక. చెన్నైలో ఉంటున్న ఆమె హైదరాబాద్ వచ్చి వెళ్లే దారి పొడవునా అక్షర సందర్శనలెన్నెన్నో!

'నవ్వని పువ్వు'- ఇది సినారె తొలి పుస్తకం. 'నా రణం మరణంపైనే' అని ప్రకటించింది మలి కావ్యంలో. ఆయన ఉన్నంత కాలమూ రాస్తూనే వచ్చారు. పదుల సంఖ్య ప్రక్రియల్లో అక్షర సేద్యం చేసిన తపస్వి, మనస్వి. పద్య రచనలకు పరిపాటిగా చారిత్రక కథానీయ కావ్యాలనేకం వెలువరించారు.

అక్షరాల గవాక్షాలు, జలపాతం, తేజస్సు నా తపస్సు, ఇంటి పేరు చైతన్యం, మార్పు నా తీర్పు, కవిత నా చిరునామా, ఉదయం నా హృదయం - ఈ అన్ని పుస్తకాల పేర్లూ ఆయన వ్యక్తిత్వ మూర్తిమత్వాలకు ఆసాంతం వర్తిస్తాయి. మా ఊరు మాట్లాడింది, విశ్వం నాలో ఉన్నపుడు, నా చూపు రేపటివైపు, అలలెత్తి అడుగులు... వంటివి తన అంతరంగ తరంగాలను ప్రస్ఫుటపరుస్తాయి. వీటితోపాటు మానవ ఇతిహాస రచనలూ అసంఖ్యాకం.

మట్టి, మనిషి ఆకాశం; భూమికలను ఉదాహరణలుగా నిశ్చయించవచ్చు. అన్నింటినీ మించి 'విశ్వంభర.' మానవ ఉపనిషత్తు. మానవుడే నాయకుడు. ప్రకృతే నేపథ్యం. మనిషి రూపాలను, విభిన్న ప్రవృత్తులను, అనేకానేక ప్రస్థానాలను విపులీకరించారు ఇందులో. మొత్తం మీద విశ్వాన్ని భరించడమే ఇతివృత్తం. ప్రత్యేకించి నేల విశిష్టతను నింగినంటేలా చాటి చెప్పడం. ఈ విశిష్ట పద్య రాజానికి జ్ఞానపీఠం లభించి ఇప్పటికి మూడున్నర దశాబ్దాలు పైనే! పుస్తకం ముద్రితమై (తొలిగా) నేటికి 44 సంవత్సరాలవుతోంది. ఇదే అనేక విశ్వ విద్యాలయాలకు స్నాతకోత్తర స్థాయి పాఠ్య గ్రంథం. డాక్టరేట్ పరిశోధనలూ పుష్కలం. జాతీయ, అంతర్జాతీయ భాషల్లోకి అనువాదమవడం అగ్రేతర స్థాయిని నిరూపిస్తోంది.

ఎవరు ఏ సాధన సాగించినా మూడు విధాలు అన్నారాయన. కళాత్మకం, ఆధ్యాత్మికం, వైజ్ఞానికం. ఈ అన్నింటి సమాలోచనల సమగ్ర అవలోకనం కావ్య ఆది, పునాదిగా నిలిచింది. అక్షరోదాహరణ ఇదీ;

*వేయి తోటలను నరికిన చేయి*
*పూయిస్తుందా ఒక్క పువ్వును?*
*ఉర్వీతలాన్ని వణికించిన శక్తి*
*ఒక్క హృదయాన్నయినా జయిస్తుందా?*
*అంటూనే ఇలా ముక్తాయించారు...*
*మనసుకు తొడుగు మనిషి*
*మనిషికి ఉడుపు జగతి*

***ఇదే విశ్వంభరా తత్వం***
***ఇదే అనంత జీవిత సత్యం***

ఈ విశ్వంభర అనేది మనశ్శక్తి వ్యక్తిగా సాగడం. సమష్టిగా సమాజ చరితను సృజించడం. దీనిలో భారతీయత మాత్రమే కాదు, విశ్వమానవ వికాస పరిపూర్ణత ఉంది. భూగోళంలోని మానవ వికాస పరిణామక్రమముంది. ఇదంతా ఆత్మ / అనుభవాత్మక గాథ, నవ అభివ్యక్త కథ.

సరిగ్గా ఇటువంటి విశాలత్వమే శివశంకరి రచనల్లోనూ ప్రతిఫలిస్తుంది. భాష తమిళమైనా, భారతీయాత్మ ప్రతిబింబిస్తుంది. మద్రాసులో పుట్టిన ఆమె శారదా విద్యాలయ, రామకృష్ణమిషన్ పాఠశాలల్లో చదివారు. ప్రజా సంబంధాలు అధికారిగా పనిచేశారు. సమాజం, పరిణామాలు, ప్రజల మనోభావాల గురించే ఆలోచనలన్నీ! అధ్యయనం, పరిశోధన, సాధన, బోధన, విశ్లేషణ, పర్యవేక్షణలన్నీ ఇందులోని భాగాలు.

దశాబ్దాల తరబడి కొనసాగుతున్న సాక్షరసేవ ఆమెది. పదుల సంఖ్యలో నవలలు, కథలు, నవలికలు, కథానికలు ప్రచురించారు. జీవిత చరిత్రలెన్నో రచించారు. వృద్ధాప్య సమస్యల పరిష్కారం మీద చూపు సారించారు. సమాచార, ప్రచార, ప్రసార, ఇతరత్రా మాధ్యమాల ద్వారా

# నంద లహరి

భావాభిప్రాయాలు వెల్లడించారు. యాత్రా కథనాలు, పరిశోధక వ్యాసాలు, స్పందన రచనలు అనేకం.

వాటిల్లో పలు ప్రక్రియలను ఉక్రేనియన్ భాషలోకీ అనువదించడం మరింత విశేషం. ఆదర్శ, వాస్తవిక వాదాలను త్రికరణశుద్ధిగా విశ్వసించే ఆమె నేత్ర వైద్యం,దానం, వితరణ గురించిన అంశాలనూ సృజించారు. ఆ సారాంశాన్ని కవిత్వీకరిస్తే –

శివశంకరి నవలా రచనలు చలన చిత్రాలుగా, చిన్నతెర ధారావాహికలుగా రూపుదిద్దుకున్నాయి. స్త్రీ సమస్యలకు పరిష్కారాల చిత్రీకరణ, సంప్రదాయ విలువలకు అసలైన పరిరక్షణ, కుటుంబ స్థితిగతుల పరిశీలన, ఆరోగ్య సంరక్షణకు ముందు జాగ్రత్తలు వీటిల్లో కనిపిస్తాయి.

పదాల పొందిక, భావగాంభీర్యం ఆమె పుస్తకాల్లో వర్ధిల్లుతుంటాయి. వాక్య నిర్మాణం, సన్నివేశ విశదీకరణం, సంభాషణ చాతుర్యం, కథాగమన చాకచక్యం ప్రస్ఫుటమవుతూనే ఉంటాయి. నిదర్శనంగా – ఒక మనిషి కథ. ఇదే రచన తమిళ సుప్రసిద్ధ పత్రికలో సీరియల్‌గా ప్రచురితమైంది. రచనాంశాల మీద కొన్ని పరిశోధనలనూ కొనసాగించిన అన్వేషకురాలు ఆమె. సామాజిక దురన్యాయాలను కలంబలంతో ప్రతిఘటించిన సాహసికురాలు. వ్యసనాలూ, వ్యాధుల పోలికలను, అంతరాలను తేటతెల్లంచేసిన శాస్త్ర కోవిదురాలు – కూడా.

**'రచనలతో సంచలనం' గురించి...**

1. కావాల్సింది ఆలోచనల అలలు. కేవలం సంచలనాలు కావు.
2. నాకు తారసపడిన వ్యక్తుల అంతరంగాల్లోకి తొంగిచూస్తాను. వాటి నుంచే కథా వస్తువులను సందర్భానుసారం ఎంచుకుంటాను.
3. మార్పు తప్పదు అని భావిస్తాను, అదే శాశ్వతమనీ అనుకుంటాను.
4. విశ్వాసాల గాఢతను అన్ని కోణాల నుంచీ గమనిస్తుంటాను.
5. చదువరుల స్పందనను ఎంతగానో కోరుకుంటాను. అలా అని, ఆ స్పందనలను ఆశించి రచనల్లో మలుపులు తిప్పను.
6. కొన్ని పాత్రలంటే జాలి / ఆ అశక్తతలే కారణం.
7. మనసుతో మథనం నా అలవాటు (కవచంతో కదనం అనే సినారె పద ప్రయోగం మనకు ఇక్కడ గుర్తుకొస్తుంది.)
8. కవుల/ కవయిత్రుల; రచయితల/రచయిత్రుల బాధ్యతలు ఎంతో కీలకమని నా భావన. అక్షరాల్లో వ్యక్తమయ్యేదీ ఆ తత్వమే.
9. సందేశాలు / ఉపదేశాల కోసమే రాయాలని ఉండదు నాకు. నా మనసులో / ఉన్నది కాగితం పైకి ప్రసరించాలని మాత్రమే ఉంటుంది. అందుకు ఎంతగానో పరిశ్రమిస్తాను. కష్టంతో కాదు, ఎంతెంతో ఇష్టంతో! రాయడం మొదలయ్యాక ఎక్కడా ఆగదు.
10. ఎంత రాస్తానో అంతకుమించి చదువు తాను. రెండూ అవసరమే.

**మరింత వివరంగా ఆమె మాటల్లోనే...**

ప్రతీ రచనకీ పరమార్థం ఉండాల్సిందే. నిబద్ధత లేనిదే ఉత్తమ రచన రాదు, వెలువడదు. నా కథల్లో కొన్ని తెలుగులోకి అనువాదమయ్యాయి. కృతజ్ఞురాలిని. ఏది రాయాలన్నా ముందుగా నేరుగా వెళ్లి పరిశీలిస్తాను. సంగతీ సందర్భాలన్నీ ముందుగానే తెలుసుకుంటాను. పెద్దలూ చిన్నలూ అందరితోనూ వివరంగా మాట్లాడతాను. ఆ తర్వాతే కథగానో నవలగానో రూపుదిద్దుతాను. ఎప్పుడూ అంతే!

ఆడియో, వీడియోలతోనూ పాఠక వీక్షకుల ముందుంటా. ఆ సాంకేతికతను ఎంత వేగంగా అందుకోగలిగితే అంత సామాజిక ప్రయోజనం. నా ప్రత్యక్ష యాత్రా చరిత్రలు జపనీస్ భాషలో కూడా వెలువడ్డాయి. రాయడంతోనే కర్తవ్యం పూర్తయిందని అనుకోకూడదు. క్షేత్ర స్థాయి వాస్తవాలు ప్రత్యక్ష పర్యటనలతోనే తెలుస్తుంటాయి. సేవాభిలాషతో కొన్ని సేవా కేంద్రాలనీ ఏర్పాటు చేశాను. వాటిని మహత్తరమని, బృహత్తరమనీ అనను. నా పని నేను చేస్తానంతే! ఆమె ఎంతగానో పరిశ్రమించినందునే అపురూప రచనలన్నో వెలువడ్డాయి. విశేష పురస్కారాలనీ సంపాదించి పెట్టాయి. వాటిల్లో భారతీయ భాషా పరిషత్ పురస్కృతి ఒకటి. ప్రేమ చంద్, గోపీచంద్ అవార్డులూ లభించాయి.

విశేషించి 'సరస్వతీ సమ్మాన్' పురస్కారం అందుకున్నారు. దేశంలోని అన్ని భాషల్లోనూ ఒక మహోత్తమ సాహిత్య రచనకు అందే వార్షిక బహూకృతి. రెండేళ్ల కిందటనే శివశంకరి 'సూర్యవంశం' ఇంతటి విశిష్టతకు పాత్రమైంది. జ్వలిస్తున్న సూర్యుని తనయ – ఇందులోని ఇతివృత్త సారాంశం. అంతా జ్ఞాపకాల చిత్రీకరణం. రెండు సంపుటాలుగా ఉంది. వ్యక్తిగత, సమాజ సంబంధ పరివర్తన క్రమం కథనాంశం.

**ఇప్పుడు ఆమె విశ్వంభర పేరిటి పురస్కారం అందుకుంటున్న తరుణాన... దీటు ప్రశ్నలకు ధాటి సమాధానాలు ఇవీ :**

***ఉత్తమ సాహిత్యం అంటే?***

***నిర్మాణాత్మక ఆలోచనను పెంచేది.***

***అది ఎటువంటిది?***

***అద్దంలో ఎవరివి వారు చూసుకుని సరిదిద్దుకోవడం లాంటిది.***

*'ఆత్మకథ'కు మీ నిర్వచనం?*

***సూర్యవంశమే! ఉన్నది ఉన్నట్లు రాశానందులో.***


*మరిప్పుడు సినారె 'విశ్వంభర' గురించి?*

మహోత్తర, బృహత్తర రచనం. దీర్ఘ ఘనకావ్యం. జ్ఞానపీఠం వరించిన అక్షరోద్యమం. ఆయనే ప్రకటించినట్లు – ఆదిమ మొదలు ఆధునికం దాకా మానవుడు ప్రస్థాన ప్రకరణల విపులీకరణం. ప్రదాత సంస్థ సుశీలా నారాయణరెడ్డి ట్రస్టుకు నా అక్షరాభివాదం.

*ఇంకా మీకు ఏం అనిపిస్తోంది?*

***ఆయన 'విశ్వం నాలో ఉన్నపుడు'లోని 'ఎన్నెన్నో జ్ఞాపకాలు'లో అన్నట్లు...***

*'ఒకనాటి మహోద్యమాల నేపథ్యాన్ని*
*ఎదుట సాక్షాత్కరింపచేసిన ఆ జ్ఞాపకాలను*
*అక్షరాల నివాళులు సమర్పించినపుడే*
*మన వ్యక్తిత్వాలకు సార్థకత'*
*ఇదీ శివశంకరి అంతరంగ తరంగ ధ్యానం!*



**జంధ్యాల శరత్‌బాబు**
**సీనియర్ జర్నలిస్ట్**




రాష్ట్ర ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా కూటమి పాలన సాగాలని, ప్రజాహితం కోసం సుపరి పాలన అందిస్తోన్న నరేంద్రమోదీకి  ప్రజలంతా చేయూత ఇవ్వాలని, పార్టీ బలోపేతం లక్ష్యంగా కార్యక్రమాలు సాగాలని భారతీయ జనతా పార్టీ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విస్తృతస్థాయి కార్యవర్గ సమావేశం నిర్ణయించింది. 'దేశంకోసం.. ధర్మం కోసం' నినాదంతో రాజమహేంద్రవరంలో జులై 8న నిర్వహించిన  కార్యక్రమంలో  పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి అరుణ్‌సింగ్, జాతీయ సంయుక్త కార్యదర్శి శివప్రకాష్, కేంద్రమంత్రులు మురుగన్, భూపతిరాజు శ్రీనివాసవర్మ, రాష్ట్ర అధ్యక్షురాలు, ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి, రాష్ట్రమంత్రి వై.సత్యకుమార్, ఎంపీలు, ఎమ్మెల్యేలు, రాష్ట్ర పదాధికారులు, ముఖ్య నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నేతలు క్షేత్రస్థాయిలో పార్టీ బలోపేతానికి తీసుకోవాల్సిన చర్యలపై శ్రేణులకు దిశానిర్దేశం చేశారు. ఎన్డీఏకి ప్రజలు బ్రహ్మరథం పట్టిన నేపథ్యంలో వారి సమస్యల పరిష్కారానికి నిర్విరామంగా కృషిచేయాలని సూచించారు. మోదీ సారథ్యంలో అమలుచేసిన పథకాలు, లబ్ధిదారుల  వివరాలను వెల్లడించారు. కూటమి నాయకులతో కలిసి ముందుకు సాగాలన్నారు. పార్టీల వారీగా నమోదైన ఓట్లు, గత ఎన్నికలతో పోల్చితే తగ్గిన, పెరిగిన ఓట్ల శాతాలపై సమీక్షించి చేపట్టవలసిన భవిష్యత్ కార్యాచరణను వివరించారు. మూడోసారి ప్రధాని అయిన మోదీకి అభినందనలు తెలియజేస్తూ ఒక తీర్మానం, రాష్ట్రంలో అద్భుత ఫలితాన్ని ఇచ్చిన ప్రజలకు ధన్యవాదాలు తెలుపుతూ మరొక తీర్మానం ఆమోదించారు.  రాష్ట్ర కార్యాలయంలో ప్రతివారం ప్రజాదర్బార్ నిర్వహించాలని  నిర్ణయించారు. నేతల ప్రసంగాలు ఇలా ఉన్నాయి......

రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ప్రజలు ఇచ్చిన తీర్పును బాధ్యతగా తీసుకుని ప్రజా సంక్షేమం, రాష్ట్ర అభివృద్ధి, అవినీతి రహిత పాలన అందించాలని దగ్గుబాటి పురందేశ్వరి పేర్కొన్నారు. రాష్ట్రంలో గత ఐదేళ్ల జగన్ పాలన మరో ఎమర్జెన్సీని తలపించిందని, నోరు విప్పి ప్రశ్నించడమే పాపం అన్నట్టుగా ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులు పెట్టి వేధించారని నిప్పులు చెరిగారు. గుడులు కూల్చడంతోపాటు రథాలను కూడా కాల్చారని, ఇదేమని ప్రశ్నించిన వారిని జైళ్లలో పెట్టారని మండిపడ్డారు. గతంలో దేశవ్యాప్తంగా ఎమర్జెన్సీ విధించిన ఇందిరాగాంధీ చీకటి పాలనను ప్రజలు ఇప్పటికీ మరిచిపోలేదన్నారు. అదే విధంగా గత ఐదేళ్ల వైసీపీ పాలనను కూడా ప్రజలు మరిచిపోరని వ్యాఖ్యానించారు. తాజా ఎన్నికల్లో ఘోర పరాజయం తర్వాత వైసీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి చేస్తున్న ప్రకటనలపై ఆమె ఘాటుగా స్పందించారు. 'గతంలో ఇందిరా గాంధీ హయాంలో విధించిన ఎమర్జెన్సీ గురించి ఇప్పటికీ మాట్లాడుకుంటున్నాం. గత ఐదేళ్ల జగన్ పాలనలో ఇంచుమించు అలాంటి ఎమర్జెన్సీ వాతావరణమే నడిచింది. గళం విప్పిన వారందరిపై ఎస్సీ, ఎస్టీ కేసులు పెట్టి జైళ్లలో పెట్టారు. ఈ విషయాన్ని వైసీపీ నేతలు మరచిపోయారేమో కానీ రాష్ట్ర ప్రజలు మరచిపోలేదు. రాష్ట్రంలో విధ్వంసం జరుగుతోందని జగన్మోహన్‌రెడ్డి అంటున్నారు. బహుశా ఆయనకు జ్ఞాపకశక్తి సన్నగిల్లిందేమో. ఐదేళ్ల కిందట వైసీపీ అధికారం చేపట్టాక ప్రజావేదిక కూల్చివేత దగ్గర నుంచి అంతర్వేది రథం కాల్చివేత, పిఠాపురంలో ఆలయ విధ్వంసం వంటి ఎన్నో సంఘటనలు జరిగాయి. ఇవన్నీ విధ్వంసం కాదా?' అని పురందేశ్వరి సూటిగా ప్రశ్నించారు.

**డబులింజన్ సర్కారుతో అభివృద్ధి : మురుగన్**

ప్రధాని నరేంద్రమోదీ విజన్ దేశాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తోందని కేంద్ర సమాచార శాఖ సహాయమంత్రి ఎల్. మురుగన్ అన్నారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ.. డబులింజన్ సర్కార్ ద్వారా దేశంలో అభివృద్ధి వేగంగా జరుగుతోందని తెలిపారు. గుజరాత్, ఉత్తరప్రదేశ్‌లో మాదిరిగానే ఏపీలోనూ రాబోయే రోజుల్లో అభివృద్ధి వేగం పుంజుకుంటుందన్నారు. సామాజిక న్యాయం చేయడంలో మోదీనే రియల్ హీరో అన్నారు. కాంగ్రెస్ పార్టీకి రాజ్యాంగం గురించి మాట్లాడే హక్కు లేదన్నారు.

**సమన్వయంతో కూటమి గెలుపు:శ్రీనివాసవర్మ**

బీజేపీ, తెలుగుదేశం, జనసేన పార్టీ చక్కటి సమన్వయంతో రాష్ట్రంలో ఎన్‌డీఏ కూటమి విజయం సాధించిందని కేంద్ర భారీ పరిశ్రమల శాఖ సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ అన్నారు. అరుణ్‌సింగ్, సిద్ధార్థనాథ్ సింగ్ వంటి పెద్దలు ఈ విషయంలో చేసిన కృషి అభినందనీయమన్నారు. గతంలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లోనూ ఇలాంటి సమన్వయ పరిస్థితి ఉందని గుర్తుచేశారు. ఐపీసీ, ఐఏఎస్ చట్టాలను, వాటిని భారత న్యాయ సంహిత, భారతీయ నాగరిక సురక్ష సంహిత, భారతీయ సాక్ష్యా






టిఎన్. భూషణ్

# క్షలకు అనుగుణంగానే ఎన్డీఏ పాలన

అధినియం పేరుతో సత్వరమే అమలయ్యే చట్టాలను అమల్లోకి తీసుకొచ్చిన మోదీ ప్రభుత్వానికి ప్రజల తరపున ఆంధ్రప్రదేశ్ బీజేపీ కార్యవర్గ సమావేశం ధన్యవాద తీర్మానం ప్రవేశపెట్టినట్టు ఆయన పేర్కొన్నారు.

**క్షీణిస్తోన్న కాంగ్రెస్ : అరుణ్‌సింగ్**

సార్వత్రిక ఎన్నికలకు ముందు కొన్ని రాష్ట్రాల్లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో ప్రజాదరణ కోల్పోయిన కాంగ్రెస్ పార్టీ చిత్తుగా ఓడిపోయిందని పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి అరుణ్‌సింగ్ అన్నారు. బీజేపీ ఎంపీలు, ఎమ్మెల్యేలను పేరు పేరునా అభినందించారు. మోదీ పథకాలు ప్రజలకు చేరేలా పార్టీ నాయకులు, కార్యకర్తలు ప్రచారం చేయాలని సూచించారు. కూటమి ఏర్పడడంలో పవన్ కల్యాణ్ కీలక పాత్ర పోషించారని తెలిపారు.

**కూటమితో సమన్వయం అవసరం : శివప్రకాష్**

దేశంలో, రాష్ట్రంలో ఎన్డీయే అధికారంలో ఉన్న నేపథ్యంలో సహ పార్టీలతో విభేదాలు లేకుండా సమన్వయం చేసుకుని ముందుకుసాగాలని పార్టీ సంఘటన జాతీయ కార్యదర్శి శివప్రకాష్ శ్రేణులకు సూచించారు. శ్రేణులతో అంతర్గత సమావేశంలో ఆయన మాట్లాడుతూ..వైసీపీ ఓడిన నేపథ్యంలో అనేకమంది బీజేపీలో చేరేందుకు పావులు కదుపుతున్నట్లు తెలుస్తోందని, ఈ విషయంలో తొందరపాటు నిర్ణయాలు వద్దని దిశానిర్దేశం చేసినట్లు సమాచారం.

**జగన్ విధ్వంసం అనంతం : సత్యకుమార్**

వైసీపీపాలనలో రాక్షస, నియంతృత్వ, అవినీతి, అరాచకపాలనవల్ల వ్యవస్థలన్నీ నిర్వీర్యమయ్యాయని రాష్ట్రమంత్రి సత్యకుమార్ విమర్శించారు.

రాష్ట్రం అన్నివిధాలా ధ్వంసమైందని, ప్రతి శాఖను తాకట్టుపెట్టి పెద్దమొత్తంలో అప్పులు చేశారని,ఈ ఆర్థిక విధ్వంసం పూడ్చాలంటే దశాబ్దాలు పట్టేటట్టు ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. వివిధ సంస్థల నుంచి విద్యుత్తు శాఖకు రూ. 1.30 లక్షల కోట్ల అప్పులు తెచ్చారన్నారు. ఆసుపత్రుల్లో మౌలిక వసతులు కల్పించలేదన్నారు. ఫైనాన్స్ కమిషన్ ఏటా ఇచ్చే రూ. 500 కోట్లు, వసతుల కల్పన కింద కేంద్రం ఇస్తున్న వడ్డీలేని రుణాలను దారి మళ్లించారన్నారు. వైద్య కళాశాలలను చూపించి తీసుకున్న రూ. 2 వేల కోట్లు ఎక్కడికి వెళ్లాయో తెలియడం లేదన్నారు. బాధ్యులపై చర్యలు తప్పవని హెచ్చరించారు. రాజధాని అమరావతి, పోలవరం ప్రాజెక్టు నిర్మాణానికి కేంద్రంలోని ఎన్డీయే సర్కారు కట్టుబడి ఉందన్నారు. 'గత ప్రభుత్వ చేతకానితనం వల్లే డయాఫ్రంవాల్ దెబ్బతింది. అమరావతికి మొదటి నుంచి బీజేపీ మద్దతు ఉంది. ఒకే రాజధాని అనేదే మా నినాదం. మొదట్లోనే కేంద్రం రూ. 2,500 కోట్లు ఇచ్చింది" అని సత్యకుమార్ స్పష్టం చేశారు.

**బీజేపీ శ్రేణుల సందడి**

ఈ సమావేశానికి హాజరైన నాయకులు, శ్రేణులతో సందడి వాతావరణం నెలకొంది. రాష్ట్రంలోని అన్ని జిల్లాల నుంచి పార్టీ శ్రేణులు తరలివచ్చాయి. బీజేపీకి చెందిన ఇద్దరు కేంద్ర మంత్రులు, రాష్ట్ర మంత్రి,ఎంపీలు, ఎమ్మెల్యేలతోపాటు ఆ పార్టీ జాతీయ, రాష్ట్ర నాయకులు పలువురు ఈ సమావేశానికి హాజరుకావడం వారితోపాటు అనుచరగణం కూడా కార్లు, ఇతర వాహనాల్లో తరలిరాగా, రాజమహేంద్రవరంలోని ప్రధాన రహదారులపై హడావుడి కనిపించింది. ఈ దారి పొడవునా బీజేపీ జెండాలు కట్టారు. పలు ప్రధాన కూడళ్లలో ఫ్లెక్సీలు, హోర్డింగులు ఏర్పాటు చేశారు. మరో పక్క సమావేశం ప్రాంగణంలో కోలాహలం నెలకొంది. ప్రతినిధుల పేర్ల రిజిస్ట్రేషను, ఇతర సమాచారం కోసం ప్రత్యేకంగా కౌంటరు ఏర్పాటు చేశారు. సెంట్రల్ జైలు రోడ్డులోని ఓ హోటల్లో ఉదయం నుంచి సాయంత్రం వరకూ జరిగిన సమావేశానికి సుమారు 2,500 మంది హాజరయ్యారు.

**డిజిటల్ విధానంతో నమోదు**

పార్టీ కార్యవర్గ సమావేశానికి వచ్చేవారి నమోదుకు ప్రత్యేక శిబిరాలను ఏర్పాటుచేశారు. సభ్యులు క్యూఆర్ కోడు నమోదు చేసుకున్న వెంటనే డిజిటల్ తెరపై జిల్లాల వారీ ప్రతినిధుల సంఖ్య చూపేలా ఏర్పాట్లు చేశారు. సభాప్రాంగణం ఆవరణలో ఏర్పాటు చేసిన మోదీ కటౌట్లు, జల్ జీవన్ మిషన్, డిజిటల్ –ఇండియా, పార్లమెంట్ – నమూనా ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా పార్టీ రాష్ట్ర పూర్వ అధ్యక్షుడు సోము వీర్రాజును పురందేశ్వరి సత్కరించారు.

ఎంపీ సీఎం రమేశ్, ఎమ్మెల్యేలు విష్ణుకుమార్ రాజు, నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, ఆదినారాయణ రెడ్డి, సుజనాచౌదరి, పీవీ పార్థసారథి, ఎన్. ఈశ్వరరావు, కామినేని శ్రీనివాసరావు, జీవీఎల్ నరసింహరావు, సోము వీర్రాజు, రాష్ట్ర కార్యవర్గం, భాజపా రాజమండ్రి జిల్లా అధ్యక్షులు బొమ్ముల దత్తు, రొంగల గోపి, ఆడబాల రామకృష్ణారావు, ఎనుముల రంగబాబు, కురగంటి సతీష్ తదితరులతో పాటు రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వ్యాసకర్త : సీనియర్ జర్నలిస్ట్




# మిస్టర్ డిఫెక్ట్.. మానసిక వైకల్యానికి మరో రూపమే "మహారాజ్"!

బహుశా.. ఏ దేశంలోనైనా రెండే రెండు శక్తులు పనిచేస్తుంటాయి. ఒకటి దేశాన్ని ముందుకు నడిపించేది.. మరొకటి దేశాన్ని మరింత వెనక్కి నెట్టేసేది. విచిత్రమేంటంటే.. ఆ దేశ ఔన్నత్యాన్ని గుర్తు చేసుకుని.. భవిష్యత్తును మరింత పటిష్టం చేసే వర్గానికి ఛాందసవాదమనే ముద్రవేసి.. ఆ దేశ ఔన్నత్యాన్ని కాలరాచి.. లేని చెడును దేశానికి, సమాజానికి ఆపాదించి.. ఆ దేశ రథసారథులైన యువతను పెడదారి పట్టించే యత్నం చేసేవాళ్లకేమో.. అభ్యుదయవాదులని పేరు పెట్టేస్తున్నారు.

అలాంటి దౌర్భాగ్య, ఆధునికమని చెప్పుకునే వాదనలతో.. దేశ యువతరాన్ని తప్పుదోవ పట్టించే పెక్యులరిస్టులలో మొదటివాడు ఎవరైనా ఉన్నారా అంటే.. అతనే ఫ్యాన్స్‌తో మిస్టర్ పర్‌ఫెక్ట్ అని డబ్బా కొట్టించుకునే అమీర్ ఖాన్. ఎప్పటిలాగే "మహారాజ్" అనే సినిమాతో, మరోసారి రెండువందల ఏళ్ల నాటి.. ఒక నీతి తప్పిన రాజు చరిత్రను కొన్ని వందల వేల సంవత్సరాల సంస్కృతికి ఆపాదించిన అమీర్‌ఖాన్ మరోసారి శునకానందం పొందాడనే చెప్పాలి. దేవాలయం అనేది ఒక మతానికో, కులానికో సంబంధించింది కాదు.. అది మన దేశ మాన బిందువు.. మన సంస్కృతి, సంప్రదాయాల కేంద్రమనీ... అక్కడ అడుగుపెట్టిన వారు ప్రాపంచిక విషయాలు, కామక్రోధాల వంటి అరిషడ్వర్గాలను మరిచిపోయి కేవలం ఆధ్యాత్మికంలో కాలం గడుపుతారనీ తెలియని అజ్ఞాని అమీర్‌ఖాన్. ఎందుకంటే పుట్టి బుద్దెరిగినప్పటి నుంచీ తాము నమ్మినవాడు మాత్రమే దేవుడు అని నరనరాల్లో జీర్ణించుకున్న ఈ అభ్యుదయఖాన్‌కు.. వసుధైక కుటుంబకమ్ అంటే ప్రపంచమంతా ఒకే కుటుంబం అనీ.. సర్వేజనా సుఖినోభవంతు అంటే.. అందరూ బాగుండాలంటూ ఆశీర్వదించే దేవాలయం గొప్పతనం ఎలా తెలుస్తుంది?

ఇక.. ఏ కాలంలోనైనా మహానుభావులున్నట్టే.. మహా మూర్ఖులూ, మహా దుర్మార్గులు కూడా ఉంటారు. జనం అమాయకత్వాన్ని ఆసరాగా చేసుకుని.. వాళ్లలో భయాన్ని, మూఢభక్తిని పెంపొందించి తమ పబ్బం గడుపుకునే దురాశాపరులూ ఉండేవారు.. ఉన్నారు.. ఉంటూనే ఉంటారు. అలాంటి ఒక రాజే.. తాజాగా అమీర్‌ఖాన్ కొడుకు జునైద్ ఖాన్ నటించిన "మహారాజ్" చిత్రంలోని "జేజే" అనే పాత్రధారి. గుజరాత్ ప్రాంతంలోని ఒక పట్టణంలో జేజే అనబడే జాదూనాథ్‌జీ బ్రిజురతన్‌జీ ఒక ఆలయానికి ధర్మకర్తగా.. అక్కడి మహారాజుగా ఉంటూ ఆ ఆలయంలో చరణసేవ పేరుతో అకృత్యాలు చేస్తుంటాడు. దానిని ఎదురించిన సంఘ సంస్కర్త , సత్యప్రకాశ్ పత్రిక స్థాపకుడు కర్సన్ దాస్ మూల్జీ కథే.. ఈ మహారాజ్ సినిమా. అక్కడి మహారాజు జేజే సాక్షాత్ దైవాంశ సంభూతుడిగా ప్రజల పూజలు అందుకుంటూ ఉంటాడు. రాజుగారి దర్శనమే ఓ మహాభాగ్యం.. అంతేనా.. ఆయనను కాలు సైతం నేల మీద పెట్టనీయకుండా ప్రతి అడుగూ తమ అరచేతులతో కవర్ చేసే మూఢభక్తి ప్రదర్శకులైన ప్రజలను ఈ సినిమాలో చూడొచ్చు. అలాగే ఆ రాజు చరణసేవ పేరుతో తాను కన్నేసిన కన్యను రాజావారికి భక్తితో సమర్పించే కన్నవారికీ ఆ పట్టణంలో కొదువలేదు. ఒక్క కూతుళ్లనే కాదు.. తమ భార్యలు, అక్కాచెల్లెళ్లూ ఇలా అందరినీ రాజుగారి చరణసేవకు సమర్పించే ఆ దుస్సంప్రదాయాన్ని ఒంటి చేత్తో ఎదురించే కర్సన్ దాస్ పాత్రను అమీర్‌ఖాన్ కుమారుడు పోషించాడు. నవయువకుడు, ఔత్సాహిక జర్నలిస్టు, అభ్యుదయవాది అయిన కర్సన్‌కు "కిషోరి" అనే ఓ ప్రియురాలుంటుంది. దేవాలయానికి సంబంధించిన ఒక ఉత్సవం తర్వాత.. ఆమె జేజే చరణసేవకు ఎన్నికవుతుంది. అత్యాచారానికి గురి అవుతుంది. దురదృష్టవశాత్తూ ఆ ఘోరాన్ని హీరో కళ్లారా చూస్తాడు. ఆ తర్వాత అక్కడ జరిగే కొన్ని సంఘటనలు చూసి తాను

మోసపోయానని, తనలాగే అక్కడ అనేకమంది స్త్రీలు అత్యాచారాలకు గురి అవుతున్నారని తెలుసుకుని ఆత్మహత్య చేసుకుంటుంది కిషోరి. అప్పటికే మూఢాచారాలను వ్యతిరేకించే కర్సన్ దాస్, ప్రియురాలి చావుతో అక్కడి స్త్రీలకు న్యాయం చేయాలనీ, ఎలాగైన జేజే నిజస్వరూపాన్ని ప్రపంచానికి చూపించాలనే పట్టుదలతో చేసే పోరాటమే మిగిలిన చిత్ర కథ. తన సత్యప్రకాశ్‌లో జేజే మోసాలను ఎండగట్టడం.. ఆ తర్వాత జేజే సత్యప్రకాశ్ పత్రికా కార్యాలయాన్ని తగుల బెట్టించటం వంటి దృశ్యాలు కొన్ని ఉంటాయి. ఆ తర్వాత కొందరు మిత్రుల సహకారంతో మరో చోట పత్రికా కార్యాలయాన్ని ఏర్పాటుచేసుకున్న కర్సన్.. జేజే అసలు స్వరూపాన్ని ప్రజల ముందుంచు తాడు. దీంతో కక్షగట్టిన జేజే కర్సన్‌పై పరువు నష్టం దావా వేస్తాడు.

1862లో బాంబే సుప్రీం కోర్టులో మహారాజు జేజే వేసిన పరువునష్టం దావాపై కర్సన్ మూల్జీ ఎలా పోరాడుతాడు..? జేజే తన అధికారాన్ని దుర్వినియోగం చేసి భక్తి ముసుగులో అక్కడి స్త్రీలపై ఎలా అత్యాచారాలు కొనసాగిస్తున్నాడనే నిజాన్ని కర్సన్ బట్టబయలు చేయటమే కథ. తనకు వ్యతిరేకంగా ఎలాంటి ఆధారాలు లేవని విర్రవీగుతున్న జేజే దుర్బుద్ధిని, అతనికి వైద్యం చేసిన ఒక ప్రముఖ వైద్యుడి సాయంతోనే కోర్టులో రుజువు చేస్తాడు కర్సన్. అనేకమందితో సంభోగించే మహారాజు జేజే సుఖవ్యాధులతో బాధపడుతున్నాడనే విషయం కోర్టు సాక్షిగా రుజువు కావటం.. కోర్టుకు హాజరైన మహిళల్లో ఒకరొక్కరుగా ముందుకు వచ్చి అతని అత్యాచారాల గురించి వెల్లడించటంతో "మహరాజ్" చిత్ర కథ ముగుస్తుంది.

నిజానికి సినిమా చిత్రణపరంగా, సాంకేతిక విలువల ఆధారంగా చూస్తే 24 ఫ్రేమ్స్ అద్భుతంగా చిత్రీకరించారనే ఒప్పుకోవాలి. 1850 నాటి ఒక పట్టణం ఎలా ఉంటుందనే దానితో పాటు, అక్కడి ప్రజల జీవన విధానం కట్టు బొట్టు, ఆచార వ్యవహారాలు లాంటి వన్నీ చాలా కళాత్మకంగా, సహజసిద్ధంగా చిత్రించారు. నటీనటులు సైతం వారి వారి పాత్రలకు తగిన న్యాయం చేశారు. కాకపోతే.. ఇలాంటి ఓ సినిమాతో మిస్టర్ డిఫెక్ట్ మరోసారి హిందూత్వంపై తన ద్వేషాన్ని..అక్కసును కాస్త శృతి మించి వెళ్లగక్కినట్టు తెలిసిపోతోంది.

ఒక్క భారతదేశంలోనే కాదు.. ప్రపంచ చరిత్రలో కూడా తమ అధికారాన్ని దుర్వినియోగం చేసిన అనేక మంది దుర్మార్గ రాజులున్నారు. అంతమాత్రాన ఆ దేశాలో, ఆ సమాజాలో దుర్మార్గమైనవి కావు. అలాగే ఓ రెండువందల ఏళ్ల క్రితం నాటి ఓ పాపాత్ముడి కథను తాజాగా తెరకెక్కించి.. దేవాలయాలంటేనే అత్యాచార కేంద్రాలని ప్రచారం చేయాలనుకున్న మిస్టర్ డిఫెక్ట్ దురాక్రమణా సరికాదు. ఎందుకంటే దాదాపు ఎనిమిది వందల ఏళ్ల విదేశీ దురాక్రమణ దారుల దాడులను తట్టుకుని నిలిచిన సంస్కృతి మన భారతదేశానిది. మీరు దేశంలోని ఏ మూలకు వెళ్లినా.. ఇప్పటికీ ఎన్నో దేవాలయాల్లో కళ్లు,ముక్కు, చెవులు విరిగిపోయి.. తునాతునకలై కనిపించే అద్భుత శిల్పకళారూపాలు ఆనాటి దురాక్రమణ దారుల దాడులను మనకు గుర్తు చేస్తాయి. అలాంటిది..ఓ వైపు యువతరాన్ని నిర్వీర్యం చేయటానికి డ్రగ్స్, గంజాయి వంటి రూపాల్లో జరుగుతున్న దాడులను అడ్డుకోవాల్సింది పోయి.. నిత్యం మొబైల్ ఫోన్లలో కొలువుతీరే యువతీ యువకులకు ఎంతో కొంత సంస్కారాన్ని అందించే.. దేవాలయాల మీద మిస్టర్ డిఫెక్ట్ విషం చిమ్మటం.. నాటి గజనీ, బాబర్ దండయాత్రలకంటే తక్కువేం కాదని ఎలా అనుకోగలం?

అసలు అమీర్‌ఖాన్ అండ్ కో.. అనబడే ఇలాంటి తుకుడే గ్యాంగ్ ఓపికకు మెచ్చుకోవాలి. ఎందరో సంస్కర్తల బోధనలు, కృషి, త్యాగాల ఫలితంగా రూపుదిద్దుకున్న ఒక నవ భారతావనిని మళ్లీ పాతాళానికి నెట్టే ప్రయత్నం పదేపదే చేయటం. పైగా పీకే, మహారాజ్ ఇంకా ఇలాంటి అనేక దిక్కుమాలిన సినిమాలను తీస్తూ కూడా.. ఈ దేశంలో తాము స్వేచ్ఛగా బతకలేకపోతున్నామని వెధవ ఏడుపులొకటి!

**– రామ్ కె**

# నెల్లూరులో నారద జయంతి








**నెల్లూరు :** సాహితీసుధ ఫౌండేషన్ ఆధ్వర్యంలో "నారద జయంతి" కార్యక్రమం నెల్లూరులో జూలై 1న జరిగింది.

ముఖ్య అతిథిగా నెల్లూరు జిల్లా సూపరింటెండెంట్ ఆఫ్ పోస్టాఫీస్ కాకర్ల శ్రీనివాస్, ప్రధాన వక్తగా జర్నలిస్ట్ సాయి పాల్గొన్నారు.

ఈ సందర్భంగా ప్రజాపలుకు దిన, మాసపత్రిక ఎడిటర్ జె.సుజనీ, హెచ్.ఎన్ 9 చానల్ ఎడిటర్ బట్టేపాటి శిరీష, prema 9 నెల్లూరు జిల్లా బ్యూరో చీఫ్ దోర్నదుల నరేష్‌కుమార్, రాజస్థాన్ పత్రిక జర్నలిస్ట్ విక్రమకుమార్ జైన్ తదితరులను 'నారద జయంతి'ని పురస్కరించుకొని సాహితి సుధా ఫౌండేషన్ తరపున సన్మానించారు.

ఈ కార్యక్రమంలో ఆర్ఎస్ఎస్ ఆంధ్రప్రదేశ్ ప్రాంత సంఘచాలక్ నాగారెడ్డి హరికుమార్ రెడ్డి, ప్రాంత ప్రచారప్రముఖ్ బయ్యా వాసు, జర్నలిస్టులు తదితరులు హాజరయ్యారు. ★

# భారత్‌కు బాసటగా



కీర్ స్టార్మర్

**ఇంగ్లండ్‌లో కొత్త ప్రభుత్వం ఏర్పడబోతున్నది. 14 ఏళ్లుగా అధికారానికి దూరంగా ఉన్న బ్రిటన్ లేబర్ పార్టీ జూలై 4న జరిగిన సాధారణ ఎన్నికలలో ప్రభంజనం సృష్టించి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయబోతున్నది. ఆ పార్టీ నాయకుడు కీర్ స్టార్మర్ నూతన ప్రధాని కాబోతున్నారు. జూలై 6న ఫలితాలు వెలువడినాయి. బ్రిటిష్ పార్లమెంటులో దిగువ సభ హౌస్ ఆఫ్ కామన్స్‌లో 650 స్థానాలు ఉండగా, అందులో లేబర్ పార్టీ 411 స్థానాలలో విజయం సాధించింది. ఇది ఆ పార్టీ ఘన విజయమే. 2019 ఎన్నికలలో 209 స్థానాలకు లేబర్ పార్టీ పరిమితమైంది. అంటే రెట్టింపు స్థానాలతో విజయం మూటగట్టుకుంది. 2019 ఎన్నికలలో 365 స్థానాలు సాధించిన కన్సర్వేటివ్ పార్టీ ఈ సారి 121 స్థానాలతో సరిపెట్టుకుంది. అప్పుడు బోరిస్ జాన్సన్ నాయకత్వంలో ఈ విజయం సాధ్యమైంది. లిబరల్ డెమోక్రాట్స్ 72, స్కాటిష్ నేషనల్ పార్టీ 9 సీట్లు గెలుచుకున్నాయి. రిఫార్మ్ యూకే అనే పార్టీ ఐదు స్థానాలు గెలుచుకుంది. నిజానికి ఈ ఎన్నికలలో చిన్న చిన్న పార్టీలు తమ ఉనికిని బాగా చాటుకోగలిగాయి.**

650 స్థానాలు కలిగిన ఇంగ్లండ్ పార్లమెంట్ దిగువ సభ హౌస్ ఆఫ్ కామన్స్‌కు జూలై మొదటి వారంలో ఎన్నికలు జరిగాయి. జూలై 4న ఎన్నికలు నిర్వహించమని తాను ఇంగ్లండ్ రాజుకు సిఫారసు చేశానని మే 22, 2024న రుషి శునాక్ చెప్పగానే సొంత పార్టీ ఎంపీలే విస్తుపోయారట. అంత ఆకస్మికంగా తీసుకున్న నిర్ణయం అయి ఉండవచ్చు. దేశ ఆర్థిక పరిస్థితి మెరుగుపడిందని తాను విశ్వసించినందువల్లనే ఈ నిర్ణయానికి వచ్చానని ఆయన చెప్పారు. నిజానికి ఈ డిసెంబర్ వరకు కన్సర్వేటివ్ పార్టీ ప్రభుత్వానికి గడువు ఉంది. అయినా శునాక్ ముందస్తు ఎన్నికలకు ప్రాధాన్యం ఇచ్చారు.

మొదటి నుంచి కన్సర్వేటివ్ పార్టీ ఓడిపోతుందన్న అంచనాలు ఉన్నాయి. సర్వేలన్నీ కూడా లేబర్ పార్టీకే సానుకూల వాతావరణం ఉందని తేల్చి చెప్పాయి. ఫలితాలు అలాగే వచ్చాయి. దిగువ సభ ఎన్నికలు బలహీనపడిన, ఏకాభిప్రాయం లేని నాయకత్వంలోని కన్సర్వేటివ్ పార్టీకీ, 14 తరువాత విజృంభిస్తున్న లేబర్ పార్టీకీ నడుమ జరుగుతున్న ఎన్నికలని ఆ సర్వేలు ఆనాడే తేల్చేశాయి. ఆర్థిక వ్యవస్థ, ఆరోగ్య రక్షణ, విద్య, మౌలిక సదుపాయాల అభివృద్ధి, వలసలు, గృహవసతి, విద్యుత్ వంటి అంశాలే ఈ ఎన్నికలలో కీలక ప్రచారాంశాలుగా ఉన్నాయి. కన్సర్వేటివ్ పార్టీ తరఫున రుషి శునాక్ లేబర్ పార్టీ సుంకం విధానం మీద ఎక్కువ విమర్శలు గుప్పించారు. లేబర్ పార్టీ నాయకుడు స్టార్మర్ మాత్రం 'మార్పు' అన్న అంశాన్నే ఎక్కువ ప్రచారం చేశారు. దేశాన్ని ముందుకు తీసుకువెళ్లే, ఆర్థికంగా బలోపేతం చేసే శ్రామికుల శ్రేయస్సుకే తమ పార్టీ కట్టుబడి ఉందని కూడా ఆయన చెప్పారు. నిజానికి నాలుగైదు సంవత్సరాలుగా ఆర్థిక సంక్షోభంలో ఉన్న ఇంగ్లండ్‌ను రక్షిస్తామని, ఆర్థిక స్థిరత్వం కల్పిస్తామని కూడా స్టార్మర్ హామీ ఇచ్చారు. దేశ ప్రయోజనాలకే తాము తొలి ప్రాధాన్యం ఇస్తామని కూడా ఆయన ప్రకటించారు. లిబరల్ డెమొక్రటిక్ పార్టీ నాయకుడు ఎడ్ దేవి మాత్రం ఎన్నికల ప్రచారంలో ముందంజలో ఉన్నా ఫలితాలు సాధించలేకపోయారు.

యూరోపియన్ యూనియన్ నుంచి ఇంగ్లండ్ వైదొలగడం (బ్రెగ్జిట్) అంశం దగ్గర కన్సర్వేటివ్ పార్టీ తన ప్రాభవాన్ని కోల్పోవడం మొదలుపెట్టింది. ఆ వివాదం మొదలైన తరువాత ప్రధాని పదవి చేపట్టిన వారంతా అపఖ్యాతితోనే పదవి నుంచి వైదొలిగారు. అయితే శునాక్ ఇందులో కొంచెం మినహాయింపుగానే భావించవచ్చు. మిగిలిన వారికంటే ఆయన కొంచెం ఎక్కువ కాలమే పదవిని నిర్వహించగలిగారు. డేవిడ్ కామెరూన్ దగ్గర మొదలైన ప్రధానుల పదవీచ్యుతి వ్యవహారం థెరిసా మే, బోరిస్ జాన్సన్, లిజ్ ట్రస్, చివరకు శునక్ వరకు సాగింది. 2022లో శునాక్ ఆ పదవిని స్వీకరించారు. 2024 ఎన్నికల ద్వారా ఆంగ్లేయులు కన్సర్వేటివ్ పార్టీని నిరాకరించిన మాట వాస్తవం. ఇందులో కొంచెం బాధ కలిగించే విషయం, భారతీయ సంతతికి చెందిన రుషి శునాక్ ప్రధానిగా కొనసాగే అవకాశం కోల్పోయారు. పాత సభలోని 300 మంది తిరిగి ఎన్నికయ్యారు. 335మంది తొలిసారి సభలో అడుగు పెడుతున్నారు. బ్రిటన్ నుంచి అమెరికా స్వాతంత్ర్య తెచ్చుకున్న రోజునే ఈసారి పోలింగ్ జరిగింది.

దాదాపు ఒకటిన్నర దశాబ్దం తరువాత లేబర్ పార్టీ అధికారం చేపడుతున్నది. ఆ పార్టీ తరఫున అధికారం చేపట్టబోతున్న కొత్త ప్రధాని కీర్ స్టార్మర్ ఎదుర్కొనవలసిన తొలి సవాలు ఏమిటి? ఇదే ప్రశ్న ఇప్పుడు రాజకీయ విశ్లేషకులు సంధిస్తున్నారు. తాము అధికారంలో ఉండగా భారత్‌తో బెడిసికొట్టిన సంబంధాలను పునరుద్ధరించుకోవడమేనన్నది ఆ ప్రశ్నకు ఇప్పుడు వినిపిస్తున్న సమాధానం. స్టార్మర్ ప్రాతినిధ్యం వహిస్తున్న లేబర్ పార్టీకశ్మీర్ అంశంలో గతంలో చేసిన వ్యాఖ్యలతో ఆ పార్టీకీ, భారత్‌కీ మధ్య సంబంధాలు దెబ్బ తిన్నాయి. గతంలో కశ్మీర్ వివాదంపై ఆ పార్టీ అనుసరించిన విధానంతో, చేసిన ప్రకటనలతో తరచు భారత్ ఆగ్రహానికి గురయ్యేది. నిజానికి లేబర్ పార్టీయే కాదు, అక్కడ ఇంకొన్ని చిన్నా చితకా పార్టీలు కూడా కశ్మీర్ అంశంలో భారత్‌కు నష్టం కలిగించే వ్యాఖ్యలు చేసేవి. కశ్మీర్ లోయలో మానవ హక్కుల ఉల్లంఘన యథేచ్ఛగా జరిగి పోతోందని గగ్గోలు పెట్టేవి. బ్రిటిష్ ప్రభుత్వం మాత్రం కశ్మీర్ వివాదం భారత్– పాకిస్తాన్‌ల నడుమ ద్వైపాక్షిక సమస్యగా మాత్రమే భావించేది. కానీ ఈ అభిప్రాయంతో లేబర్ పార్టీ విభేదించేది. 2019 సెప్టెంబర్‌లో లేబర్ పార్టీ ప్రవేశపెట్టిన అత్యవసర తీర్మానం ఆ పార్టీ అన్ని హద్దులను అతిక్రమించే టట్టుగా ఉంటుంది. జెర్మి కార్బన్ నాయకత్వంలో ఆ సంవత్సరం పార్టీ ఆ తీర్మానం ప్రవేశపెట్టింది. దీని ప్రకారం కశ్మీర్ వివాదం పరిష్కారానికి ఒక అంతర్జాతీయ పరిశీలకుడిని అనుమతించాలి. అలాగే అక్కడి ప్రజలకు స్వయం నిర్ణయాధికారం ఇవ్వాలి. ఇరు దేశాలు అణ్వస్త్రాలు కలిగి ఉన్నందున భారత్, పాక్ హైకమిషనర్లు ఇద్దరు సమావేశమై శాంతి స్థాపనకు కృషి చేయాలని కూడా కార్బన్ సూచించాడు. ఇలాంటి వాదన, సూచన కూడా ఓటు బ్యాంకు రాజకీయాల కోసమేనని అప్పట్లో భారత్

# ఇంగ్లండ్ కొత్త ప్రభుత్వం



రుషి శునాక్

కొట్టి పారేసింది. కోర్బన్ నాయకత్వంలో నడుస్తున్న లేబర్ పార్టీకి విషయాలు ఏమాత్రం తెలియవని కూడా భారత్ తీవ్ర స్థాయిలోనే తిప్పికొట్టింది. నిజానికి ఈ తీర్మానం పట్ల లేబర్ పార్టీలోనే ఉన్న భారతీయ సంతతి ఎంపీలు కూడా సానుకూలంగా లేరు. అది భారత వ్యతిరేక వైఖరి అని వారికీ తెలుసు. ఈ ద్వైదీభావంలో వారు కొట్టుమిట్టాడారు. చాలా చిత్రంగా, కశ్మీర్ మీద అతడు ప్రవేశపెట్టిన తీర్మానం కారణం కాకపోయినా, 2020లోనే కోర్బన్‌ను లేబర్ పార్టీ బహిష్కరించింది. యూదు వ్యతిరేకత అంశం మీద వచ్చిన వివాదమే అందుకు కారణం. కోర్బన్ స్థానాన్ని భర్తీ చేసిన వారే స్టార్మర్.

అయితే ఇప్పుడు లేబర్ పార్టీ కశ్మీర్ మీద తన వైఖరిని సడలించుకుంది. ఇందుకు కారణం, శరవేగంగా ఎదుగుతున్న ఆర్థిక వ్యవస్థగా భారత్‌కు ఉన్న ప్రాధాన్యాన్ని బట్టి ఇంగ్లండ్‌కు సత్సంబంధాలు అత్యవసరమని లేబర్ పార్టీ భావిస్తున్నది. అందుకే గతంలో తన పార్టీ చేసిన తప్పిదాలను సవరించే పనిని ఆయన ఆరంభించారు. నిజానికి ఈ ఎన్నికలలో లేబర్ పార్టీ తన మేనిఫెస్టోలో సైతం భారత్‌తో సత్సంబంధాలు వాంఛనీయమన్న వైఖరినే ప్రకటించింది. అంతేకాదు, వాణిజ్య ఒప్పందాలు చేసుకోవలసిన అవసరమే కాకుండా, కొత్త వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని కూడా కోరుకుంటున్నట్టు ఆ పార్టీ ప్రకటించింది. తన ఎన్నికల ప్రచారంలో భారత సంతతికి చెందిన వారిని కలుసుకున్నప్పుడే స్టార్మర్ మారిన పార్టీ వైఖరి గురించి స్పష్టం చేశారు. కశ్మీర్ వివాదం భారత్ అంతర్గత సమస్య మాత్రమే నని, పాకిస్తాన్‌తో కలసి శాంతియుతంగా పరిష్కరించుకోవాలని ఆయన అన్నారు. రాజ్యాంగ పరిధిలోని ఏ అంశం మీదనైనా భారత పార్లమెంటు పరిధిలోకే వస్తుంది. కశ్మీర్ కూడా ద్వైపాక్షిక సమస్య కాబట్టి ఆ ఇరు దేశాల వారు శాంతియుతంగా పరిష్కరించుకోవాలని అని ఆయన భారత 'లేబర్ ఫ్రెండ్స్'తో పేర్కొన్నారు. నిజానికి స్టార్మర్ ప్రచార సరళి పూర్తిగా భారత అనుకూల ధోరణిలోనే ఉంది. భారతీయుల మనసు గెలుచుకునే ప్రయత్నమే అందులో కనిపించింది. ఆయన హిందూఫోబియా (హిందువుల పట్ల వ్యతిరేకత)ను ఖండించారు. హిందువుల ప్రధాన పండుగలు దీపావళి, హోలీ వంటివి ఇక్కడా జరుపుకోవాలని పిలుపునిచ్చారు.

లేబర్ పార్టీ ప్రకటించిన కొత్త విధానం ఆసియా ఖండంలోనే కొత్త శకానికి తెర తీస్తుంది. కశ్మీర్ ద్వైపాక్షిక అంశం అన్న ప్రకటనతో పాకిస్తాన్‌కు పచ్చి వెలక్కాయ గొంతులో పడినట్టే. చాలా దేశాలు ఇప్పుడు కశ్మీర్ వివాదం మీద భారత్‌కు అనుకూల వైఖరితోనే అభిప్రాయాలను వ్యక్తం చేస్తున్నాయి. పాకిస్తాన్‌కు బాధ కలిగించే అంశం సహజంగానే చైనాకూ బాధ కలిగించేది అవుతుంది. లేబర్ పార్టీలో వచ్చిన మార్పు చైనాకు కూడా మింగుడు పడేది కాదు. అసలు దక్షిణ ఆసియా కల్లోలానికి కశ్మీర్ వివాదం ఒక కారణం. ఆ వివాదం విషయంలో తన వైఖరినే మార్చుకున్నట్టు లేబర్ పార్టీ ప్రకటిం చింది. కాబట్టి ఐక్య రాజ్య సమితిలో కూడా ఇందుకు సంబంధించి ప్రతిధ్వనులు వినిపిస్తాయి.


లేబర్ పార్టీ ఒక దశాబ్దకాలంగా అధికారానికి దూరంగా ఉంది. ఇంతలో ప్రపంచవ్యాప్తంగా ఎన్నో మార్పులు వచ్చాయి. కొత్త వాస్తవాలు ప్రపంచ ప్రజానీకాన్ని ఆలోచింప చేశాయి. ఆ క్రమంలోనే లేబర్ పార్టీ తన విదేశాంగ విధానంలో కూడా మార్పులు తెచ్చుకుంటున్నది. దానికే పురోగమన వాస్తవికత అన్న పేరు. ప్రపంచ సమస్యలను పరిగణనలోనికి తీసుకుని అందుకు అనుగుణంగా నడుచుకోవడమే ఈ విధానం ధ్యేయం. ఇందులో వాతావరణ మార్పులు, అంతర్జాతీయ భద్రత అంశాలు కూడా ఇమిడి ఉన్నాయి. భారత్‌తో తమ వ్యూహాత్మక సంబంధాలు ఎలా ఉండబోతున్నాయో కూడా లేబర్ పార్టీ మేనిఫెస్టో వెల్లడించింది. వాణిజ్య ఒప్పందాలు, సాంకేతిక పరిజ్ఞానంలో సహకారం, భద్రత, విద్య, పర్యావరణ అంశాలు ఉండబోతున్నాయి.

రుషి శునాక్ ఒక క్లిష్ట సమయంలో ఇంగ్లండ్ ప్రధానిగా ఎన్నికయ్యారు. ఆయన భారత్‌తో సత్సంబంధాలు నెరపడం సహజ విషయం. ఇంగ్లండ్ పౌరుడే అయినా, శునాక్ భారతీయ మూలాలను విస్మరించలేదు. సరికదా, హిందువుగా జీవించడానికీ, తాను హిందువుననీ సగర్వంగా ప్రకటించుకోవడానికీ కూడా ఆయన వెనుకాడలేదు. కొత్త సహస్రాబ్దిలో భారత్ పట్ల వైఖరిని మార్చుకున్న దేశాలలో అమెరికాతో పాటు ఇంగ్లండ్ కూడా ఉందనే అనుకోవాలి. ప్రధానంగా ఉగ్రవాదం మీద పోరులో మొదట అమెరికా, తరువాత ఇంగ్లండ్ భారత్ అవసరాన్ని, ప్రాధాన్యాన్ని గుర్తించాయి. లేబర్ పార్టీ ఇప్పుడు కశ్మీర్ గురించి కొద్దిపాటి సంయమనంతో మాట్లాడుతున్నదంటే, 1947 నాటి విభజన విషాదం పట్ల కొత్త దృష్టిని ఏర్పరుచుకుని ఉండాలి. సెరిల్ రాడ్‌క్లిఫ్ చేత ఆదరాబాదరా చేయించిన దేశ విభజనవల్ల ఐదు లక్షలమంది ప్రాణాలు కోల్పోయారు. మరొక పదిలక్షల మంది నిరాశ్రయులయ్యారు. ఆ గాయాలు భారత్‌ను ఇప్పటికీ పట్టి పీడిస్తున్నాయి. నిజానికి విభజన దుష్ఫలితమే కశ్మీర్ సమస్య కూడా. ★

## బ్రిటన్ సభలో భారతీయులు



రద్దయిన ఇంగ్లండ్ దిగువ సభలో భారతీయుల సంఖ్య 15. ఈ ఎన్నికలలో 107 మంది భారత సంతతికి చెందిన వారు బరిలో దిగారు. టోరీ లేదా కన్సర్వేటివ్ పార్టీ నుంచి రుషి శునాక్ (రిచ్‌మండ్/నార్తాల్‌లెర్టన్), ప్రీతి పటేల్ (ఎస్సెక్స్‌లోని విథామ్), సూయెల్లా బ్రవెర్మెన్ (ఫారెహమ్/వాటర్‌లూవిల్), డాక్టర్ నీల్ శాస్త్రి హర్స్ట్ (సోలిహల్ వెస్ట్ / షిర్లే), డాక్టర్ రేవా గుడి (ఫెల్తామ్/హెస్టన్), నూపుర్ మజుందార్ (లువిషామ్ నార్త్), ఎరిక్ సుకుమారన్ (సౌత్‌గేట్/ఉడ్‌గ్రీన్), శివానీ రాజా (లీసెస్టర్ ఈస్ట్) పోటీ చేశారు. లేబర్ పార్టీ నుంచి ప్రీత్ కౌర్ గిల్ (బ్రిమ్మింగ్‌హ్యామ్ ఎడ్జ్‌బాస్టన్), తన్మన్‌జిత్ సింగ్ దేశి (స్లౌ), లీసా నాండీ (వీగన్), సీమా మల్హోత్రా (ఫాల్తెమ్ హెస్టన్), గురిందర్ సింగ్ జోసాన్ (స్మెత్విక్), కనిష్కనారాయణ్ (వేల్ ఆఫ్ గ్లామోర్గాన్), సోనియా కుమార్ (డడ్లి) లతో పాటు ఇతర పార్టీల నుంచి కూడా భారతీయులు బరిలో దిగారు. వీరిలో రుషి శునాక్, శివానీ రాజా, కనిష్కనారాయణ్, సుయెల్లా బ్రవెర్మెన్, ప్రీత్‌కౌర్ గిల్, ప్రీతీ పటేల్, గగన్ మహేంద్ర, నవేందు మిశ్రా, లీసా నంది, తన్మన్‌జిత్ సింగ్ దేశీ గెలిచి సభలో అడుగు పెట్టబోతున్నారు.




# ఆదిత్య ఎల్1: లక్షిత కక్ష్యలో ఉంచిన ఇస్రో

ఈ భూగోళంపై శక్తిని ప్రసాదించే ఏకైక నక్షత్రమైన సూర్యుడిని అధ్యయనం చేసే పనితో ప్రయోగించిన అంతరిక్ష నౌక ఆదిత్య ఎల్ 1 తన నూతన గృహాన్ని చేరుకున్నప్పటి నుంచీ కష్టించి పని చేస్తోంది.

- **అనేక కలవరపరిచే శక్తులను ఎదుర్కొన్న అంతరిక్ష నౌక**
- **లక్షిత కక్ష్యను వదిలేలా అవి చేస్తాయి.**
- **వాటిలో అన్నింటికన్నా శక్తిమంతమైనది గురుత్వాకర్షణ ప్రతిబంధం**

భూమికి దాదాపు 15,00,000 కిలోమీటర్ల దూరంలో ఒక ప్రత్యేకమైన స్థానమైన లాగ్‌రేంజ్ పాయింట్ 1 చేరుకున్న దాదాపు ఆరు నెలల తర్వాత, భారత్‌కు చెందిన ఆదిత్య ఎల్ 1 తన తొలి హాలో ఆర్బిట్‌ను (గ్రహపథ యాంత్రికతలో ఎల్1, ఎల్2, ఎల్3 లాగ్రేంజ్ పాయింట్లలో ఒక దానికి సంబంధించిన ఆవర్తన, త్రిమితీయ కక్ష్య) పూర్తి చేసుకుంది.

సూర్యుడిని అధ్యయనం చేసే తొలి భారతీయ అంతరిక్ష నౌక అయిన ఆదిత్య ఎల్ 1, జనవరి 2024 తొలివారంలో తన నూతన గృహాన్ని చేరుకున్నప్పటి నుంచీ కష్టించి పని చేస్తోంది. తన హాలో ఆర్బిట్‌లో ఒక భ్రమణాన్ని పూర్తి చేసేందుకు అంతరిక్ష నౌకకు 178 రోజులు పట్టింది.

ఎల్1లో తన ఆరునెలల బస కాలంలో అంతరిక్ష నౌక మే మొదటివారంలో భూమిని గాయపరిచిన రికార్డు సౌర తుపాను సందర్భంగా సూర్యుడిని కీలకంగా పరిశీలించింది. అది తర్వాత జరిగిన ఘటనపై నిశిత దృష్టి ఉంచినందున సూర్యుడి ఉపరితలంపై చేసుకున్న గతిశీల కార్యకలాపాలను ఆదిత్య ఎల్1 పరిశీలించింది.

**న్యూటన్‌తో ఆదిత్య ఎల్1 నాట్యం**

ఎల్ 1 వద్ద తొలి ఆరునెలల సందర్భంగా, తన లక్షిత కక్ష్య నుంచి అంతరిక్ష నౌక తొలిగేలా చేసిన అనేక కలవరపరిచే శక్తులను ఎదుర్కొంది. అందులో అత్యంత శక్తిమంతమైంది, కక్ష్యలో అది ఎదుర్కొన్న గురుత్వాకర్షణ ప్రతిబంధం. భౌతిక శాస్త్రంలో గురుత్వాకర్షణ ప్రతిబంధం అనేది ప్రామాణిక పదం కాకపోయినప్పటికీ, ఒక మాధ్యమం ద్వారా కదులు తున్న గురుత్వాకర్షణపై ప్రభావానికి సంబంధించిన అంశాలను ఇది సూచిస్తుంది. ఈ ప్రతిబంధ శక్తి ఉపగ్రహం తన శక్తిని లేదా ఇంధనాన్ని కోల్పోయేలా చేస్తుంది. తత్ఫలితంగా అవి ఎత్తులో తరుగుదలను చవి చూస్తాయి,

ఇస్రో అధికారుల ప్రకారం, ఇతర ఉపగ్రహాలలా గానే, ఆదిత్య ఎల్ 1 కూడా కక్ష క్షీణతకు దారితీసే శక్తులను ఎదుర్కొని, తన పథాన్ని కోల్పోవడం ప్రారంభించింది. ఇక్కడే ఐజాక్ న్యూటన్ తొలి చలన సూత్రం పని చేయడం ప్రారంభిస్తుంది. న్యూటన్ తొలి చలన సూత్రం ప్రకారం, నిశ్చల స్థితిలో ఉన్న వస్తువు నిశ్చల స్థితిలోనే ఉంటుంది, అసమతులమైన బాహ్యశక్తితో పనిచేస్తే తప్ప చలనంలో ఉన్న వస్తువు అదే వేగంతో, అదే దిశలో గమనాన్ని సాగిస్తుంది.

**ప్రారంభమైన స్థాన సంరక్షణ**

ఎల్1 వద్ద ఆదిత్య ఎల్1 తన పథాన్ని కోల్పోయేలా చేయగల ప్రతిబంధ, ఇతర కలవర పరిచే శక్తులను ఎదుర్కోవడానికి, ఇస్రో మూడు స్థాన సంరక్షణ విన్యాసాలను ప్రారంభించింది. ఒకవేళ ఇస్రో జోక్యం చేసుకొని, అంతరిక్ష నౌకపై బాహ్య శక్తి పెట్టకపోయి ఉంటే, అది తన కక్ష్యను కోల్పోవడాన్ని కొనసాగిస్తూ ఉండేది.

బహిర్గత శక్తిని ఉపయోగించి ఎల్1 వద్ద గల కలవరపరిచే శక్తులను ఎదుర్కొనేందుకు చేసిన ఆదిత్య ఎల్1తో స్థాన సంరక్షణ విన్యాసాలలో, ఆదిత్య ఎల్ 1లో పీడనతో ముందుకు తోసే పరికరాల (థ్రస్టర్లు), మినీ మోటార్ ఇంజన్ వేగాన్ని పెంచడం సహ అనేకం ఉన్నాయి. అంతరిక్ష నౌక నిర్దేశిత కక్ష్యలో ఉండేలా ఫిబ్రవరి 22న, జూన్ 7న, జులై 2వ తేదీన మూడు స్థాన సంరక్షణ విన్యాసాలు నిర్వహించారు.

ఒక వేళ తాము అంతరిక్ష నౌకపై థ్రస్టర్లను ప్రయోగించి, విన్యాసాలను నిర్వహించి ఉండకపోతే, అది కక్ష్య ఎలా మారి ఉండేదో చూపే గ్రాఫిక్‌ను ఇస్రో విడుదల చేసింది. ఖచ్చితమైన ఫైరింగ్ చేయకపోయి ఉంటే, అంతరిక్ష నౌక తన పథం నుంచి దూరంగా వెళ్లి ఉండేదని ఇస్రో వెల్లడించింది.

అంతరిక్షనౌక ఎల్ 1 వద్ద తన రెండవ భ్రమణాన్ని ప్రారంభిస్తున్న నేపథ్యంలో యుగాలుగా మార్మికంగా మిగిలిపోయిన సూర్యుడి రహస్యాలను విప్పేందుకు అది సిద్ధంగా ఉంది. కానీ, అంతరిక్ష నౌక ఉండవలసిన పథంలోనే ఉండేందుకు మరిన్ని అటువంటి కీలక విన్యాసాలను నిర్వహించవలసి ఉంటుందన్నది వాస్తవం.

**– జాగృతి డెస్క్**

# అవును మరి.. సెలవు..!



తెల్లవారి ఏడుకొట్టక ముందే ..
'లేవరా కన్నా!' అంటూ వినిపిస్తుంది.
అది పిలుపు కాదు, శుభోదయ మేలుకొలుపు..!
పట్టించేవి పాలు కాదు
ప్రేమ రంగరించిన మురిపాలు.. !
చేయించేది స్నానం కాదు..సాక్షాత్తూ..శ్రీరామరక్షయే...!
అవి పప్పునెయ్యి ముద్దలు కావు...
అనురాగం, ఆత్మీయత కలబోసిన గారాల గోరుముద్దలు...!
సుద్దులు చెప్తూ బడికి సిద్ధం చేసి, వీధి చివర మలుపు వరకూ
చేతులూపుతూ నిల్చున్న ఆ మూర్తి చూపులో,
కనురెప్ప మాటున తొంగిచూసే కోటి తారల కాంతి..!
ఆమె పెదవుల మీద విరిసే నవ్వు, బాలభానుని అరుణోదయ కిరణం ..!
హాయిగా ఆలపించే ఆ జోలపాట,
రాగాల ఊయలూపే బాలరాముని రామలాలి..!
ఇంటికి నిండుదనమిచ్చే ఆ పెద్దవారి పెంపకం,
ఆ చేతిచలవ ...సనాతనం, అపురూపం ..!
కాని....!
ఆదమరచి సేదతీరే ఆ చిన్ని నిదురను,
కాలం కబళించి కలత నిదుర చేస్తోంది..
అక్షరాలే తెలియని వయసులో
లక్షల విలువ చేసే పుస్తకాల మోతలు..
అర్థం కాని చదువుల వెతలు....
అందలాన్ని ఆశించే అమ్మానాన్నల కోరికల తీరాలు....
అంతు తెలియని, విద్యావిధానాలు...
ఆటకు,పాటకు,నిద్రకు ఒక పరిధి, ఒక పరిమితి .....
పోటీకి తట్టుకోలేని ..పసితనపు మనోరథం..
చివ్వున చితికిపోయే దుస్థితి....!
ఆ మిసిమి హృదయం అందాల అరవిందం
ఆ పలుకు రామచిలుక కులుకు
ఆ కన్నులు తెల్లగా.. చల్లగా కురిసే వెన్నెలలు..
ఆ నవ్వులు తీయని తేటతేనియలు......!
అంతేనా..!
కబుర్లు, కథలన్నీ తాతయ్య తోటే..
పాటలు, పద్యాలు, అలకలు, ఆటలూ నానమ్మ ఒడిలోనే....
ఆ అల్లరి, ఆ సందడి వారిద్దరి సొంతమే
ఐనా, చిన్నారి చిన్న మదిలో ఏదో వెలితి...
అవును మరి....!
మారిన కాలంలో కన్నవారి మమతానురాగాలు గగన కుసుమాలు.
కల్మష మెరుగని చిన్నారుల కళ్లల్లో.... కనిపించని బెంగలు.....
ఎదిరించలేని చిన్ని ఎదలో రొదపెడుతున్న తీరని నిరాశలు..!
మాటలే రాని మనసులో ..మౌన భాషలు....!
'అమ్మా' అనే పిలుపు...గుండెలోనే ..!
'నాన్న' కోసం ఎదురుచూపు గుమ్మంలోనే......!
రోజులు జరిగినా..వారం తిరిగినా..నెలలు గడిచినా ....
పెద్దవారి ఆలనా పాలనలో మునిగి తేలియాడినా ..
బాబిగాడికిష్టమైన వారం మాత్రం, ఆదివారం..!
ఎందుకో తెలుసా....అమ్మా, నాన్నా.. ఆఫీసుకి వెళ్లరు.!!

భారతీకృష్ణ
99599 65215

# హిమాలయ రాజ్యంలో సిలువ సెగ

ఎక్కడైనా సరే కమ్యూనిస్టులు హిందూ వ్యతిరేకులేననిపిస్తుంది. మన పక్కనే ఉన్న నేపాల్ ఒకప్పుడు ప్రపంచంలోనే ఏకైక హిందూ దేశం. అక్కడ మావోయిస్టు ఉద్యమం ఫలితంగా రాజరికం కూలిపోయి, మూణ్ణాళ్ల ముచ్చటగా మావోయిస్టులు అధికారంలోకి వచ్చారు. ఫలితం, క్రైస్తవం పెరిగి పోయింది. ఎక్కడ క్రైస్తవం పెరిగినా దాని వెనుక అంతర్జాతీయ కుట్ర ఉన్నట్టే. నేపాల్‌ను మళ్లీ హిందూ రాష్ట్రంగా ప్రకటించాలని ఇటీవల కాలంలో ఉద్యమాలు ఆరంభమైన సంగతి కూడా తెలిసినదే.

మతాంతరీకరణలను అదుపు చేసే విషయం గురించి అప్రమత్తంగా ఉండాలని నేపాల్‌లోని 77 జిల్లాల అధికారులను ఈ సంవత్సరం ఏప్రిల్ 7న ఆ దేశ హోంమంత్రిత్వ శాఖ ఆదేశించింది. కొన్ని సంస్థలు, కొందరు విదేశీయులు దేశంలో రకరకాల కార్యక్రమాలు నిర్వహిస్తూ మతాంతరీకరణ కార్యక్రమం నిర్వహిస్తున్నారని నేపాల్ హోం మంత్రిత్వ శాఖ దగ్గర సమాచారం ఉంది.

నేపాల్ రాజ్యాంగం(2015) లోని ఆర్టికల్ 26 ప్రతి పౌరుడికి మత స్వేచ్ఛను ఇచ్చింది. ఏ పౌరుడైన తనకు ఇష్టమైన మత విశ్వాసం కలిగి ఉండవచ్చు. తన మతం గురించి ప్రచారం చేసుకోవచ్చు. తన మతాన్ని విశ్వాసాన్ని రక్షించుకోవచ్చు. అలా అని ఈ ఆర్టికల్ మతాంతరీకరణలు చేయడానికి స్వేచ్ఛను ఇవ్వదని అందులోనే ఉన్న మూడో నిబంధన హెచ్చరిస్తున్నది. ఇతర మతం ఉనికికి ప్రమాదం తెచ్చే రీతిలో వ్యవహరిస్తే శిక్షార్హులేనని వెల్లడించింది.

నేపాల్ నేరశిక్షాస్మృతిలోని ఆర్టికల్ 158(1), 158(2) కూడా మతమార్పిడికి పాల్పడిన వాళ్లకి గట్టి శిక్షలనే సిఫారసుచేస్తున్నది. వీటిని ఉల్లంఘించిన వారికి యాభయ్ వేల వరకు నేపాల్ రూపాయలు జరిమానా విధించవచ్చు. కానీ ఈ చట్టాలు నేపాల్‌లో క్రైస్తవ మిషనరీల ఆగడాలను, కుట్రలను ఏమాత్రం నిరోధించలేకపోతున్నాయని అర్థమవుతుంది.

2022లో నేషనల్ క్రిస్టియన్ కమ్యూనిటి సర్వే వెలువడింది. ఆ సర్వే ప్రకారం ఆ చిన్న హిమాలయ రాజ్యంలో 6,83,261 మంది క్రైస్తవులు ఉన్నారు. 7,758 చర్చిలు ఉన్నాయి. కానీ ఇక్కడ క్రైస్తవుల సంఖ్య ముప్పయ్ లక్షలకు దగ్గరగా ఉందని నేషనల్ క్రిస్టియన్ ఫెడరేషన్ ఘనంగా చాటుకుంది. ఇంతకీ నేపాల్ మొత్తం జనాభా మూడు కోట్ల యాభయ్ లక్షలు. అందుకే అసలు నేపాల్‌లో ఎంత వేగంగా క్రైస్తవం పాకిపోయిందో అధ్యయనం చేయవలసిన అవసరం ఉందని అనిపిస్తుంది.

1950 దశకంలో నేపాల్‌లో క్రైస్తవుల సంఖ్య కేవలం 30. 1715లోనే అక్కడ క్రైస్తవ మిషనరీలు పని మొదలుపెట్టాయి. అవి ఇటలీలోని కపూచిన్ ఫెయిర్స్ నుంచి వచ్చాయి. కానీ అవేమీ కొద్దిగా కూడా నేపాలీలను మతం మార్చలేకపోయాయి. కానీ వీటికి 1990 దశకం నుంచి దేశమంతటా విజృంభించే అవకాశం అయాచితంగా వచ్చింది.

ఇక్కడే గుండెలు అవిసిపోయే పరిణామం జరిగింది. అప్పటివరకు ముప్పయ్ మంది ఉన్న క్రైస్తవులు ఏకంగా 1,02,000 ఎగబాకి పోయింది. మళ్లీ ఒక దశాబ్దం తరువాత లెక్కలు తీస్తే ఆ సంఖ్య 3,75,000 చేరింది. నేపాల్ రాజు పతనం కావడం, మావోయిస్టులు చెలరేగిపోవడం వంటి పరిణామాలే దీనికి కారణం. నిజానికి రాజు పృథ్వీ నారాయణ్ షా 1765–1799లో అమలు చేసిన చట్టం మేరకు ఇటీవలి నేపాల్ రాజు దేశం నుంచి క్రైస్తవ మిషనరీలను బహిష్కరించారు. వీరంతా భారత దేశానికి వచ్చారు. మావోయిస్టుల ఉద్యమంలో సెక్యులరిజం స్థాపన (దీనికే మత స్వేచ్ఛ అని పేరు) కూడా ఒక అంశం. ఇవన్నీ కలిపి దేశంలో క్రైస్తవం కలుపులా బలిసిపోయింది. దీనికి నిదర్శనం 2013లో గొర్డాన్ కోన్వెల్ ఇచ్చిన నివేదిక. దీని ప్రకారం ప్రపంచంలోనే అత్యంత వేగంగా క్రైస్తవం అభివృద్ధి చెందుతున్న దేశం నేపాల్. అందుకే ఏటా జనాభాలో 10.9 శాతం విస్తరిస్తూ ప్రస్తుతం మొత్తం జనాభాలో 10 శాతానికి చేరుకుంది. ఈ లెక్కలు విశ్వసించదగినవేనని చాలామంది విశ్లేషకుల అభిప్రాయం. నిజానికి చాలా పశ్చిమ దేశాలు కూడా నేపాల్ పట్ల ప్రత్యేక ఆసక్తి కనబరుస్తున్నాయి. ప్రస్తుతం నేపాల్‌లోని దళితులు, గిరిజనులలో 65 శాతం క్రైస్తవులుగా మారిపోయారు. ఇది భారత్‌లో





# వీళ్లా విపక్ష ఎంపీలు?

భారతదేశంలో కొన్ని ప్రతిపక్షాలు ఉన్నాయి. వాటి తరపున ఎన్నికై పార్లమెంట్‌కు వచ్చిన కొందరు ఎంపీలను చూస్తే వీళ్లేనా మన చట్ట నిర్మాతలు అని వెంటనే ప్రశ్న వస్తుంది. అందులో అగ్రతాంబూలం తప్పనిసరిగా, తిరుగులేకుండా దక్కించుకోగల ఎంపీ మహువా మొయిత్రా. ఈమె తృణమూల్ కాంగ్రెస్ నేత. మహిళను ఇంత మాట అంటారా అని ప్రశ్నించవచ్చు. అసలు ఈమె తమ పార్టీ మనిషి అని చెప్పుకోవడానికి ఆ పార్టీ వర్గాలే సిగ్గు పడతాయట. కాబట్టి మనం కూడా ఒక మాట అనుకోవచ్చు. ఈమె మీద చాలా చాలా ఫిర్యాదులు, అందునా అసహ్యకరమైన చేష్టలకు సంబంధించి ఫిర్యాదులు ఉన్నాయి. తాజాగా జాతీయ మహిళా కమిషన్ ఛైర్‌పర్సన్ రేఖాశర్మ మీద చేసిన నోటి దురుసు వ్యాఖ్య ముందు వాటికి ఏమీ తీసిపోదు. రేఖాశర్మ ఇటీవల ఉత్తరప్రదేశ్‌లోని హత్రాస్‌లో జరిగిన ప్రమాద స్థలిని సందర్శించారు. బాగా వర్షం వస్తుంటే ఎవరో ఆమెకు గొడుగు పట్టారు. దీనికే మహువా, రేఖాశర్మ అధినాయకుడి పైజామా ఎత్తిపట్టుకునే పనిలో ఉన్నారు కాబట్టి ఈమెకు గొడుగు పట్టుకునే వెసులుబాటు లేకపోయిందని తన ఎక్స్ ఖాతాలో వ్యాఖ్యానించింది. దీని మీద ఢిల్లీ పోలీసులు కేసు నమోదు చేశారు.



పరిస్థితికి అద్దం పడుతున్నది. ఇక్కడ కూడా ఆంగ్లేయుల పాలనలో ఆ వర్గాలే క్రైస్తవంలోకి వెళ్లాయి. ఆసియా దేశాలలోని గిరిజనులను, దళితులను క్రైస్తవం లక్ష్యంగా చేసుకున్న తీరును గురించి 1825లో డేవిడ్ స్కాట్, (డబ్ల్యు బి బేలే (బ్రిటిష్ ప్రభుత్వ కార్యదర్శి) మధ్య జరిగిన ఉత్తర ప్రత్యుత్తరాలు చక్కగా వివరిస్తాయి. అసలు ఆ వర్గాలనే క్రైస్తవం ఎందుకు లక్ష్యంగా చేసుకున్నదో కూడా వారి చర్చులు వెల్లడిస్తున్నాయి. అలా అని దళితులు, గిరిజనులు అంటే వీరిలో ఎలాంటి గౌరవం కనిపించదు. 'క్రైస్తవ మిషనరీలు ఒక తప్పు చేశాయి. అవి దేశంలో ఉన్న స్థానికులైన నాగరీకులను లక్ష్యంగా చేసుకోకుండా మొరటు గిరిజనులను లక్ష్యంగా చేసుకున్నాయి. వాళ్లు ఇంకా ఎదగని స్థితిలోనే ఉన్నారు' అని స్కాట్ రాశాడు.

2001లో నేపాల్ రాజకుటుంబం హత్య తరువాత పరిస్థితులను పోప్ 15వ బెనిడిక్ట్ ఉపయోగించుకున్నారు. 2007లో కార్యకలాపాలు ఊపందుకున్నాయి. పాశ్చాత్య దేశాలకి మతం, రాజ్యం వేర్వేరు కావు. 2014లో నాటి బ్రిటిష్ దౌత్యవేత్త ఆండ్రూ స్పేక్స్ ఇచ్చిన సలహా ఇందుకు నిదర్శనం. అతడు దౌత్యవేత్త అయి ఉండి, నేపాల్ రాజ్యాంగ పరిషత్‌కు ఈ సలహా ఇచ్చాడు. మతం మారిన వారికి రక్షణ కల్పిస్తామన్న నిబంధన రాజ్యాంగంలో చేర్చవలసిందని అతడు విజ్ఞప్తి చేశాడు. నిజానికి ఆండ్రూ నేపాల్‌లో బ్రిటిష్ దౌత్యవేత్త పేరుతో తిష్ట వేసిన మత ప్రచారకుడని అనిపిస్తుంది. ఇతడు ఆ దేశ ఆంతరంగిక వ్యవహారాలలో జోక్యం చేసుకోవడమే కాదు, దేశంలో క్రైస్తవ మత మార్పిడు లకు అవసరమైన అన్ని సౌకర్యాలు కల్పించాడు. అధికారంలో మావోయిస్టులు, సెక్యులరిస్టులు వచ్చినా ప్రజలు ఈ ధోరణులను ఆమోదించలేదు. ఖట్మాండు లోయలో మతాంతరీకరణలకు వ్యతిరేకంగా హిందూ నాయకులు రెచ్చగొట్టే ప్రసంగాలు చేశారంటూ, ఇది అవాంఛ నీయమంటూ నార్వేజియన్ హెల్సెంకి కమిటీ వంటివి గగ్గోలు పెట్టాయి. కానీ ఆగస్ట్ 2018 నాటికి నేపాల్ ప్రభుత్వాలలో కాస్త మార్పు వచ్చినట్టే ఉంది. మతాంతరీకరణను నేరంగా పరిగణించింది. దైవదూషణ చట్టం కూడా తెచ్చింది. దీని మీద కూడా 2023లో అమెరికా వారి మత స్వేచ్ఛ కమిషన్ నిప్పులు కక్కింది. అంతర్జాతీయ మానవ హక్కుల చట్టాల ప్రకారం మత స్వేచ్ఛకు (అంటే మతం మారిన వారి స్వేచ్ఛకు) ఇవ్వవలసిన గౌరవం ఇవ్వడం లేదని ఆ కమిషన్ వాపోయింది. చాలా చిత్రంగా నేపాల్ మీద చైనా పట్టు పెరుగుతున్నదన్న పేరుతో ఆ దేశంలో క్రైస్తవాన్ని బలోపేతం చేయడానికి పాశ్చాత్య దేశాలు ప్రయత్నిస్తున్నట్టు ఆరోపణలు ఉన్నాయి. కమ్యూనిజానికి విరుగుడు జాతీయతే తప్ప క్రైస్తవం కాదు. అసలు క్రైస్తవానికీ, కమ్యూనిజానికీ ఆట్టే తేడాయే లేదు. రెండూ ఒక రకం మౌఢ్యాలే.

# సీపీఎం లంచావతారం



కేరళ సీపీఎం పొట్ట విప్పి చూడ అంతా పుచ్చు. అవినీతి మయం. ఈ మధ్య బయటపడిన ఒక ఉదంతం దీనికి అద్భుతమైన సాక్ష్యం. సీపీఎం యువ నాయకత్వం ఎంత భ్రష్టుపట్టిపోయిందో లోకానికి చెప్పే ఘటన కూడా. లోక్‌సభ ఓటమి తరువాత రాష్ట్రంలో బీజేపీ పెరిగిపోతోందన్న బెంగకు తగ్గట్టు, ప్రజలకి పార్టీ దూరమైందన్న చేదునిజానికి జోడుగా ఇలాంటి భయపెట్టే వార్తలు కూడా బయట పడుతున్నాయి. పార్టీని సంస్కరించాలని ఒక పక్క ప్రయత్నాలు జరుగుతుంటే ఇవన్నీ తెలుస్తున్నాయి. ఈ వార్తని ఇండియన్ ఎక్స్‌ప్రెస్ ప్రచురించింది.

కేరళ పబ్లిక్ సర్వీస్ కమిషన్‌లో స్థానం కల్పించడం కోసం కొజికోడ్ ప్రాంత సీపీఎం యువనేత ఒకరు రూ. 60 లక్షలకి బేరం పెట్టాడు. అయితే బేరసారాల తరువాత రూ.22 లక్షలు ఇవ్వడానికి అవతలి వ్యక్తి సమ్మతించాడు. ఆ మొత్తం తీసుకెళ్లి అప్పగించాడు కూడా. అయతే పోస్టు రాలేదు. ఏమైందో, ఆయుష్ శాఖలో అంతకన్నా పెద్ద ఉద్యోగం ఇప్పిస్తానని యువ నేత చెప్పాడు. ఆఖరికి అది కూడా జరగకపోవడంతో 22 లక్షలు ఇచ్చిన వ్యక్తి సీపీఎం రాష్ట్ర కమిటీకి ఫిర్యాదుచేశాడు. పనిలో పనిగా కొజికోడ్ జిల్లా సీఐటీయు నేతకు ఫిర్యాదు చేశాడు. కమ్యూనిస్టు పార్టీలన్నీ చాలా నిగూఢంగా పనులు చేస్తాయి. ఈ లంచం వ్యవహారం కూడా చాలా రహస్యంగా దర్యాప్తు జరిపితే అంతా నిజమని తేలింది. ప్రజాపనుల శాఖ మంత్రి అహ్మద్ రియాజ్ ద్వారా అన్ని అనుమతులు తీసుకువస్తానని ఆ యువనేత చెప్పాడని తేలింది. దీనితో రిజాయ్ కూడా కంగారు పడి ఈ మొత్తం వ్యవహారం మీద దర్యాప్తు జరగాలని కోరుతున్నారు.

ఇదే సమయంలో ఇంకొక వివాదం కూడా బయటపడింది. పదవీ విరమణ చేసిన ఒక అధికారిని తీసుకువచ్చి ముఖ్యమంత్రి కార్యా లయంలో నియమించినందుకు అకౌంటెంట్ జనరల్ ప్రభుత్వాన్ని వివరణ కోరారు. కేరళ సర్వీస్ నిబంధన 100కి విరుద్ధంగా సాక్షాత్తు ముఖ్యమంత్రి పినరయి ఆ ఉద్యోగిని తన కార్యాలయంలో నియమించాలని ప్రతిపాదన పంపారు. ★

కథ

కొట్టిలేపినట్టయి, ఉలిక్కిపడి నిద్రలేచాడు రవిచంద్ర, ఎవరూలేరు, గోడ గడియారం ఆరుగంటలు కొట్టింది. "ఏమండీ! మనుష్యులు సూర్యభగవానుడి కన్నా ముందే నిద్రలేవాలండీ."

"ఆహా! కోడి కన్నా ముందుగానే తీస్తున్నావుగా నువ్వు?"

కాలేజీలో చదువుకొనేటప్పుడు చాలా ఆలస్యంగా లేవడం అలవాటు అతనికి. అక్కడికీ తల్లి అంటూ ఉండేది. "ఇప్పుడు నా మాట వినటం లేదు. అదే రేపు పెళ్లయ్యాక మీ ఆవిడ చెబితే ఉదయాన్నే లేచేస్తావు. ఇవన్నీ నా దగ్గరే" అనేది.

నిజానికి ఆవిడ, తన భవిష్యత్తుని ముందే చూసేసింది. అదేదో మాయ దర్పణంలో చూసినట్లుగా!

తెలతెలవారుతుండగా లేచి కాస్సేపు వాకిట్లో అలా పచార్లు చేసేసరికి 'కాఫీ రెడీ' అనే పద్మినితో కలిసి ఆ చల్లని వాతావరణంలో కాఫీ తాగుతుంటే' ఎంత హాయిగా ఉండేదో !

మరి ఈ రామ్మూర్తి కూడా కాఫీజీవే. కాని అతను నిద్రలేచేది మటుకు ఏడింటికి. ఎన్నిసార్లో చెప్పి చూపాడు. "ఉహూ.. ఏమి లాభం లేకపోయింది." చేసేది లేక పొద్దున్నే మొదట కాఫీ కలుపుకోవడం రవిచంద్ర అలవాటు చేసుకున్నాడు.

"అప్పుడే ఏడున్నర అయింది. రెండోసారి కాఫీ తగలని నాలుక ఓ తెగ ఆరాటపడిపోతోంది.. అతను కలిపే మొదటి కాఫీకే దిక్కు లేదు. అవునూ? ఇవాళ రామ్మూర్తి కూడా లేచిన జాడ కన్పించదేం? రాత్రి ఒంట్లో బాగా లేదన్నాడు. టెంపరేచర్ కానీ రాలేదు కదా?" రవిచంద్ర మంచం మీది నుంచి ఒక్క ఉదుటున లేచి వంటగది వైపు పరుగెత్తాడు.

* * *

రామ్మూర్తి కూడా తనలాగే ఒంటరి. కాకపోతే తనకు డబ్బుంది. అతనికి లేదు. అతని వృత్తి వంటలు చేయటం. కానీ అందులోనూ అతను పెద్దగా రాణించలేదు. అతను వండిన పదార్థాలలో పాళ్లు సమంగా ఉండేవి కాదు. ఉప్పో, కారమో ఏదో తక్కువో, ఎక్కువో అయ్యేవి. అంచేత అతను పెద్ద పెద్ద వంటలు చేసే వారికి సహాయకుడిగా ఉండేవాడు. అతని కొడుకులు మాత్రం గజ వంటగాళ్లుగా పేరు పొందేరు. రామ్మూర్తి బిడ్డల ప్రతిభను చూసి సంతోషించాడు. వాళ్ల నీడనే ఉండాలని ఆశించాడు. కానీ వాళ్లు ఆయన్ని తమ జట్టులోకి తీసుకోలేదు.

అంతేకాదు. ఆయనకు పిడికెడు మెతుకులు పెట్టటం కూడా భారంగా భావించారు. బిడ్డలుండీ ఒంటరి వాడయ్యాడు.

కానీ తన విషయం అలా కాదు. నెత్తిన పెట్టుకొని పూజించే కొడుకు, కోడలు, కూతురు, అల్లుడు ఉండి కూడా తను ఒంటరితనాన్నే ఎన్నుకున్నాడు. ఎందుకంటే.. జీవన విధానాలు మారిపోయాయి. తల్లితండ్రులంటే ప్రేమ ఉంది, ఆ విషయంలో కొదవలేదు. కానీ ఏదో తెలియని సన్నని పొర అడ్డు నిలుస్తోంది.

ఆ విషయాన్నే పద్మిని, తను ఎన్నోసార్లు వాదోపవాదాలు చేసుకునే వాళ్లు. "ఏమండీ! మనం అలవాటుపడ్డ జీవన విధానానికి వాళ్ల దానికి ఎంత వ్యత్యాసం ఉందో చూచారా? కన్నబిడ్డల దగ్గర



వాకాటి పాండురంగరావు స్మారక దీపావళి కథల పోటీకి ఎంపికైనది

## మణి వడ్లమాని

నాలుగు రోజులు ఉండేసరికి ఎవరో కొత్త వారింట్లో ఉన్న భావం కలిగింది నాకు. ఎప్పుడెప్పుడు మన ఇంటికి వచ్చేద్దామా! అనిపించింది. మీకెలా అనిపించిందో? అమెరికాలో కొడుకు ఇంటికి, కూతురు ఇంటికి వెళ్లి ఆరునెలలు ఉండి వచ్చాక అంది పద్మిని.


“నాకూ అలాగే అనిపించింది పద్మిని, అయినా మన బిడ్డలకు మనం అంటే గౌరవం, ప్రేమ ఉన్నాయి. వాళ్లు మనకు లోటు చెయ్యలేదు. మర్యాదగా చూచారు. కూల్! పద్మినీ, వాళ్ల జీవితాలు వాళ్లవి. మనము ఇప్పుడు వాళ్లకి అతిథులమే! ఆ విషయం ఎరుక ఉంచుకో” అని చెప్పాడు.

కానీ పద్మిని ఆ మనసు సమాధాన పరచుకోలేక పోయింది. ఫలితం ఒక పది రోజులు హాస్పిటల్‌లో ఉండవలసి ఉంచింది.

శంఖు చక్రాల మాదిరి ఇద్దరికీ కూడా బీపీ, షుగర్ వచ్చాయి. చాలామటుకు జాగ్రత్తగానే ఉండేవారు .

కాలం ఒక్క రీతిగా ఉండదు కదా ! ముందురోజు రాత్రి వరకు గడగడ మాట్లాడిన పద్మిని, నిద్దట్లోనే తుది శ్వాస విడిచింది.

పిల్లలు, మనవలు అందరూ వచ్చారు. ఆమెని పైలోకాలకి ఘనంగా పంపారు. అందరూ తిరుగు ప్రయాణాలకు సిద్ధమవుతున్నారు. పిల్లలు తమ దగ్గరకు వచ్చేసి ఉండమన్నారు. వాళ్లందరికి ఒకటే సమాధానం ఇచ్చాడు రవి చంద్ర.



‘‘నిజమే ఒంటరి తనమే. ఒప్పుకుంటాను అయినా నాకు ఈ ఇల్లు అమ్మతో ఉండే అనుబంధాన్ని గుర్తు చేసి ఆనందాన్ని కలిగి స్తుంది. ఒంటరిగా ఉన్నాననే భావన రాదర్రా. ఒకవేళ అలాంటిది ఏదైనా అనిపిస్తే వెంటనే మీకు చెప్పేస్తాను” సరేనా? అని వాళ్ళను బుజ్జగించి పంపేసాడు.

* * *

మనశ్శాంతి కోసం శృంగేరియాత్రకి వెళ్లినప్పుడు రవిచంద్రకు తమతో పాటు వచ్చిన వంట చేసే బృందంలో రామ్మూర్తి కలిశాడు. అప్పటినుంచి అతనికి తోడయ్యాడు. యాత్ర పూర్తి చేసి తిరిగి వస్తున్నప్పుడు. ‘‘బాబుగారూ! మీరు ఏమీ అనుకోనంటే నాదో అభ్యర్థన. నేను అన్నీ ఉండీ దిక్కులేని వాడినయ్యాను. మీరు కూడా ఒంటరి వారయ్యారు. మీరు కనికరిస్తే మీకింత వండిపెట్టి నేనింత తిని మీ సేవ చేసుకొంటూ మీ నీడన పడి ఉంటాను. జీతభత్యాలు ఇంత ఇమ్మని నేనడగను. ఎందుకంటే సంపాదించి ఒకరికి పెట్టాలన్న తాపత్రయం నాకు లేదు. కాకపోతే చనిపోయాక ఉత్తర కర్మలకి, ఆ తర్వాత శ్రాద్ధం పెట్టడానికి ముందుగానే ఏర్పాట్లు చేసుకోవాలి కదా? మీరు తృణమోపణమో ఇస్తే అందుకు పనికి వస్తుంది.”

ఆ మాటలకి కరిగిపోయాడు రవిచంద్ర. పిల్లలతో “ఈ రామ్మూర్తి పాపం నా ఆశ్రయం కోరి వచ్చాడు. తన పరిస్థితిని నిస్సంకోచంగా అంగీక రించగల అమాయకుడు. అంచేత అతనికి ఆశ్రయం ఇస్తాను. అతను నాకు వంట వండి పెడ్తాడు. నా ఆలనా పాలనా చూసుకుంటాడు. నా గురించి విచారం పెట్టుకోకండి” అని చెప్పాడు..

నిజానికి రామ్మూర్తి వంట అతి భయంకరంగా ఉండేది. “మీరు అమ్మగారిని గురించే కలవరిస్తుం టారు. మేలుకొని ఉన్నప్పుడూ ఆమె ఊసే. ఆమె వంట చాల బాగా చేసేది అన్నారు కదా.. నేను కూడా ప్రయత్నిస్తాను” అని చెప్పేవాడు. అయితే అది అప్పటి వరకే. మళ్లీ మరునాడు, అదే వంట, చప్పగానో, కారంగానో ఉండేది.”

ఇలా రామ్మూర్తి రవిచంద్ర మధ్య ఓ గమ్మత్త యిన సహచర్యం ఏర్పడింది. ఆత్మీయత పెరిగింది.

* * *

ఇలా ఎంతో దూరం పరుగులెత్తిన ఆలోచనలు వంట ఇంట్లోని దృశ్యం చూసాక బ్రేక్ వేసినట్లు ఆగిపోయాయి. ఎదురుగా పక్క మీద రామమూర్తి అచేతనంగా ఉన్నాడు.

“రామ్మూర్తి! రామ్మూర్తి! ఏమయింది అడిగాడు. జవాబులేదు. అర్థమయింది. అయినప్పటికీ డాక్టర్‌ని పిలిచాడు. డాక్టర్ వచ్చి డిక్లేర్ చేసేసాడు, “హి ఇస్ నో మోర్” అని

దానితో రవిచంద్రకళ్లు జలపాతాలయ్యాయి! అయ్యో రామ్మూర్తి చనిపోయాడు

అతని ఉత్తరక్రియలు దగ్గరుండి జరిపించాడు.

ఆ రోజుతో ఆ బంధం తెగిపోయింది.. శ్రాద్ధం రోజు బీదలకు అన్నదానం చేశాడు. అందుకుగాను వంట చేయటానికి రామ్మూర్తి కొడుకుల్ని పిలిపిం చాడు. చాలా గొప్పగా అన్నదానం జరిగింది. వంట చాలా రుచిగా ఉంది.

ఎన్నో ఏళ్ల తరువాత ఆ రోజు మళ్లీ సుష్టుగా భోజనం చేశాడు రవిచంద్ర. డబ్బు కోసం వచ్చి చేతులు కట్టుకు నిలబడ్డారు రామ్మూర్తి కొడుకులు.

“వంటచాలా బాగుంది. సుష్టుగా తిన్నాను. కానీ, రేపటికి నేను తిన్నది అరిగిపోతుంది. కానీ ఈ శ్రాద్ధ కర్మ ఎవరి కొరకైతే జరిగిందో ఆయన ఒక వంట వాడే. ఆ వంట మనిషి పేరేమిటో తెలుసా?”

“ఏమిటి?”

“రామ్మూర్తి! మీరు అన్నం పెట్టకుండా వెళ్లగొట్టిన మీ నాన్నగారు. ఆయనకు మీరు శ్రాద్ధకర్మలు చేసే అర్హత కోల్పోయారు. అందుకే వంటవాళ్లుగా పిలిపించాను.” అన్నాడు కటువుగా

“క్షమించండి. బాబుగారూ!” వాళ్లిద్దరూ ఒకేసారి అన్నారు. ఏమయితేనేమి రామ్మూర్తి లేడు. ఆ మొహాలలో ఎక్కడా పశ్చాతాప పడుతున్నట్లే లేదు. అందుకే వాళ్లు వెళుతున్నామని చెప్పినా తలెత్తి చూడలేదు రవిచంద్ర.

ఇక్కడితో ఈ జీవన నాటకంలోని ఈ అంకం పూర్తయింది.

* * *

ఒక వారం రోజులలో మరో కొత్త అంకానికి తెరలేచింది.

పిల్లలకి ఫోన్ చేసి చెప్పాడు. తను అమెరికా వస్తానని. వాళ్లు సంతోషపడ్డారు. పదేళ్ల వీసా ఉండటం వల్ల టికెట్టు కొనుక్కుని వెళ్లడమే. ఆ మాటకి అన్నా చెల్లెలు ఇద్దరూ ఆనంద పడ్డారు.

* * *

‘‘నాన్నా... మీరు...’’ రవిచంద్రను చూచి కూతురు నవ్య ఎగిరి గంతేసి చెంగున వచ్చి కౌగ లించుకుంది.

“నేనేనమ్మా! వచ్చేశాను. సమయం వచ్చినప్పుడు వస్తానని చెప్పాను గదా!”

“సమయానికి ఆయన ఊరు వెళ్లారు నాన్నా! ఎప్పుడూ ఆయన మిమ్మల్ని గురించే అనుకుం టుంటారు. ఉండండి. మీరొచ్చారని ఫోన్ చేసి వస్తాను.”

అతని గురించి చెప్పేటప్పుడు కూతురు సంతోషాన్ని గుర్తించాడు.

“పిల్లలేరమ్మా? స్కూలు నుంచి ఇంకా రాలేదా?

"అయిదయిందిగా?"

"ఆఫ్టర్ స్కూల్ కేర్‌లో ఉన్నారు వెళ్లి తీసుకుని రావాలి" అంది.

"అంటే నువ్వు కూడా ఉద్యోగంలో చేరావమ్మా?"

"అవును నాన్నా! వెన్నీళ్లకు చన్నీళ్లు వదులు కోవటం ఎందుకు? పైగా ఆయన ఆఫీసుకు, పిల్లలు స్కూలుకు వెళ్లాక ఉండి చేసేదేముంది?

తనతో మాట్లాడుతూనే పనులు చేసుకోవటం గమనించాడు. అచ్చు పద్మిని, పోలికలే ఇంటి పనుల్లో తల్లి ట్రైనింగ్ బాగా ఇచ్చిందని ఆనంద పడ్డాడు.

రాత్రి డిన్నర్‌కి టేబుల్ మీద అన్ని పదార్ధాలు పెట్టి రవిచంద్రకు మటుకు మిల్లెట్స్ పెట్టింది." అదేమిటమ్మా అది నాకు కూడా పెట్టు ఆ పథ్యాలు అవీ మీ అమ్మతోనే పోయాయి. ఇప్పుడు నేను అన్నీ తింటున్నాను. నాకిష్టమైనవి చేయించుకు తినటానికే నీదగ్గరి కొచ్చానసలు.

"పథ్యాలు మానేశారా? అయితే. ఇవాళ్ల నుండి మళ్లీ మొదలెట్టండి. అందుకే మీవంట స్పెషల్‌గా చేశాను. తెలుసా?"

ఒక్కో పదార్థాన్ని నోట్లో పెట్టుకొని రుచి చూచాడు. దేనిలోనూ కారం, ఉప్పూ, పులుపు లేదు.

రామ్మూర్తి వంట ఇంతకన్నా నయం.

రోజులు గడుస్తున్నాయి. పెద్ద వాడివి అనే పేరుతో పథ్యం భోజనం తింటున్నాడు. అది రవిచంద్రకు సహించటం లేదు.

"నాన్నా! నీ భోజనం టేబుల్ మీద పెట్టాను. పేపర్లు, పుస్తకాలు ఉన్నాయి. టీ.వీ. మ్యూజిక్ సిస్టం ఉన్నాయి. హాయిగా రెస్ట్ తీసుకో. నేను పిల్లల్ని తీసుకొని అయిదింటికి వచ్చేస్తా?" అని వెళ్లి పోయేది

సాయంత్రం అయిదింటికి పిల్లలతో వచ్చీరాగానే వాళ్ల పుస్తకాలు ముందేసుకొని కూర్చుంది. ఎనిమి దింటికి భోజనాలు. ఆ తరువాత ఎవరి గదుల్లోకి వాళ్లు వెళ్లిపోయేవారు. ఆ యాంత్రిక జీవితం గురించి తెలిసే వచ్చాడు. మరి అనుకోవటం ఎందుకు? ఇక్కడకు వచ్చాక తను ఒంటరి వాడిని అన్న భావన ఎక్కువ అయిపోయింది. లేదు దీనికి ఏదో మార్గం ఆలోచించాలి అనుకున్నాడు.

మూడు నెలలు భారంగా గడిచాయి. భరించలేక పోయాడు. "అమ్మా! నేనింక వెళ్లి వస్తానమ్మా!"

"ఏంనాన్నా! నా మీద కోపం వచ్చిందా? ఇక్కడే ఉండి పోతావనుకొన్నానే!"

"ఇప్పుడు కాదమ్మా! మరోసారి వచ్చినప్పుడు. ఇప్పుడు అన్న దగ్గరకు వెళ్తాను అన్నాడు.

"సరే నాన్నా!" అంటూ వీడ్కోలు పలికింది తండ్రికి.

* * *

"నాన్నగారూ! రండి, రండి. నీతూ! నీతూ!" భార్యని పిలిచాడు, కొడుకు సమీర్ "నాన్నగారి గది రెడీగా ఉంది కదా"



రవిచంద్రకి ఆకలితో కడుపు నకనకలాడు తోంది. డైనింగ్ రూమ్‌కి వెళ్లి సుష్టుగా తినాలనుకున్నాడు. అక్కడ సావిత్రిని చూసి ఈమె వంట ఎలా ఉంటుందో అనుకున్నాడు. "వడ్డించాను. భోంచేయండి." టేబుల్ మీద రక రకాల పదార్థాలు. అయితే ఒక్కటీ ఆయనకి తెలిసిన పదార్థం కాదు. "సావిత్రి గారూ ! ఏమి టండీ ఇవన్నీ." "రుచి చూడండి. మీకే తెలు స్తుంది." "ఊహూ ఏంతెలీలా. కానీ ఇవి నాకు సరిపోయేవి కాదు ఆ మిల్లెట్స్, పచ్చికూరలు తినలేనమ్మా, పెరుగు కాస్త వెయ్యండి."

"హా రెడీ", "రండి అంకుల్ మీ గది చూపిస్తాను" అని పైన మేడ మీద గదికి తీసుకుని వెళ్లింది.

ఏ.సీ. రూమ్ అటాచ్డ్ బాత్‌రూం. టీవీ, టెలిఫోన్, డబుల్ కాట్, మోడరన్ డ్రెస్సింగ్ టేబుల్... అన్ని టచ్ లేదా సెన్సార్‌తో ఉండే స్విచ్చులు. ఇంటర్ కం ఫోన్. ఇంద్రభవనం లాంటి ఇల్లు మరి. ఆ మాత్రం సౌకర్యాలు ఉంటాయి అనుకున్నాడు.

"మీకేం కావాలన్నా కాలింగ్ బెల్ నొక్కండి. ఇండియా నుంచి వచ్చి సావిత్రిగారు ఉన్నారు. ఆవిడ ఇక్కడ మనింట్లో మొత్తం డొమెస్టిక్ హెల్ప్ చేస్తారు. అతికష్టం మీద దొరికారు. మనకి ఆవిడ చాల వాల్యుబుల్. మీకు ఏదైనా నచ్చకపోతే నాకు చెప్పండి. ఆవిడకి డైరెక్ట్‌గా చెప్పకండి. బాగుండదు" అంది కోడలు నీతూ.

ఇంతలో బెల్ మోగింది. 'లోపలికి రావచ్చా? అన్న సంకేతపు మోత అది. అది తెలిసిన వెంటనే లోపలికి రావచ్చు అని ఇంగ్లీష్‌లో చెప్పాడు. తలుపు తట్టి "మే.. ఐ కమిన్ సార్!" అడుగుతూనే లోపలి కొచ్చింది. పంజాబీ డ్రెస్ వేసుకున్న ఒకావిడ "మీరు సమీర్ ఫాదర్ కదా"? అంది తెలుగులో

"హమ్మయ్యా మీరు తెలుగు వాళ్లా" అన్న దానికి సమాధానంగా తలూపింది. నీతూ చెప్పిన మాటలు గుర్తొచ్చి ఎక్కువ మాట్లాడకుండా ఉన్నాడు.

మధ్యాహ్నమవుతుండగా నీతూ ఫోన్ చేసింది. "హలో అంకుల్..! మీకింట్లో అంతా సౌకర్యంగా ఉంది కదా! మీరు ఎర్లీగా లంచ్ తీసుకుంటారు కదా! తీసుకోండి. డైనింగ్ రూమ్‌కి వెళతారా? రూంకి తెప్పించుకుంటారా? మీ ఇష్టం. నేను సాధ్యమయి నంత త్వరగా వస్తాను. బై..." అని పెట్టేసింది.

రవిచంద్రకి ఆకలితో కడుపు నకనకలాడు తోంది. డైనింగ్ రూమ్‌కి వెళ్లి సుష్టుగా తినాలను కున్నాడు. అక్కడ సావిత్రిని చూసి ఈమె వంట ఎలా ఉంటుందో అనుకున్నాడు.

"వడ్డించాను. భోంచేయండి." టేబుల్ మీద రకరకాల పదార్థాలు. అయితే ఒక్కటీ ఆయనకి తెలిసిన పదార్థం కాదు.

"సావిత్రి గారూ ! ఏమిటండీ ఇవన్నీ."

"రుచి చూడండి. మీకే తెలుస్తుంది."

"ఊహూ ఏంతెలీలా. కానీ ఇవి నాకు సరిపోయేవి కాదు ఆ మిల్లెట్స్, పచ్చికూరలు తినలేనమ్మా, పెరుగు కాస్త వెయ్యండి."

ఇదే తంతు రోజూ. ముందే ఊహించుకున్నాడు, అమ్మాయి ఇంట్లో అబ్బాయింట్లో పెద్ద తేడా ఉండదు. అంతా ఒక ఫార్మేట్‌లో ఉంటుంది. వీక్ ఎండ్స్ వస్తే ఏదో ఒక ప్రోగ్రాం. మొహమాటానికి రెండు, మూడుసార్లు వెళ్లాడు. ఆ తరువాత విసుగనిపించి ఇంట్లోనే ఉండిపోయాడు. నెమ్మదిగా సావిత్రితో పరిచయం పెరిగింది.

ఇద్దరూ కలిసి ఎన్నో విషయాలు మాట్లాడు కునేవారు. ఆమెది కూడా ఇంచు మించు రామ్మూర్తి లాంటి కథే, ఆ కథలో పిల్లలయితే ఇక్కడ తమ్ముళ్లు, చెల్లెళ్లు కోసం జీవితాన్ని పణంగా పెట్టిన ఓ పెద్దక్క కథ, ఆ తరువాత షరామామూలే !

* * *

అక్కడ అంతా కళ కళ లాడుతోంది. చక్కటి వంటలు ఘుమ ఘుమ లాడుతున్నాయి. అక్కడున్న పదిహేను మంది "రవి చంద్రకు జై, జై" అంటూ హర్షధ్వానాలు చేస్తున్నారు. ఈ హడావిడి అంతా ఏమిటంటే రవిచంద్ర తన ఇంటిని ఒక హోంగా మార్చేసి. తనలాంటి వాళ్లను ఒక పది మంది వరకు కలుపుకుని ఆరోగ్య సూత్రాలను పాటిస్తూ... చక్కటి భోజన సదుపాయం, మంచి ఫలహారాలు, అలవాటయిన వంటలనే, అందరికీ ఆరోగ్యంతో పాటు రుచికరంగా ఉండే ఏర్పాటు చేసాడు.

అమెరికాలో కొడుకు ఇంట్లో ఉన్న సావిత్రికి వీసా టైం అయిపోయింది. ఇండియాకు వచ్చాక ఎలా బతకడం అనుకున్న తరుణంలో, రవిచంద్ర మాట మీద, ఈ సహచరులలో తను ఒకరిగా చేరి అందరికి రుచికరమైన వంట చేసి పెడుతోంది.

రేపటి గురించి దిగులు లేకుండా జీవనసంధ్యలో ఉన్న వాళ్లంతా ఒకరికొకరు తోడుగా మసులుకో సాగారు.

వచ్చేవారం కథ..
**స్వయంకృతం**
– సావిత్రి కొవూరు






# ఒలింపిక్స్ బరిలో తెలుగింటి తారాజువ్వలు!

**పారిస్ ఒలింపిక్స్‌లో సత్తా చాటుకోవడానికి తెలుగింటి అథ్లెట్లు తహతహలాడుతున్నారు. దేశానికి ఏదో ఒక పతకం సాధించాలన్న లక్ష్యంతో పూర్తిస్థాయిలో సిద్ధమయ్యారు. గతంలో ఎన్నడూ లేని విధంగా తెలుగు రాష్ట్రాల అథ్లెట్లు అధిక సంఖ్యలో 2024 ఒలింపిక్స్‌లో పాల్గొనటానికి అర్హత సంపాదించారు.**

ప్రపంచ క్రీడల పండుగ 2024– ఒలింపిక్స్‌కు పారిస్ వేదికగా సన్నాహాలు పూర్తయ్యాయి. జూలై 26 నుంచి ఆగస్టు 11 వరకూ జరిగే ఈ క్రీడా సంరంభంలో 204 దేశాలకు చెందిన 10వేల మంది అథ్లెట్లు పాల్గొనబోతున్నారు. మన దేశం నుంచి 125 మందికిపైగా బరిలో నిలువనున్నారు. గత ఒలింపిక్స్‌ను మించి పతకాలు సాధించాలన్న లక్ష్యంతో మన అథ్లెట్లు పూర్తిస్థాయిలో సిద్ధమయ్యారు.

### ఇద్దరు పురుషులు.. నలుగురు మహిళలు!

వివిధ క్రీడాంశాలలో పాల్గొనటానికి అర్హత సాధించిన భారత అథ్లెట్లలో అరడజను మంది తెలుగు రాష్ట్రాల అథ్లెట్లు ఉండటం విశేషం. పురుషుల, మహిళల బ్యాడ్మింటన్, టేబుల్ టెన్నిస్ విభాగాలలో నలుగురు, బాక్సింగ్, అథ్లెటిక్స్ విభాగాలలో ఒక్కొక్కరు పోటీకి దిగబోతున్నారు. వీరిలో నలుగురు ఏదో ఒక పతకంతో తిరిగి వచ్చే అవకాశాలు ఎక్కువగా కనిపిస్తున్నాయి. బ్యాడ్మింటన్ పురుషుల డబుల్స్‌లో మహారాష్ట్రకు చెందిన చిరాగ్ షెట్టితో జంటగా పోటీకి దిగబోతున్న సాత్విక్ సాయిరాజ్ పతకంతో తిరిగిరావడం ఖాయమని భావిస్తున్నారు.

గత రెండేళ్ల కాలంలో ప్రపంచ బ్యాడ్మింటన్ కాంస్యం, కామన్వెల్త్ గేమ్స్, ఆసియాక్రీడల బంగారు పతకాలతో పాటు ప్రపంచ నంబర్ వన్ ర్యాంక్ సాధించిన సాత్విక్ సాయిరాజ్ జోడీ కాస్త అదృష్టంతో పాటు స్థాయికి తగ్గట్టుగా ఆడితే బంగారు పతకం సాధించడం ఏ మాత్రం కష్టం కాబోదు. ప్రస్తుతం ప్రపంచ 3వ ర్యాంక్‌గా ఉన్న ఈ జోడీ గత ఒలింపిక్స్ క్వార్టర్ ఫైనల్స్ చేరడంలో విఫలమైంది.

### స్వర్ణపతకానికి నిఖత్ జరీన్ గురి...

మహిళల బాక్సింగ్‌లో తెలంగాణా థండర్ బాక్సర్ నిఖత్ జరీన్ 50కిలోల విభాగంలో స్వర్ణపతకం సాధించడం ఖాయమని భారత బృందం భావిస్తోంది. ఇప్పటికే రెండుసార్లు ప్రపంచ చాంపియన్ టైటిల్స్ సంపాదించిన నిఖత్ ప్రస్తుతం జర్మనీలోని సార్ బ్రూకెన్ శిక్షణ శిబిరంలో గత నెల రోజులుగా సాధన చేస్తోంది. ఒలింపిక్స్ పతకంతో తన జీవితాన్ని సార్థకం చేసుకోవాలన్న పట్టుదలతో ఉన్న నిఖత్‌ను ఏదో ఒక పతకం తప్పక సాధిస్తారని విశ్వసిస్తున్నారు.

### మరో పతకానికి సింధు తహతహ....

ఒలింపిక్స్ బరిలో నిలవడం, పతకాలు సాధించడం తెలుగుతేజం పీవీ సింధుకు కొత్తేమీ కాదు. తన క్రీడాజీవితంలో చివరిసారి ఒలింపిక్స్ బరిలోకి దిగుతున్న సింధుకు 2016 రియో ఒలింపిక్స్ లో రజత, 2020 టోక్యో ఒలింపిక్స్‌లో కాంస్య పతకం సాధించిన ఘనత ఉంది. ఒలింపిక్స్ బ్యాడ్మింటన్ మహిళల సింగిల్స్‌లో రెండు పతకాలు సాధించిన తొలి, ఏకైక భారత మహిళగా నిలిచిన సింధు మరో పతకంతో తన ఒలింపిక్ ప్రస్థానానికి స్వస్తి పలకాలని భావిస్తోంది.

### ఒకే ఒక్క తెలుగు అథ్లెట్!

పారిస్ ఒలింపిక్స్ ట్రాక్ అండ్ ఫీల్డ్ అంశాలలో పాల్గొనే 28 మంది సభ్యుల భారత జట్టులో సాధించిన ఏకైక తెలుగు మహిళగా విశాఖ రన్నర్ జ్యోతి యర్రాజీ రికార్డు నెలకొల్పింది. మహిళల 100 మీటర్ల హర్డల్స్ రేస్‌లో భారత్‌కు ప్రాతినిథ్యం వహిస్తున్న తొలి మహిళా అథ్లెట్‌గా జ్యోతి చరిత్ర సృష్టించనుంది. ఒలింపిక్స్ ట్రాక్‌లోకి దిగుతున్న 11 మంది భారత మహిళా అథ్లెట్లలో 23 ఏళ్ల జ్యోతి యర్రాజీ తన ప్రపంచ ర్యాంకింగ్ ఆధారంగా పారిస్ ఒలింపిక్స్‌లో పాల్గొనటానికి అర్హత సంపాదించింది. భువనేశ్వర్‌లోని రిలయన్స్ అథ్లెటిక్స్ అకాడమీలో విదేశీ శిక్షకుల పర్యవేక్షణలో సాధన చేసిన ఆమెకు పతకం సాధించే అవకాశాలు అంతంత మాత్రంగానే ఉన్నాయి.

### టేబుల్ టెన్నిస్‌లో శ్రీజ ఆకుల...

భారత మహిళా టేబుల్ టెన్నిస్‌లో అత్యుత్తమ ర్యాంకర్‌గా నిలిచిన హైదరాబాదీ ప్లేయర్ 25 ఏళ్ల శ్రీజ ఆకుల తొలిసారిగా పారిస్ ఒలింపిక్స్‌లో పాల్గొనటానికి అర్హత సాధించడం ద్వారా గాల్లో తేలిపోతోంది. వ్యక్తిగత, టీమ్ అంశాలలో అదృష్టం పరీక్షించుకోనుంది. ప్రపంచ టేబుల్ టెన్నిస్ సమాఖ్య తాజా ర్యాంకింగ్స్ ప్రకారం 24వ స్థానంలో నిలిచిన శ్రీజకు గతంలోనే కామన్వెల్త్ గేమ్స్‌లో మిక్సిడ్ డబుల్స్‌లో బంగారు పతకం సాధించిన రికార్డు ఉంది.

### శరత్ కమల్‌కు అరుదైన గౌరవం...

పారిస్ వేదికగా జరిగే ఒలింపిక్స్ ప్రారంభ వేడుకల్లో పాల్గొనే భారత బృందానికి తెలుగుతేజం ఆచంట శరత్ కమల్ పతాకధారిగా వ్యవహరించనున్నాడు. 40 ఏళ్ల వయసులో ఈ అరుదైన గౌరవం దక్కించుకొన్నాడు.. క్రీడాజీవితంలో ఆఖరి ఒలింపిక్స్‌లో పాల్గొంటున్న 40 ఏళ్ల శరత్ కమల్‌కు ఒలింపిక్స్‌లో పాల్గొనడం ఇది ఆరోసారి. పశ్చిమ గోదావరి జిల్లాలో జన్మించినా వృత్తిరీత్యా చెన్నైలో స్థిరపడిన శరత్ కమల్‌కు గత రెండు దశాబ్దాలుగా భారత్‌కు పలు అంతర్జాతీయ క్రీడల్లో ప్రాతినిథ్యం వహించిన ఘనమైన రికార్డు ఉంది. 2004 ఏథెన్స్ ఒలింపిక్స్ కు తొలిసారిగా అర్హత సాధించిన శరత్.. 2008 బీజింగ్, 2016 రియో ఒలింపిక్స్, 2020 టోక్యో ఒలింపిక్స్‌లో కూడా భారత్‌కు ప్రాతినిథ్యం వహించాడు. ఇప్పుడు పారిస్ ఒలింపిక్స్‌లో పాల్గొనడం ద్వారా ఐదు వేర్వేరు ఒలింపిక్స్‌లో పాల్గొన్న క్రీడాకారుడిగా అరుదైన గౌరవాన్ని దక్కించుకోబోతున్నాడు. పారిస్ ఒలింపిక్స్‌లో పాల్గొనబోతున్న ఆరుగురు తెలుగు అథ్లెట్లు అత్యుత్తమంగా రాణించడం ద్వారా పతకాలు సాధించి ఉభయ తెలుగు రాష్ట్రాలకు గర్వకారణంగా నిలవాలని కోరుకొందాం. ★



క్రీడా కృష్ణ, 84668 64969
సీనియర్ జర్నలిస్ట్

**'గురువు' అంటే అంధకారంలోంచి వెలుగులోకి నడిపించేవాడన్నది హిందువులలోని సాధారణ అవగాహన. అందుకే, భగవంతుడికి కోపం వచ్చినా పర్లేదు కానీ, గురువుకు వస్తే కష్టమని హిందువులు విశ్వసిస్తారు. గురు ఆశీర్వచనం ఉంటే, తిరుగుండదని కూడా నమ్మకం. ఇటువంటి నమ్మకాలే అమాయక ప్రజలు బాబాల చుట్టూ తిరిగేలా చేస్తుంటాయి. హథ్రాస్‌లో జరిగింది కూడా అదే. తమను ఉద్ధరిస్తాడని భావించి, తమ గురువు సత్సంగానికి పోటెత్తిన భక్తులలో 121మంది కైలాసానికి చేరుకున్నారు. 'భోలే బాబా' అనే గురువు పాద ధూళి కోసం మహిళలు పోటీపడి తోసుకోవడం వల్లనే ఈ తొక్కిసలాట జరిగిందని తొలుత వార్తలు వచ్చాయి. అయితే, కొంచెం లోతుగా తొంగి చూస్తే ఈ ఘటనలో పలు కోణాలు కనిపిస్తాయి.**



# హథ్రాస్ తొక్కిసలాట: మూఢత్వమే ముప్పుగా పరిణమిం

ఉత్తర్‌ప్రదేశ్‌లోని హథ్రాస్‌లో జులై 2న జరిగిన ఒక పూజా కార్యక్రమానికి భక్తులు హాజరైన సందర్భంలో ఈ ఘటన చోటు చేసుకుంది. శివపూజ కోసం ఈ కార్యక్రమాన్ని రతిభన్‌పూర్‌లో ఏర్పాటు చేశారు. సత్సంగం, పూజ పూర్తి అయిన వెంటనే బాబా బయలుదేరి వెళ్లడంతో ఆయన పాదధూళి కోసం భక్తులు విరగబడడంతో ఈ ఘటన చోటు చేసుకుంది. అలా బయలుదేరి వెళ్లిన బాబా జాడలు నాలుగురోజులు తెలియలేదు. జాటవ సమాజ దళితులలో అత్యంత ప్రాచుర్యం పొందిన గురువుగా భోలే బాబా పేరు సంపాదించుకున్నారు. ఆయన సత్సంగమంటే భక్తులు పోటెత్తుతారు. ఆ రోజు కార్యక్రమానికి ఏర్పాట్లు చేసిన బాబా సంస్థవారు ప్రభుత్వ అధికారుల నుంచి అనుమతి తీసుకునే సందర్భంలో 80వేల మంది వస్తారని అందుకు తగిన అనుమతి తీసుకున్నారు. కాగా, సమయానికి రెండు లక్షలకు పైగా ప్రజలు అక్కడకు చేరుకోవడంతో ఈ దుర్ఘటన చోటు చేసుకుంది.

ఘటన జరిగిన వెంటనే ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ తక్షణమే సిట్ దర్యాప్తుకు ఆదేశించి, 24 గంటలలోగా తనకు నివేదిక ఇవ్వాలని ఆదేశించారు. పార్లమెంటులో ప్రసంగిస్తున్న ప్రధాని మోదీ కూడా తన ప్రసంగాన్ని నిలిపివేసి, బాధిత కుటుంబాలకు సానుభూతి తెలియచేసి, అన్ని రకాలుగా సాయం చేస్తామని హామీ ఇచ్చారు. కాగా, ఈ ఘటనపై నమోదైన ఎఫ్ఐఆర్‌లో బాబా పేరు లేకపోవడాన్ని పలువురు ఎత్తి చూపుతున్నారు. అఖిలేష్ యాదవ్ వంటి రాజకీయ నాయకుల అండదండలు ఉండటం వల్లనే వారు ఇలా తప్పించుకుంటున్నారనే విమర్శలూ వస్తున్నాయి.

కార్యక్రమానికి అనుకున్న సంఖ్యకు మించి జనాలను అనుమతించడమే ఈ పరిస్థితికి దారితీసిందని ఈ ఘటనపై దర్యాప్తు చేసిన సిట్ బృందం స్పష్టం చేసింది. కేవలం 80వేల మంది కోసం అనుమతి తీసుకున్న బాబా యంత్రాంగం దాదాపు రెండు లక్షల మందిని అనుమతించిందని కూడా నివేదిక పేర్కొంది. విడిగా, అలహాబాద్ హైకోర్టు మాజీ న్యాయమూర్తి బ్రిజేష్‌కుమార్ శ్రీవాస్తవ, రిటైర్డు ఐపీఎస్ అధికారి హేమంత రావు అధ్యక్షతన న్యాయకమిషన్ దర్యాప్తు చేసింది. గత ఆదివారం, వారు స్థానికులను, ప్రజలను, అధికారులను, ఈ దుర్ఘటనకు సంబంధించిన సాక్షులను కలుసుకొని సమాచారం సేకరించారు.

ప్రతి ఏడాదీ దేశంలో పలు ఉత్సవాలు జరుగుతుంటాయి. కానీ ప్రతిసారీ ఇటువంటి దుర్ఘటనలు చోటు చేసుకోవు. అందుకు కారణం ప్రభుత్వ జిల్లా యంత్రాంగం రానున్న జనాభాను అంచనా వేసుకొని, ఆ మేరకు ఏర్పాట్లకు అనుమతి ఇస్తారు. ఇక్కడ అంచనా తప్పు కావడం, అనూహ్యంగా వచ్చిన వచ్చిన జనాన్ని నియంత్రించేందుకు బాబా మనుషుల శక్తి చాలకపోవడం, వారి అలసత్వమే ఈ ఘటనకు కారణమయ్యాయి.

**బాబాపై ఆరోపణలు**

నారాయణ సాకార్ హరి ఉరుఫ్ సూరజ్ పాల్ ఉరుఫ్ భోలేబాబా సరిగ్గా ఇరవై నాలుగేళ్లకిందట మరణించిన ఒక 15 ఏళ్ల యువతిని తిరిగి బతికిస్తానని హామీ ఇచ్చిన నేపథ్యంలో వచ్చిన ఫిర్యాదును అనుసరించి నాటి ఆగ్రా పోలీసులు అతడిని అరెస్టు చేశారట. ఈ విషయాలు నాటి రిటైర్డ్ డిఎస్పీ తేజ్‌వీర్ సింగ్ వార్తా పత్రికలకు వెల్లడించడంతో ఇప్పుడు వెలుగులోకి వచ్చాయి. అలాగే, భోలేబాబా పోలీసు విభాగంలోనే పని చేశాడని, తర్వాత సస్పెండ్ అయ్యాడనే వార్తలూ వచ్చాయి. ఏది ఏమైనప్పటికీ, అనంతరకాలంలో 'భోలేబాబా' పేరుతో ఉత్తరప్రదేశ్‌లో ప్రాచుర్యం పొంది, పెద్ద ఆశ్రమాన్ని నెలకొల్పాడు.

**విషం చల్లారు, బాబా న్యాయవాది ఆరోపణ**

ఈ దుర్ఘటన వెనకాల కుట్ర ఉందని భోలేబాబా న్యాయవాది ఏపీ సింగ్ ఆరోపిస్తున్నాడు. తాము సత్సంగానికి అనుమతి తీసుకున్నామని, అనుమతి పత్రంలో మ్యాప్‌ను కూడా జోడించారని ఆయన అంటున్నాడు. బాబాకు వ్యతిరేకంగా కుట్ర జరిగిందని, విషాన్ని ఆ సమయంలో ఎవరో స్ప్రే చేయడం వల్లనే మహిళలు పడిపోయి, మరణించారని ఆయన ఆరోపించాడు. సుమారు 15-16మంది వ్యక్తులు ఈ కుట్రలో జోక్యాన్ని కలిగి ఉన్నారని, అందులో 10-12మంది విషాన్ని స్ప్రే చేశారని ఆయన ఆరోపించాడు. చాలామంది సాక్షులు మహిళలు పడిపోవడాన్ని చూశామని, అనేకమంది ఊపిరందక మరణించారని చెప్తున్నారని ఆయన అన్నాడు. తొక్కిసలాట జరుగుతున్న సమయంలో కొన్ని, గుర్తు తెలియని వాహనాలు అక్కడ ఉన్నాయని, తర్వాత మాయమయ్యాయని కూడా ఆరోపించాడు. ఈ ప్రాంగణంలోని సిసిటివి ఫుటేజ్‌ను తక్షణమే



# చింది..

స్వాధీనం చేసుకుంటే, వాహనాలను గుర్తించవచ్చని ఆయన పేర్కొన్నాడు.

**ప్రధాన నిందితుడి అరెస్టు**

కాగా, కీలక నిందితుడైన దేవప్రకాష్ మధుకర్ సహా ఇద్దరు వ్యక్తులను ఈ ఘటనకు సంబంధించి 14 రోజుల జ్యుడిషియల్ కస్టడీకి పంపారు. పోలీసుల సమాచారం ప్రకారం మధుకర్ బాబా కార్యక్రమాలకు నిధులను సేకరిస్తుండేవాడు.

**మౌనం వీడిన భోలేబాబా**

దుర్ఘటన జరిగిన నాలుగురోజుల తర్వాత భోలేబాబా తన మౌనాన్ని వీడారు. ఆ భగవంతుడిపైన, జిల్లా యంత్రాంగంపైనా నమ్మకం ఉంచమని ఆయన తన సందేశమిచ్చాడు. ఈ బాధను భరించేందుకు మనకు ఆ భగవంతుడు శక్తిని ఇవ్వాలని కోరుకుంటున్నానని, ప్రభుత్వం, అధికారు లపై నమ్మకముంచమనీ ఓదార్చాడు. ఈ గందర గోళాన్ని సృష్టించినవారెవరినీ విడిచిపెట్టరనే నమ్మకం తనకుందంటూ బాబా విశ్వాసం వ్యక్తం చేశారు. బాధిత కుటుంబాలకు అండగా నిలవ వలసిందిగా తాను కమిటీ సభ్యులను కోరానని కూడా వెల్లడించాడు.

**రాజకీయ నాయకుల హడావిడి**

భోలేబాబా భక్తులలో ప్రధానంగా జాటవ సమాజానికి చెందినవారు ఎక్కువ. వారు ఉత్తర ప్రదేశ్‌లో ప్రధానమైన ఓటు బ్యాంకు. మొన్నమొన్నటి వరకూ బీఎస్పీకి ప్రధాన ఓటుబ్యాంకుగా ఉన్నవారు హఠాత్తుగా భోలేబాబా సత్సంగానికి వెళ్లి ఆయనకు సన్నిహితుడనన్నట్టు వ్యవహరించిన అఖిలేష్ పార్టీకి ఓట్లు వేసి, యుపిలో గెలిపించారు. ఇప్పుడు ఈ విషాదంలో కూడా ఓట్లు ఏరుకునేందుకు రాహుల్ గాంధీ బయలుదేరి వెళ్లాడు. ఒక రాజకీయ నాయకుడిగా, ప్రతిపక్ష నేతగా అది అతడి బాధ్యత కూడా. ఈ విషయాన్ని రాజకీయం చేయనని చెప్తూనే, వ్యవస్థలో కొన్ని లోటుపాట్లు ఉన్నాయని, ఆ నిరుపేద కుటుంబాలకు మరింత నష్టపరిహారాన్ని, త్వరితగతిన ఇవ్వాలని డిమాండ్ చేశాడు.

ఆధునిక బాబాల విషయంలో రాజకీయ నాయకులు అప్రమత్తంగా ఉంటారు. శంకరాచార్యుల వంటి ప్రాచీన మఠాలకు చెందిన ఆచార్యులకు కాకుండా ఇటువంటి గురువులకు అండదండలుగా ఉంటూ క్విడ్ ప్రో కో అన్నట్టుగా ఓట్లను, నోట్లను లేదా రక్షణను ఇచ్చిపుచ్చుకుంటున్నారు. ప్రతి ఆధునిక గురువు మోసగాడు అని గట్టిగా చెప్పలేం కానీ, వెలుగులోకి వచ్చే అనేకానేక ఘటనలు దానినే సూచిస్తుంటాయి. ఏమైనప్పటికీ, హిందూ ధర్మంలో గురువులకు ఉన్న ప్రాముఖ్యత కారణంగానే గురువునని చెప్పుకున్న ప్రతివారికీ గౌరవం దక్కుతోంది.

భారతదేశంలో అత్యంత ఘోరమైనదానిగా ప్రస్తుత ఘటనను మనం భావిస్తున్నప్పటికీ, ఆధునిక చరిత్ర ఇటువంటి ఘటనలు ప్రపంచవ్యాప్తంగా చోటు చేసుకున్నాయి. అవేమిటో చూద్దాం –

**దక్షిణ కొరియా, సియోల్ 2022**

ఆ ఏడాది వచ్చిన హాలోవీన్ పండుగనాటి రాత్రి దాదాపు లక్షమంది ప్రజ లు సియోల్ నగరంలోని ఇటవాన్ ప్రాంతంలోని ఇరుకు సందుల్లో గుమిగూడారు. ఆ ఇరుకు ప్రదేశంలోకి జనాలు ప్రవాహంలా చొచ్చుకువస్తుం డడంతో తొక్కిసలాట జరిగి, 158మంది మరణించగా, 500మంది గాయపడ్డారు.

**వైష్ణోదేవి ఆలయం-2022**

2022 నూతన సంవత్సరం సందర్భంగా పెద్ద సంఖ్యలో భక్తులు మాతా వైష్ణోదేవి ఆలయానికి ఆశీర్వచనంకోసం రావడంతో తొక్కిసలాట జరిగింది. అధికారిక నివేదికల ప్రకారం, పెద్ద సంఖ్యలో భక్తులు రావడం మొదలయ్యేసరికి ఈ ఘటన చోటు చేసుకుంది. దాదాపు 12మంది ఈ ఘటనలో మరణించగా, 14మంది గాయపడ్డారు.

**మక్కాలోని హజ్‌లో ఘటన -2015**

సెప్టెంబర్ 2015లో మక్కాలో దాదాపు పది నిమిషాలపాటు సాగిన తొక్కిసలాటలో దాదాపు 2,411 యాత్రికులు మరణించినట్టు వార్తలు వచ్చారు. ఈ లెక్కలు సౌదీ అరేబియా విడుదల చేసిన గణాంకాలకన్నా మూడు రెట్లు ఎక్కువ. ఈ తొక్కిసలాట తర్వాత వందలాదిమంది యాత్రికులు కనిపించకుండాపోయారు. అధికారిక నివేదిక ప్రకారం, రెండు వైపుల నుంచి వస్తున్న భక్తులు ఒక సన్నటి రోడ్డు వద్ద కలవడంతో మొదలైంది. తాము జనాన్ని నియంత్రించేందుకు సిద్ధంగా ఉన్నామని ప్రకటించి, బిలియన్ల దానికోసం ఖర్చు పెట్టినా అంత పెద్ద సంఖ్యలో వచ్చిన భక్తులను నియంత్రించడం అధికారులకు కష్టమైంది. మరణించినవారిలో 120మంది భారత్‌కు చెందినవారు.

**ఆంధ్రప్రదేశ్‌లో గోదావరి పుష్కరాలు-2015**

గోదావరి నది ఒడ్డున జరిగిన మహాపుష్కరాల సందర్భంగా జరిగిన ఈ ఘటనలో 29మంది ప్రాణాలు కోల్పోగా, 60మంది గాయపడ్డారు. రాజమండ్రిలో ఉదయం 8 గంటలకు రాష్ట్రముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు గోదావరిలో పుణ్యస్నానమాచరించిన వెంటనే ఈ ఘటన చోటు చేసుకుంది. తమ చెప్పులను వెతుక్కుంటున్న భక్తులపై జనం వచ్చి పడడంతో తొక్కిసలాట జరిగిందని వార్తలు చెప్తున్నాయి. వేలమంది ప్రజలు నదిలో స్నానం చేసుకునేందుకు ముందుకు తోసుకువెళ్లారు.

**రతన్‌గఢ్ ఆలయం, మధ్యప్రదేశ్ -2013**

నవరాత్రి పండుగ సందర్భంగా ఎంపీలోని దతియా జిల్లాలోని రతన్‌గఢ్ ఆలయంలో దర్శనం చేసుకునేందుకు వచ్చిన భక్తులు తోసుకోవడంతో ఏర్పడిన తొక్కిసలాటలో 111మంది ప్రాణాలు కోల్పోగా, 100మంది గాయపడ్డారు. భక్తులు నడుస్తున్న బ్రిడ్జి కూలిపోబోతోందంటూ వదంతులు రావడంతో భక్తులు తోసుకున్నారు.

**తొక్కిసలాటలు ఎందుకు జరుగుతాయి?**

చిన్న స్థలంలో లెక్కకు మించిన ప్రజలు ఉన్నప్పుడు ప్రధానంగా ఇటువంటి ఘటనలు చోటు చేసుకుంటాయి. ప్రాంగణాన్ని మించి జనం వచ్చినప్పుడు అది ప్రమాదకర పరిస్థితులకు దారి తీయవచ్చు. అదనంగా సరైన ప్రణాళిక లేకపోవడం, జనాన్ని నియంత్రించలేకపోవడం సమస్యను రెట్టింపు చేస్తాయి. అలాగే, పెద్ద శబ్దం, అనూహ్యమైన ఘటన, వదంతులు ప్రజలు హఠాత్తుగా కదిలేందుకు కారణమై తొక్కిసలాటకు దారి తీస్తాయి. హథ్రాస్‌లో జరిగిన ఘటనలో కూడా పెద్ద సంఖ్యలో భక్తులు ఆయన పాదధూళి సేకరించేందుకు చొచ్చుకురావడంవల్ల జరిగిందనేది అర్థమవుతోంది. భద్రతా సిబ్బంది వారు బాబా దగ్గరకు వెళ్ళకుండా అడ్డుకోవడంతో జనం ఒకరిపై ఒకరు పడిపోవడం, జనాలు ఆ ఉన్మాదంలో వారిపై నుంచే వెళ్లడంవంటి కారణాల వల్ల ఈ ఘటన జరిగింది. కాగా, పాలనా యంత్రాంగం, పోలీసుల నుంచి తక్షణ స్పందన లేకపోవడంవల్ల కూడా ఇటువంటివి పెద్దవి అవుతాయి.

– జాగృతి డెస్క్

# బాలజాగృతి

## తెలుసుకుందాం

# పాతాళేశ్వర్ ఆలయం - బిహార్



శివుడికి అంకితమిచ్చిన పాతాళేశ్వర్ ఆలయం బిహార్‌లోని హాజీపూర్ నగరం జాధువా రోడ్‌లో కొలువు దీరింది. పరమ శివుడు ఇక్కడ లింగ రూపంలో కొలువై ఉన్నాడని భక్తుల విశ్వాసం. ఈ శివలింగం స్వయంభువుగా వెలసిందని పురాణాలు చెబుతున్నాయి. ఏటా శివరాత్రి సందర్భంగా ఇక్కడ ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. ఈ సందర్భంగా భక్తులు అధిక సంఖ్యలో వస్తుంటారు.

## కథ | శశాదుడు



ఇక్ష్వాకుమహారాజుకు వందమంది కుమారులు. వారిలో పెద్దవాని పేరు వికుక్షి. తండ్రి మాటకు కట్టుబడి ఉండేవాడు. కులగురువైన వశిష్ఠునివద్ద సర్వవిద్యలను అభ్యసించాడు. ఒకనాడు ఇక్ష్వాకుడు పితృదేవతలకు పిండం పెట్టదలచి అష్టకమనే పుణ్యకార్యం చేయ సంకల్పించాడు. తన సంకల్పాన్ని కులగురువైన వశిష్ఠునికి చెప్పాడు. అంత వశిష్ఠుని వచనానుసారం పరిశుద్ధమైన మాంసాన్ని తెమ్మని వికుక్షిని వనానికి పంపించాడు.

వికుక్షి వనానికి వెళ్లి మృగాలను వేటాడాడు. ఆకలి అవటంతో ఒక కుందేలు మాంసాన్ని భక్షించాడు. మిగతా మాంసం తెచ్చి తండ్రికిచ్చాడు. వశిష్ఠుడు తన దివ్యశక్తితో వికుక్షి కుందేలు మాంసాన్ని తిని మాంసం మొత్తాన్ని ఎంగిలి చేసాడు. కావున ఈ మాంసం అష్టక శ్రాద్ధానికి పనికిరాదన్నాడు.

ఇక్ష్వాకుని కులగురువు మాటలను విని వికుక్షిని దేశం నుండి బహిష్కరించాడు. ఆ

## పద్యం

**అవయవ హీనుని సౌంద**
**ర్యవిహీను దరిద్రు విద్యరాని యతని సం**
**స్తవనీయు, దేవు శ్రుతులన్**
**భువి నిందింప దగదండ్రు బుధులు కుమారా!**

**భావం :** ఓ కుమారా! లోకంలో వికలాంగులను, అందంగా లేనివారిని, ధనం లేని వారిని, విద్య రాని వారిని, గౌరవించదగిన వారిని, భగవంతుడిని, పవిత్ర గ్రంథాలను నిందింపరాదని పెద్దల మాట.

## శ్లోకం

**మృత్పిణ్డ ఏకో బహుభాణ్డరూప**
**స్సువర్ణ మేకం బహుభూషణాని**
**గోక్షీర మేకం బహుధేనుజాత**
**మేకః పరాత్మా బహుదేహవర్తీ**

**భావం :** కుండలు వేరైనా మన్ను ఒక్కటే. నగలు వేరైనా బంగారం ఒక్కటే. ఆవులు వేరైనా పాలు ఒక్కటే. అలాగే, దేహాలు వేరైనా పరమాత్మ ఒక్కడే.

## జతపరచండి

ఇక్కడున్న పదాలకు పక్కనున్న పదాల్లో ఏవి సరిపోతాయో కనుక్కోండి.

| | |
|---|---|
| ఆంధ్రమహిళ | దేవనాంప్రియ |
| అశోకుడు | దుర్గాబాయి |
| రవీంద్రనాథ్ ఠాగూర్ | దేశభక్త |
| శివాజీ | విశ్వకవి |
| కొండా వెంకటప్పయ్య | ఛత్రపతి |

(తలకిందులుగా ముద్రించబడింది:) జవాబులు: ఆంధ్రమహిళ–దుర్గాబాయి; అశోకుడు–దేవనాంప్రియ; రవీంద్రనాథ్ ఠాగూర్–విశ్వకవి; శివాజీ–ఛత్రపతి; కొండా వెంకటప్పయ్య–దేశభక్త

నిర్వహణ : నయనశ్రీ

## భారత స్వాతంత్ర్య సమరయోధులు

### తులసిదాస్ జాదవ్



మహారాష్ట్రకు చెందిన ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధుడు తులసిదాస్ జాదవ్ 1905 జనవరి 25న జన్మించారు. షోలాపూర్ నుండి స్వాతంత్ర్య సమరంలో పాల్గొన్న చురుకైన నాయకులలో ఈయన కూడా ఒకరు. మహాత్మాగాంధీ ఉప్పు సత్యాగ్రహం ఉద్యమాన్ని ప్రారంభించినప్పుడు తులసిదాస్ జాదవ్ చురుగ్గా పాల్గొన్నారు. వివిధ ఉద్యమాల్లో పాల్గొన్నందుకు గానూ 1931, 1932, 1941, 1942లలో జైలు శిక్ష అనుభవించారు. 1999 సెప్టెంబర్ 11న మరణించారు.



తర్వాత ఆతను వనానికి వెళ్లి మంచి మాంసం తెచ్చి పిండకార్యక్రమం ముగించాడు. ఆపై చాలాకాలం రాజ్యాన్ని చక్కగా పరిపాలించి ఆపోమార్గాన తనువు విడిచాడు. తండ్రి మరణానంతరం వికుక్షి కులగురువైన వశిష్ఠుని మాటననుసరించి నగరానికి తిరిగి వచ్చి రాజ్యాన్ని చక్కగా పరిపాలించాడు. కుందేలును తిన్నందువలన శశాదుడనే పేర ప్రసిద్ధి చెందాడు. శశాదుడు అనేక యజ్ఞాలు చేసి శ్రీహరిని మెప్పించాడు. అంత శ్రీహరి అతని కుమారుని రూపాన కకుత్సుడు అనే పేరుతో భూమిపై వెలసి రాక్షస సంహారం చేశాడు. ★

## జనరల్ నాలెడ్జ్

1. భూదానోద్యమాన్ని ఎవరు ప్రారంభించారు?
2. కాంగ్రా లోయ ఏ రాష్ట్రంలో ఉంది?
3. సీబీఐని విస్తరించండి.

సమాధానాలు : 1.వినోభాభావే 2. హిమాచల్ ప్రదేశ్ 3. సెంట్రల్ బ్యూరో ఆఫ్ ఇన్వెస్టిగేషన్.

## మెదడుకు మేత

ఆరామడల నుంచి
అల్లుడు వస్తే
అత్తగారు వడ్డించింది
విత్తులేని కూర..
ఏమిటది?

జవాబు : పుట్టగొడుగులు


## మంచిమాట

పని చెయ్యాలనుకునేవారికి
దారి దొరుకుతుంది..
చెయ్యొద్దనుకునేవారికి
సాకు దొరుకుతుంది!




# వారఫలాలు

15-21 జూలై 2024



సింహంభట్ల సుబ్బారావు
6300674054

**మేషం : అశ్విని, భరణి, కృత్తిక 1వ పాదం**

కొత్తగా చేపట్టిన కార్యక్రమాలు అనుకున్న సమయానికి పూర్తి. రాబడి ఉత్సాహాన్నిస్తుంది. నిరుద్యోగులకు శుభవార్తలు అందుతాయి. మిత్రులను కలుసుకుని పాతజ్ఞాపకాలు నెమరు వేసుకుంటారు. వాహనాలు కొనుగోలు చేస్తారు. సోదరులతో వివాదాలు సర్దుకుంటాయి. వ్యాపారులకు లాభాలు దక్కే సూచనలు. ఉద్యోగులకు శుభ సమాచారం. 19,20 తేదీల్లో శారీరక రుగ్మతలు. ఆకస్మిక ప్రయాణాలు. ఆంజనేయ దండకం పఠించండి.

**వృషభం : కృత్తిక 2,3,4 పాదాలు, రోహిణి, మృగశిర 1,2 పాదాలు**

ముఖ్యమైన కార్యక్రమాలు సకాలంలో పూర్తి. రాబడి మునుపటి కంటే పెరుగుతుంది. దూర ప్రాంతాలనుంచి శుభవార్తలు అందుతాయి. వాహనాలు, ఆభరణాలు కొనుగోలు చేస్తారు. బంధువులతో సత్సంబంధాలు. నిరుద్యోగులకు ఇంటర్వ్యూలు. వ్యాపారులకు పెట్టుబడులు పెరుగు తాయి. పరిశోధకులకు అవకాశాలు దక్కవచ్చు. 20,21 తేదీల్లో వృథాఖర్చులు. ఆకస్మిక ప్రయాణాలు. అంగారక స్తోత్రాలు పఠించండి.

**మిథునం : మృగశిర 3, 4 పాదాలు, ఆర్ద్ర, పునర్వసు 1, 2, 3 పాదాలు**

అనుకున్న సమయానికి నిర్ణయాలు అందర్నీ ఆశ్చర్యపరుస్తారు. ఇంటిలో శుభకార్యాల నిర్వహణపై చర్చిస్తారు. నిరుద్యోగులు,విద్యార్థులకు నూతనావకాశాలు. చిన్ననాటి స్నేహితులను కలుసుకుంటారు. దేవాలయాలు సందర్శన. వ్యాపారులకు లాభాలు. ఉద్యోగులకు విధుల్లో ప్రోత్సాహకరంగా ఉంటుంది. పారిశ్రామిక,రాజకీయవర్గాలకు కలిసి వస్తుంది. క్రీడాకారులకు ఆదరణ. 15,16 తేదీల్లో దూరప్రయాణాలు. కనకధారా స్తోత్రాలు పఠించండి.

**కర్కాటకం: పునర్వసు 4వ పాదం, పుష్యమి, ఆశ్లేష**

మీ కష్టానికి తగిన ఫలితం దక్కుతుంది. చేపట్టిన కార్యక్రమాలు అనుకున్న సమయానికి పూర్తి చేస్తారు. ఆస్తుల వివాదాల నుంచి క్రమేపీ బయటపడతారు. తీర్థయాత్రలు చేస్తారు. ఆత్మీయుల నుంచి ఆహ్వానాలు అందుతాయి. వ్యాపారులకు ఆశించిన లాభాలు. ఉద్యోగులకు పనిభారం కాస్త తగ్గవచ్చు. కళాకారులకు నూతనోత్సాహం. క్రీడాకారులు, పరిశోధకులకు విజయాలు. 17,18తేదీల్లో ప్రయాణాలలో మార్పులు. సుబ్రహ్మణ్యాష్టకం పఠించండి.

**సింహం : మఖ, పుబ్బ, ఉత్తర 1వ పాదం**

కార్యక్రమాలు విజయవంతంగా పూర్తి చేస్తారు. ఆదాయం కొంత పెరిగి ఖర్చులు అధిగమిస్తారు. సోదరులతో ఆస్తులపై ఒప్పందాలు చేసుకుంటారు. ఇంటి నిర్మాణయత్నాలు చేస్తారు. ఆధ్యాత్మిక కార్యక్రమాలలో పాల్గొంటారు. వ్యాపారులకు కొత్త పెట్టుబడులు. పరిశోధకులు, క్రీడా కారులకు మరింత సానుకూలమైన కాలం. 19,20 తేదీల్లో అనుకోని ఖర్చులు. ఆదిత్య హృదయం పఠించండి.

**కన్య : ఉత్తర 2, 3, 4 పాదాలు, హస్త, చిత్త 1,2 పాదాలు**

కుటుంబసభ్యులతో ముఖ్య విషయాలు చర్చిస్తారు. మీపై కొందరు వ్యతిరేక భావాలు వ్యక్తం చేయవచ్చు. శారీరక రుగ్మతలు కొంత బాధిస్తాయి. వ్యాపారులకు పెట్టుబడుల్లో నిదానం అవసరం. ఉద్యోగులకు అదనపు బాధ్యతలు తప్పకపోవచ్చు. రాజకీయ వేత్తలకు కొన్ని అంచనాలలో పొరపాట్లు. 20,21 తేదీల్లో శుభవార్తా శ్రవణం. విందు వినోదాలు. గణేశాష్టకం పఠించండి.

**తుల : చిత్త 3,4 పాదాలు, స్వాతి, విశాఖ 1,2,3 పాదాలు**

ఆదాయమార్గాలు మరింత పెరుగుతాయి. కొత్త కార్యక్రమాలను సకాలంలో పూర్తి. సమాజంలో గౌరవ ప్రతిష్ఠలు. ప్రత్యర్థులను అనుకూలు రుగా మార్చుకుంటారు. వ్యాపారులకు విస్తరణ యత్నాలు. రాజకీయవేత్తలకు అవకాశాలు ఉత్సాహా న్నిస్తాయి. రచయితలు, క్రీడాకారులు ప్రతిభా పాటవాలు నిరూపించుకుంటారు. 17,18 తేదీల్లో ఆస్తి వివాదాలు. స్వల్ప అనారోగ్యం. శ్రీకృష్ణాష్టకం పఠించండి.

**వృశ్చికం : విశాఖ 4వ పాదం, అనూరాధ, జ్యేష్ఠ**

ఆదాయం క్రమేపీ పెరుగుతుంది. ఆధ్యాత్మిక కార్యక్రమాలలో పాల్గొంటారు. భూముల విషయంలో ఒప్పందాలు చేసుకుంటారు. వ్యాపారులకు లాభ నష్టాలు ఉంటాయి. ఉద్యోగులకు బాధ్యతలు పెరిగినా సమర్థతను చాటుకుంటారు. పారిశ్రామికవేత్తలకు కొంత ఉపశమనం. రచయితలు, క్రీడాకారులకు అవకాశాలు దక్కవచ్చు. 15,16 తేదీల్లో ఖర్చులు అధికం. శ్రీరామరక్షాస్తోత్రాలు పఠించండి.

**ధనుస్సు : మూల, పూర్వాషాఢ, ఉత్తరాషాఢ 1వ పాదం**

ఏ కార్యక్రమమైనా అనుకున్న సమయానికి పూర్తి చేస్తారు. సమాజసేవలో నిమగ్నమవుతారు. నిరుద్యోగులు, విద్యార్థుల ప్రతిభ వెలుగు చూస్తుంది. వాహనాలు, భూములు కొనుగోలు. వ్యాపారులు సత్తా చాటుకుని లాభాలు. ఉద్యోగులకు విధినిర్వహణలో అవాంతరాలు తొలగుతాయి. రచయితలు, క్రీడా కారులకు గౌరవ పురస్కారాలు. 20,21 తేదీల్లో శారీరక రుగ్మతలు. శ్రీనృసింహస్తోత్రాలు పఠించండి.

**మకరం : ఉత్తరాషాఢ 2,3,4 పాదాలు, శ్రవణం, ధనిష్ఠ 1, 2 పాదాలు**

ఆదాయం పెరిగి అవసరాలు తీరతాయి. పలుకుబడి కలిగినవారితో పరిచయాలు సంతోషం కలిగిస్తాయి. బంధువులతో సత్సంబం ధాలు. మీ ప్రతిపాదనలు కుటుంబంలో ఆమోదం పొందుతాయి. వ్యాపారులు ఉత్సాహంగా సాగి లాభాలబాట పడతారు. ఉద్యోగులకు ఉన్నతస్థితి దక్కవచ్చు. పరిశోధకులు, క్రీడాకారులకు కొన్ని వివాదాలు తీరతాయి. 18,19 తేదీల్లో స్నేహితుల నుంచి విమర్శలు. హనుమాన్ ఛాలీసా పఠించండి.

**కుంభం : ధనిష్ఠ 3,4 పాదాలు, శతభిషం, పూర్వాభాద్ర 1,2,3 పాదాలు**

పుణ్యక్షేత్రాలు సందర్శిస్తారు. కుటుంబబాధ్యతలు పెరిగినా సమర్థతను చాటుకుంటారు. ఆశ్చర్యకరమైన సంఘటనలు ఎదురవుతాయి. వ్యాపారులు పెట్టుబడుల్లో మరింత నిదానించి సాగడం ఉత్తమం. పారిశ్రామికవేత్తలకు కొంత ఉత్సాహవంతంగా ఉంటుంది. కళాకారులు, రచయితల ఆశలు ఫలిస్తాయి. 16,17 తేదీల్లో ఖర్చులు అధికం. కుటుంబ సభ్యుల నుంచి ఒత్తిడులు. సూర్యారాధన చేయండి.

**మీనం : పూర్వాభాద్ర 4వ పాదం, ఉత్తరాభాద్ర, రేవతి**

కొన్ని కార్యక్రమాలు పూర్తి చేస్తారు. గృహం, వాహనాలు కొనుగోలు చేసే అవకాశం ఉంది. పుణ్యక్షేత్రాలు సందర్శిస్తారు. కుటుంబంలో కొన్ని సమస్యలు ఎదురైనా ఆత్మవిశ్వాసంతో అధిగమిస్తారు. వ్యాపారులకు కొత్త పెట్టుబడులు అందుతాయి. ఉద్యోగులపై అదనపు బాధ్యతలు. రాజకీయవేత్తల యత్నాలు. క్రీడాకారులు, పరిశోధకులకు ఉత్సాహవంతంగా గడుస్తుంది. 15,16 తేదీల్లో వృథా ఖర్చులు. అంగారక స్తోత్రాలు పఠించండి.

# పదరసం-472

| | | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|---|
| 1 | | 2 | | | 3 | 4 | | 5 | |
| | | | | 6 | | | | 7 | 8 |
| | 9 | | 10 | | 11 | | | | |
| | | | | | | | 12 | | |
| 13 | | | | | 14 | | | | |
| | | 15 | | 16 | | | | | |
| | | | | | | 17 | | 18 | 19 |
| 20 | | | | 21 | | | | | |
| | | | 22 | | | స | | | |
| 23 | | | | | 24 | | | | |

## ఆధారాలు

**అడ్డం**

1) పూర్తి స్పష్టం (అచ్చతెలుగు వాడుకభాషలో) (4)
3) ఇవి ప్రదర్శించనివాడంటే పూర్తి సాదాసీదా ఉండడం (4)
7) నిగ్గు, సారం తిరగబడింది (2)
9) మొక్కుకున్నట్లుగా వంటి మీది నగలన్నీ దేవునికి సమర్పించుట (6)
13) జత (2)
14) కుట్రపూరితమైన మోసం (5)
15) మూసీనది అసలు పేరు (4)
18) బరువు, చప్పుడు (2)
20) దాచి పిల్లలకు పెట్టే తినుబండారం (3)
21) అతి తెలివిగా ఉంటూ, బయటకు ఏమీ తెలియనట్లు ఉండే వ్యక్తి (4)
23) తనది తప్పయినప్పటికీ, అడ్డగోలుగా వాదించడం (4)
24) ఒక వ్యక్తి బలాన్ని, ప్రజ్ఞాపాటవాలను ఇలా అంటారు (5)

**నిలువు**

1) రథం (2)
2) అలలు (3)
4) ఇది కొట్టించడమంటే మోసం చేయడం (3)
5) తలక్రిందులైన పాము (2)
6) పైకొచ్చిన దారి (2)
8) చారిత్రక ప్రాంతాల దర్శనం (4)
9) గుడిసె మధ్యలో ఉండే ఆధార స్తంభం (3)
10) "పైకి" వేసిన బొమ్మ (4)
11) మృదువు (4)
12) రాత్రి కావలి (3)
13) అన్నమయ్య అందించిన ఒక ప్రముఖమైన జోలపాట (6)
15) రోకలివంటి ఆయుధం (3)
16) అపరంజి (3)
17) ఒక విషయం మీద ఇష్టం లేకపోవడం (4)
19) పెళ్లిళ్లలో వధూవరులు ఒకరి తలపై మరొకరు పోసుకునేవి (4)
22) కంపు ఎలుక (2)

## పదరసం - 471 సమాధానాలు

| | | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|---|
| చే[1] | త | ట[2] | డి | | ప్ర[3] | | ని[4] | ర్జ | త[5] |
| ట | | లి | | అ[6] | యో | మ | యం | | ది |
| పె[7] | ని | మి | టి[8] | | జ | | త[9] | న్మ[10] | య |
| య్య | | | ప[11] | రా | కు | | | న | |
| | లో[12] | గ | డ | | డు[13] | అ[14] | ను | ర్జ | |
| | ప | | క[15] | ల్కి | | చ్చె | | పు[16] | చ్చు[17] |
| పా[18] | ల | పి | ట్ట | | ని[19] | రు | డు | | పి |
| ద | | | క[20] | సి[21] | | వు | | రూ[22] | క |
| ర[23] | మ్మె | ట[24] | | పా[25] | గా | | | ప | |
| సం | | క[26] | సా | యి | | నం[27] | త | సి | ప |




# ఉందిలే మంచి కాలం ముందు ముందునా!

**అరుణ**

సకారాత్మక దృక్పథం మంచే చేస్తోంది. ఏమి జరుగుతుందో తెలియని సందర్భాలలో పాజిటివ్ యాటిట్యూడ్‌తో మేలు జరిగే ఆస్కారం ఉంటుంది. ఆ రకంగా చూసినప్పుడు ఈ యేడాది సినిమా రంగంలో ప్రథమార్ధంతో పోల్చితే ద్వితీయార్ధం బాగుంటుందనే అనిపిస్తోంది. ఎందుకంటే యువ కథానాయకుల చిత్రాలు అనేకం ఈ ఆరు నెలల్లో జనం ముందుకు రాబోతున్నాయి.

ఈ యేడాది తొలి అర్ధభాగం చివరిలో 'కల్కి 2898 ఎ.డి.' వంటి సినిమాతో థియేటర్లు కళకళలాడాయి. ఆ సినిమా మీద వచ్చిన విమర్శలను పక్కన పెడితే (ఓ రకంగా ఆ విమర్శలన్నీ సినిమా ప్రచారానికి ప్రత్యక్షంగానో, పరోక్షంగానో దోహదం చేశాయి) ఈ యేడాది జాతీయ స్థాయిలో రూ. 1,000 కోట్ల గ్రాస్‌ను వసూలు చేసిన సినిమాగా 'కల్కి' నిలిచింది. అలా వెయ్యి కోట్ల గ్రాస్‌ను అందుకున్న రెండు సినిమాలు ప్రభాస్ ఖాతాలో జమ అయ్యాయి. 'బాహుబలి –2' తర్వాత ఆ రేర్ రికార్డ్‌ను 'కల్కి' సాధించింది.




అయితే మొత్తంగా ప్రథమార్ధంలో లభించిన విజయాలు నిరాశను కలిగించేవే. ఈ నేపథ్యంలో యువతను ఆకట్టుకునే చిత్రాలు, తమిళ అనువాద చిత్రాలు రాబోతున్న ద్వితీయార్ధంపై అందరూ ఆశలు పెట్టుకుంటున్నారు. అలా ద్వితీయార్ధం తమిళ డబ్బింగ్ సినిమా 'భారతీయుడు –2' మొదలైంది. కమల్ హాసన్, సిద్ధార్థ్, రకుల్ ప్రీత్ సింగ్ కీలక పాత్రధారులుగా సుభాస్కరన్ నిర్మించిన ఈ సినిమాను శంకర్ డైరెక్ట్ చేశారు. 28 సంవత్సరాల క్రితం వచ్చిన 'భారతీయుడు'కు ఇది సీక్వెల్. ఇది తమిళ, తెలుగు, హిందీ భాషల్లో విడుదలైంది. జూలై 26న రిలీజ్ కాబోతున్న మరో తమిళ డబ్బింగ్ సినిమా 'రాయన్'. ధనుష్ హీరోగా నటించడంతో పాటు దర్శకత్వం వహించిన ఈ సినిమాలో సందీప్ కిషన్, అపర్ణ బాలమురళి, దుషార విజయన్ ప్రధాన పాత్రలు పోషించారు.దీనిని సూర్య పిక్చర్స్ సంస్థ నిర్మించగా, ఎ.ఆర్. రెహమాన్ సంగీతాన్ని అందించారు.


రామ్ పోతినేని హీరోగా పూరి జగన్నాథ్ తెరకెక్కిస్తున్న 'ఇస్మార్ట్ శంకర్' సీక్వెల్ 'డబుల్ ఇస్మార్ట్' ఆగస్ట్ 15న రాబోతోంది. ఇందులో సంజయ్ దత్ ప్రతి నాయకుడిగా నటించాడు. ఇదే రోజున హీరో రవితేజ, డైరెక్టర్ హరీశ్ శంకర్ కాంబినేషన్‌లో రూపుదిద్దుకుంటున్న మూడో చిత్రం 'మిస్టర్ బచ్చన్' వస్తుందని తెలుస్తోంది. ఈ సినిమాను పీపుల్స్ మీడియా ఫ్యాక్టరీ బ్యానర్‌పై టీజీ విశ్వప్రసాద్ నిర్మిస్తున్నారు. విక్రమ్ నటిస్తున్న తమిళ అనువాద చిత్రం 'తంగలాన్' సైతం ఆగస్ట్ 16న ఆగస్ట్ 16న విడుదల కావాల్సి ఉంది. ఇదే నెల 29న నాని నటిస్తున్న పాన్ ఇండియా మూవీ 'సరిపోదా శనివారం' వస్తోంది. 'హాయ్ నాన్న' తర్వాత నాని నటించిన ఈ యాక్షన్ డ్రామాను వివేక్ ఆత్రేయ దర్శకత్వంలో డీవీవీ దానయ్య నిర్మించారు.

తమిళ స్టార్ హీరో విజయ్ సినిమాలు ఇప్పుడు తమిళంతో పాటు తెలుగులోనూ ఒకే రోజున వస్తున్నాయి. పైగా విజయ్ ఇటీవలే తెలుగులో 'సార్' మూవీలోనూ నటించాడు. అతని తాజా చిత్రం 'ది గ్రేటెస్ట్ ఆఫ్ ఆల్ టైమ్' (గోట్) మూవీ సెప్టెంబర్ 5న విడుదల అవుతోంది. దీనిని రెండు తెలుగు రాష్ట్రాలలో మైత్రీ మూవీ మేకర్స్ సంస్థ విడుదల చేస్తోంది. మలయాళ కథానాయకుడు దుల్కర్ సల్మాన్ 'మహానటి, సీతారామం' చిత్రాలతో తెలుగు వారికి చేరువయ్యాడు. ఇటీవల వచ్చిన 'కల్కి'లోనూ అతిథి పాత్రలో మెరిశాడు. దుల్కర్ హీరోగా, వెంకీ అట్లూరి దర్శకత్వంలో సితార ఎంటర్ టైన్ మెంట్స్ సంస్థ 'లక్కీ భాస్కర్' అనే సినిమా నిర్మిస్తోంది. మీనాక్షి చౌదరి నాయిక. ఈ సినిమాను మొదట సెప్టెంబర్ 27న విడుదల చేయాలని అనుకున్నారు కానీ ఇప్పుడు ప్రీ పోన్ చేసి సెప్టెంబర్ 7న రిలీజ్ చేస్తున్నారు. ఇది దుల్కర్ సల్మాన్ తండ్రి, ప్రముఖ నటుడు మమ్ముటి పుట్టినరోజు కావడం విశేషం. అదే నెలాఖరులో 27న ఎన్టీయార్ నటిస్తున్న 'దేవర' సినిమా విడుదల కాబోతోంది. 'ట్రిపుల్ ఆర్' తర్వాత వస్తున్న ఎన్టీయార్ సినిమా ఇదే. ఈ మూవీతోనే శ్రీదేవి కుమార్తె జాన్వీ కపూర్ తెలుగు చిత్రసీమలోకి అడుగుపెడుతోంది. ఈ సినిమా విడుదల కాకముందే ఆమె రామ్ చరణ్ తేజ్ కొత్త సినిమాలోనూ కథానాయికగా ఎంపికైంది.


అక్టోబర్ మాసంలోనూ అనువాద చిత్రాలు హంగామా సృష్టించబోతున్నాయి. ఆ నెల 10వ తేదీన సూర్య పాన్ ఇండియా మూవీ 'కంగువా', రజనీకాంత్ 'వేట్టయాన్' చిత్రాలు విడుదల కాబోతున్నాయి. అన్నీ అనుకూలిస్తే... శంకర్ దర్శకత్వంలో రామ్ చరణ్ తో దిల్ రాజు నిర్మిస్తున్న 'గేమ్ ఛేంజర్' కూడా అదే నెలలో రావాలి. నవంబర్ మాసంలో విడుదలయ్యే సినిమాల వివరాలు ఇంకా తెలియ రాలేదు. డిసెంబర్‌లో పవన్ కళ్యాణ్ నటిస్తున్న 'హరిహర వీరమల్లు' రిలీజ్ అవుతుందని అంటున్నారు. ఏపీలో కొత్తగా ఏర్పడిన ప్రభుత్వంలో ఉప ముఖ్యమంత్రిగా పవన్ కళ్యాణ్ బాధ్యతలు స్వీకరించారు. పాలన కాస్తంత గాడిలో పడిన తర్వాత సెట్స్ మీద ఉన్న సినిమాలను పూర్తి చేస్తానని నిర్మాతలకు హామీ ఇచ్చారాయన. ఆ రకంగా సెప్టెంబర్, అక్టోబర్ నాటికి 'హరిహర వీరమల్లు' షూటింగ్ పూర్తయ్యే ఆస్కారం ఉంది. డిసెంబర్ మాసంలోనే అల్లు అర్జున్ 'పుష్ప –2' రాబోతోంది. ఈ సినిమాపై భారీ అంచనాలు ఉన్నాయి. దీనితో పాటు అదే నెల 20న నితిన్ నటిస్తున్న 'రాబిన్ హుడ్' మూవీ విడుదల కానుంది. మొత్తం మీద యువతను ఆకట్టుకునే యువ కథానాయకులు, తమిళ అనువాద చిత్రాలు ఈ ఆరు నెలల్లో చాలానే రాబోతున్నాయి. రెగ్యులర్ గా వచ్చే అప్ కమింగ్ హీరోల సినిమాలు ఉండనే ఉంటాయి. వాటిల్లో ఏ కొన్ని విజయం సాధించినా చిత్రసీమ కాస్తంత ఊపిరి పీల్చు కుంటుంది.

వ్యాసకర్త : సీనియర్ జర్నలిస్ట్


# జాతీయ భావాలను మేల్కొల్పే ఉత్తమ సాహిత్యం
# మీరు తప్పక చదివి, పదిమందిచే చదివించదగిన పుస్తకాలు





వెల : ₹.90/-




వెల : ₹.390/-





వెల : ₹.220/-





వెల : ₹.360/-





వెల : ₹.200/-




వెల : ₹.360/-





వెల : ₹.300/-





వెల : ₹.200/-





వెల : ₹.90/-





వెల : ₹.100/-





వెల : ₹.250/-





వెల : ₹.799/-




వెల :₹.495/-




వెల : ₹.549/-




వెల : ₹.399/-

**పై పుస్తకములకు మరియు క్రొత్త, పాత నవయుగ భారతి ప్రచురణలకై సంప్రదించండి**

ఫోన్ ద్వారా మీకు కావలసిన పుస్తకాలు తెలియజేయండి! రిజిష్టరు పోస్టులో అందుకోండి!!

సాహిత్య నికేతన్ : 3-4-852, కేశవనిలయం, బర్కత్‌పురా, హైదరాబాద్ -27.

040-27563236, 9290127329

సాహిత్య నికేతన్ : ఏలూరు రోడ్, గవర్నరు పేట, విజయవాడ - 2, దూరవాణి : 8333812687

From: JAGRITI Telugu Weekly
Jagriti Bhavan, H.No.3-4-228/4/1, Lingampally,
Kachiguda, Hyderabad-500027; email: jagritiweekly@gmail.com

Publishing on Every Thursday; Posting on Every Friday & Saturday
Postal Regn. No. HSE/1052/2024-2026; RNI Regd. No. 3270/57.
Volume : 76 Issue : 36

*With best compliments from:*

Estd : 1994-95

# G.PULLA REDDY COLLEGE OF PHARMACY

Affiliated to Osmania University, Hyderabad
Approved by PCI & Accredited by NAAC,
G.Pulla Reddy Educational Campus, Mehdipatnam, Hyderabad-500 028.
Phone : +91 8297511177
Email: gprcphyd@gmail.com I website : gprcp.ac.in

EAMCET Code : GPRP

PGECET Code : GPRP1



## COURSES OFFERED

**B.Pharm**

**M.Pharm**

1. M.Pharm (Pharma. Chemistry)
2. M.Pharm (Pharmaceutics)
3. M.Pharm (Pharmacology)
4. M.Pharm (Pharma. Analysis)
5. M.Pharm (Pharma. Regulatory Affairs)

**Pharm D**

Founder Chairman
Late G. Pulla Reddy

Chairman
Sri P. Subba Reddy

Managing Trustee
Sri G. Raghava Reddy